www.prajaswaramdaily.com

# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి : 17 | సంచిక : 289 | పేజీలు : 11 | వెల : 1

Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | శనివారం 29-06-2024

MHR TV
www. mhrtv.com



## నేడు ఫైనల్ ఫైట్

టీ 20లో భారత్, సౌత్ ఆఫ్రికా మధ్య తుది సమరం

బార్బడోస్ లో శనివారం రాత్రి 8 గంటలకు ప్రారంభం | 3

పొంచి ఉన్న వరుణుడి ముప్పు



## కొండగట్టుకు పవన్ కల్యాణ్

ఆంజనేయ స్వామికి ప్రత్యేకపూజలు | 3

భారీ ఏర్పాట్లు చేస్తున్న జనసేన శ్రేణులు



## బీఆర్ఎస్ మరో షాక్

ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో | 2

కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య





# ఈ సారికి నో వెకెన్సీ..!

## మంత్రి వర్గ విస్తరణ ఇప్పట్లో లేనట్లేనా..?

- ఖాళీలు లేవంటూ ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు
- ఆశావహులకు మరికొంత కాలం ఎదురు చూపులు తప్పవా..?
- క్యాబినెట్‌లో 6 స్థానాల భర్తీ కోసం కొనసా గుతున్న కసరత్తు
- తమ వారికి బెర్త్ కన్ఫామ్ చేయాలంటూ మంత్రుల సిఫారసు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను గద్దెనెక్కిస్తే తిరుగుబాటు తప్పదని సంకేతాలు
- ముఖ్యమంత్రితో పాటు హైకమాండ్ పైనా తీవ్ర ఒత్తిడి



**హైదరాబాద్, జూన్ 28, (ప్రజాస్వరం):** తెలంగాణ మంత్రివర్గంలో ఆరు ఖాళీలు ఉన్నాయి. కేవలం పన్నెండు మంది మంత్రులు మాత్రమే ఉన్నారు. కీలక మంత్రిత్వ శాఖలన్నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గరే ఉన్నాయి. అంతే కాదు పదేళ్లుగా పార్టీ కోసం పోరాడి ఎమ్మెల్యేలుగా గెలిచిన సీనియర్ నేతలు మంత్రి పదవుల కోసం ఆరాటంగా ఎదురు చూస్తున్నారు. ఇలాంటి వారందరికీ పార్టీ అధినాయకత్వం లోక్ సభ ఎన్నికల డెడ్ లైన్ పెట్టింది. మంచి ఫలితాలు సాధిస్తే మంత్రివర్గంలో చోటు కల్పిస్తామని ఆశ కల్పించారు. దీంతో అందరూ శ్రమపడ్డారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అయితే అభ్యర్థిగా రేవంత్ రెడ్డి సన్నిహితుడుగా పేరు తెచ్చుకున్న సామల కిరణ్ కుమార్ రెడ్డికి టిక్కెట్ ఇచ్చినా దగ్గరుండి గెలిపించుకున్నారు. ఇలాంటి ఆశావహులంతా ఆశగా ఎదురు చూస్తున్న తరుణంలో రేవంత్ రెడ్డి ఢిల్లీలో మిగతా 2 లో..



కర్ణాటక రాష్ట్రం హవేరి జిల్లాలో లారీని ఢీకొన్న టెంపో

# రహదారులు రక్తసిక్తం

- కర్ణాటక హవేరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన టెంపో
- 13 మంది మృతి
- సవదత్తి ఆలయానికి వెళ్లి వస్తుండగా ఘటన
- మెదక్ జిల్లాలో రెండు లారీలు ఢీ
- అక్కడికక్కడే ప్రాణా లొదిలిన ఐదుగురు

## పూణె - బెంగళూరు హైవేపై ఘటన

మరోవైపు ఇక్కడ..



మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం శివారు వద్ద జరిగిన యాక్సిడెంట్‌లో ధ్వంసమైన లారీ

సింగరేణిని కాపాడుకునేందుకు ఉద్యమ కార్యాచరణ

యాక్షన్ ప్లాన్ సిద్ధం

జులై 1 నుంచి 9 వరకు ఆందోళన కార్యక్రమాలు | 2



## బీఆర్ఎస్ పోరుబాట

## కార్యకర్తలనే నాయకులు చేస్తం

- బీఆర్ఎస్‌కు ఆదరణ ఎన్నటికీ తగ్గదు
- కాంగ్రెస్ మోసాన్ని ప్రజలు గ్రహిస్తరు
- బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్
- బాల్కొండ, హుజూరాబాద్, ఆర్మూర్ క్యాడర్‌తో సమావేశం | 3
- భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం



సమావేశంలో పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్

## పీవీ మన ఠీవీ



ఢిల్లీలోని అధికారిక నివాసంలో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ఫొటోకు నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్


ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు నర్సింహారావు

దేశ ఖ్యాతిని ప్రపంచం నలుదిక్కులా చాటిన మహోన్నత వ్యక్తి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి | 2

ఢిల్లీలోని అధికారిక నివాసంలో ఘనంగా నివాళి

రాష్ట్రవ్యాప్తంగా జయంతి వేడుకలు



కూలిన ఢిల్లీ ఎయిర్ పోర్టు పై కప్పు | 2

ఒకరు మృతి.. ఆరుగురికి గాయాలు



పోలవరంపై శ్వేతపత్రం విడుదల సందర్భంగా సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

## రివర్స్ టెండర్లే

## పోలవరానికి శాపం

- వైసీపీ సర్కార్ రూ.600 కోట్లు మిగిల్చామని.. వేల కోట్ల నష్టం చేసింది
- టీడీపీ హయాంలో యజ్ఞంలా పనులు సాగాయి
- ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు పూర్తి చేశాం
- ఐదేండ్లలో అంతా రివర్స్ అయింది | 3
- ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు
- పోలవరంపై శ్వేతపత్రం విడుదల

హేమంత్ సోరేన్‌కు బెయిల్ | 2

# ఈ సారికి..నో వెకెన్సీ..!




(మొదటి పేజీ తరువాయి)

అసలు విషయం చల్లగా చెప్పారు. అసలు మంత్రివర్గంలో ఖాళీలు లేవని తేల్చేశారు. ఇలా ఎందుకు చెప్పాల్సి వచ్చిందన్న దానిపై ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోనే విస్తృత చర్చ జరుగుతోంది. తెలంగాణలో మొత్తం శాసనసభ్యుల సంఖ్య 119. ఇందులో పదిహేను శాతం మందికి మాత్రమే మంత్రులుగా ఉండేందుకు అవకాశం ఉంది. అంటే ముఖ్యమంత్రి సహా పద్దెనిమిది మంది మంత్రులకు అవకాశం ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు సీఎం రేవంత్ రెడ్డితోపాటు మరో పదకొండు మంది ప్రమాణం చేశారు. అంటే పన్నెండు మంది ప్రమాణం చేశారు. మరో ఆరు ఖాళీలు ఉన్నాయి. సామాజికవర్గాల ప్రకారం చూస్తే పన్నెండు మందిలో ముఖ్యమంత్రితో సహా నలుగురు రెడ్లకు చోటు లభించింది. మంత్రులుగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పదవులు పొందారు. ఎస్సీల్లో మాల సామాజిక వర్గానికి చెందిన భట్టి విక్రమార్కకు డిప్యూటీ పదవి లభించింది. మరో మాదిగ సామాజిక వర్గానికి చెందిన దామోదర రాజనర్సింహాకు మంత్రి లభించింది. ఎస్టీల్లో ఆదివాసీ వర్గం నుంచి సీనియర్ అయిన ధనసరి అనసూయ అలియాస్ సీతక్కకు కేబినెట్ లో చోటు దక్కింది. బీసీల్లో గౌడ సామాజిక వర్గానికి చెందిన పొన్నం ప్రభాకర్, పద్మశాలి వర్గానికి చెందిన కొండా సురేఖకు చోటు దక్కింది. బ్రాహ్మణ సామాజికవర్గం నుంచి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కమ్మ సామాజికవర్గం నుంచి తుమ్మల నాగేశ్వరరావు, వెలమ సామాజిక వర్గం నుంచి జూపల్లి కృష్ణారావు ప్రమాణస్వీకారం చేశారు. మంత్రివర్గంలో ఆరుగురు ఓసీలు ఉంటే...బీసీలు ఇద్దరు, ఎస్సీలు ఇద్దరు, గిరిజనులు ఒకరు ఉన్నారు.

మంత్రి పదవులు ప్రతి జిల్లాకు ఉండేలా చూసుకుంటారు. తెలంగాణలో జిల్లాలు ఎక్కువ కాబట్టి ఉమ్మడి జిల్లాలకు అయినా కనీసం ఒక్కరైనా మంత్రి పదవి ఉండేల చూసుకుం టారు.కానీ ఈ విషయంలో రేవంత్ రెడ్డి సమన్యాయం చేయలేకపోయారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నేతలకు కేబినెట్ లో చోటు లభించలేదు. ఈ జిల్లాల నుంచి పలువురు నేతలు ఎమ్మెల్యేలుగా గెలుపొందినప్పటికీ...సామాజిక సమీకరణాల భాగంగా పరిగణలోకి తీసుకోలేదని తెలుస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి సీనియర్ నేతలు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట్ స్వామి, మాజీ మంత్రి గడ్డం వినోద్, ప్రేమ్ సాగర్ రావు కేబినెట్ లో చోటు ఆశిస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి సీనియర్ నేత, మాజీ మంత్రి, బోధన్ నుంచి గెలుపొందిన సుదర్శన్ రెడ్డి కూడా మంత్రివర్గంలోకి తీసుకుంటారని ఎదురు చూస్తున్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సీనియర్ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి... కేబినెట్ లో అవకాశం లభిస్తుందని ఆశించారు. వీరికి కూడా అమాత్య పదవి దక్కలేదు. హైదరాబాద్ లో ఒక్కరు కూడా కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందలేదు. దీంతో పార్టీలో చేరిన దానం నాగేందర్ మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. అదే సమయంలో ఖమ్మం జిల్లాకు మూడు, కరీంనగర్, వరంగల్, నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలకు రెండేసి పదవులు దక్కాయి. మంత్రి పదవుల కోసం రేవంత్ రెడ్డితో పాటు హైకమాండ్ పైనా తీవ్ర ఒత్తిడి ఉంది. కనీసం నాలుగైదు స్థానాలను భర్తీ చేసి ఒక్క దాన్ని ఖాళీగా ఉంచాలనుకున్నారు. ఈ మేరకు జాబితా సిద్ధం చేసి కాంగ్రెస్ వద్దకు రేవంత్ రెడ్డి తీసుకెళ్లారని ప్రచారం జరుగుతోంది. కొత్తగా చేర్చుకున్న వారిలో ఒకరిద్దరికి మంత్రి పదవులు ఇచ్చేందుకు రేవంత్ సిద్ధమయ్యారని భావిస్తున్నారు. అయితే హైకమాండ్ దీనికి అంగీకరించలేదని తెలుస్తోంది. అదే సమయంలో మంత్రి పదవుల విషయంలో తమ సిఫారసులు చూడాలని భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి వంటి వాళ్లు కూడా కొన్ని పేర్లను హైకమాండ్ కు ఇచ్చారు. ఆ పేర్లు.. రేవంత్ రెడ్డి ఇచ్చిన పేర్లు వేర్వేరు. వాటిలో పేర్లను ఖరారు చేస్తే వర్గ పోరాటం మరింత పెరుగుతుందన్న ఆందోళనతో కాంగ్రెస్ పార్టీ ఏకాభిప్రాయానికి రావాలని ముఖ్యమంత్రితో పాటు ఇతర నేతలకు సహాలిచ్చినట్లుగా తెలుస్తోంది.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్ని పార్టీలో చేర్చుకోవడమే కాదు.. వారికి మంత్రి పదవులు కూడా ఇస్తే పార్టీలో తిరుగుబాటు వస్తుందని.. పార్టీని నమ్ముకున్న వారికి అవకాశం ఇవ్వాలన్న డిమాండ్ సహజంగానే వినిపిస్తోంది. అదే సమయంలో భర్తీచేయాల్సిన పదవులు ఆరే ఉన్నాయి. కానీ ఆశించేవారు అంత కంటే ఎక్కువ ఉన్నారు. ఎవరికి ఇచ్చి ఎవరికి ఇవ్వకపోయినా మిగిలిన వాళ్లు అసంతృప్తికి గురవుతారు. మామూలుగా అయితే పార్టీని నమ్ముకున్న వారికి పదవులు ఇచ్చి.. సామాజిక సమీకరణాలు కుదరని వారికి ఎలాగోలా సర్ది చెప్పుకుని రేవంత్ బయటపడేవారు. కానీ బీఆర్ఎస్ ను బలహీనం చేయాలన్న లక్ష్యంతో ఆపరేషన్ ఆకర్ష్ ను ప్రయోగించి బీఆర్ఎస్ పార్టీ నేతల్ని చేర్చుకుంటూండటంతో కొత్త తలనొప్పులు వస్తున్నాయి. హైదరాబాద్ కు మంత్రి ఉండాలంటే.. ఇప్పుడు దానం నాగేందర్ తో ప్రమాణం చేయించాలి. ఎంపీగా ఓడిపోతే ఆయనకు పదవి ఇస్తామని హామీ ఇచ్చారన్న ప్రచారం ముందు నుంచీ జరుగుతోంది. ఆయనకు పదవి ఇస్తే ఇతర కాంగ్రెస్ నేతలు ఫైర్ అవుతారు. అలాగే మరికొంత మందినేతల చేరికపైనా పార్టీలో అసంతృప్తి ఉంది. అన్నీ కలిపి రేవంత్ రెడ్డి కి వ్యతిరేకంగా మారుతూండటంతోనే ఆయన మంత్రివర్గ విస్తరణ విషయాన్ని తాత్కలికంగా పక్కకు పెట్టేశారని అంటున్నారు. అయితే.. ఈ పదవుల కోసం ఎప్పుడూ ఒత్తిడి ఉంటూనే ఉంటుంది. రేవంత్ పరిష్కరించుకోలేని సమస్యగా దీన్ని పక్కన పెట్టేస్తే అంతకంతకూ పెరుగుతూనే ఉంటుందన్న అభిప్రాయం కూడా వినిపిస్తోంది.

# బీఆర్ఎస్ పోరుబాట




## సింగరేణిని కాపాడుకునేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం

### జూలై 1 నుంచి 9 వరకు ఆందోళనలు

**హైదరాబాద్, జూన్ 28, (ప్రజాస్వరం) :** తెలంగాణలో సింగరేణి చిచ్చు .. పొలిటికల్ గా అంతకంతకూ అగ్గిరాజేస్తోంది. సింగరేణిలో బొగ్గుగనుల వేలాన్ని వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్ యాక్షన్ ప్లాన్ రెడీ చేసింది. ఈ క్రమంలోనే సింగరేణి పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు, బొగ్గు గని కార్మిక సంఘం నేతలతో సమావేశమైన కేటీఆర్ మరోసారి ఉద్యమించి సింగరేణిని కాపాడుకుంటామని చెప్పారు. సింగరేణిని ప్రైవేటీకరించేందుకే కేంద్రం తెలంగాణ బొగ్గు గనులను వేలం వేసిందని కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్రంతో రాష్ట్ర ముఖ్యమంత్రి కుమ్మక్కు అయి వాళ్లకు బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు. లాభసాటిగా ఉన్న సింగరేణికి బొగ్గు గనులు కేటాయించకుండా నష్టాల్లోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని దీనిని అడ్డుకోవాలంటూ పిలుపునిచ్చారు. కేటీఆర్ తో భేటీ అనంతరం ఉద్యమ కార్యాచరణ ప్రకటించింది బొగ్గుగని కార్మిక సంఘం. జూలై 1 నుంచి 9న వరకు నిరసనలు, భారీధర్నా, రెండవ దశలో కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వాలని, ఇందిరాపార్క్ దగ్గర ధర్నా చేపట్టాలని నిర్ణయించింది. పార్లమెంట్ సమావేశాల వేళ ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర ధర్నా కూడా చేయాలని ప్లాన్ చేస్తోంది.

**బొగ్గుగని కార్మిక సంఘం యాక్షన్ ప్లాన్..**

జులై 1న నల్ల బ్యాడ్జీలతో నిరసన
జులై 3న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం
జులై 6న జి.ఎం.ఆఫీసుల మందు ధర్నా
జులై 9న గోదావరిఖనిలో భారీధర్నా

**రెండవ దశలో కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు**
**ఇందిరాపార్క్ దగ్గర ధర్నా చేపట్టాలని నిర్ణయం**
**పార్లమెంట్ సమావేశాల వేళ ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర ఆందోళన**

సింగరేణి గురించి బీఆర్ఎస్ మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించడమే అంటోంది బీజేపీ. సింగరేణి లో ఓపెన్ కాస్ట్ లను ప్రైవేట్ వాళ్ళకి కట్టబెట్టిందే కేసీఆర్ అని ఆరోపించారు కమలం నేతలు. మరోవైపు, బీఆర్ ఎస్, బీజేపీలు కలిసి పదేళ్లలో సింగరేణిని ధ్వంసం చేశాయని ఆరోపిస్తున్నారు హస్తం నేతలు. మరి, సింగరేణిపై ఈ చిచ్చు మున్ముందు ఎటు దారితీస్తుందో వేచి చూడాల్సిందే.

# కుప్పకూలిన ఢిల్లీ ఎయిర్ పోర్టు పైకప్పు



పైకప్పు కూలడంతో ధ్వంసమైన వాహనాలు

**న్యూఢిల్లీ, జూన్ 28 :** ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఇందిరాగాంధీ విమానాశ్రయంలోని టెర్మినల్ 1లో కొంత పైకప్పు భాగం కూప్ప కూలింది. ప్రమాదం లో ఒకరు మృతి చెందగా.. 8 మంది గాయపడ్డారు. ప్రమాదంలో పైకప్పు కింది పార్క్ చేసిన అనేక వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. పైకప్పు కూలడంతో కారులోని వ్యక్తిమృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా పలు విమానాలు రద్దు చేశారు. ఈ ఘటనపై కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ఢిల్లీ విమానాశ్రయంలో వ్యక్తిగతంగా తాను పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. క్షతగాత్రులకు చికిత్స కొనసాగుతోందని ట్వీట్ చేశారు. టెర్మినల్–1 దగ్గర సహాయక చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 2 వరకు టెర్మినల్–1 నుంచి డిపార్చర్ కు బ్రేక్ ఇచ్చారు. పునరుద్ధరణ పనుల అనంతరం సర్వీసులను కొనసాగించారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఎయిర్ పోర్టుకు చేరుకుని టెర్మినల్ రూఫ్ పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను వివరాలు అడిగితెలుసుకున్నారు. ఢిల్లీలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, ఫరీదాబాద్ సహా ఎన్సీఆర్ లో ఏకధాటిగా వర్షం పడుతోంది. ఆర్కేపురం, సరితా విహార్, మునిర్కా, ఇండియా గేట్ ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# హేమంత్ సోరేన్‌కు బెయిల్

**రాంచీ జూన్ 28 :** జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ కు జార్ఖండ్ హైకోర్టు భూ కుంభకోణం కేసులో బెయిలు మంజూరు చేసింది. ఇదిలావుండగా ఆయన తరపు లాయర్ అరుణభ్ చౌదరి కోర్టు ఆయన ఎలాంటి అపరాధం చేయలేదని భావించిందన్నారు. సోరేన్ పెట్టుకున్న బెయిల్ పై హైకోర్టు జూన్ 13 నిర్ణయాన్ని నిలిపి ఉంచింది.ప్రస్తుతం హేమంత్ సోరేన్ రాంచీలోని బిర్సాముండా జైలులో ఉన్నారు. ఆయన జార్ఖండ్ ముక్తి మోర్చా(జెఎంఎం) కార్యనిర్వాహక అధ్యక్షుడు. సోరేన్ ను ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్(ఈడి) జనవరి 31న అరెస్టు చేసింది. ఇదిలావుండగా ఈడి తరఫు న్యాయవాది ఎస్. వి. రాజు మాత్రం హేమంత్ సోరేన్ భూ అక్రమాలకు పాల్పడ్డారని సాక్షులు ధ్రువీకరించారని అన్నారు.

# ఆర్థిక సంస్కరణలకు ఆధ్యుడు పీవీ

- దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఢిల్లీలోని అధికారిక నివాసంలో ఘనంగా నివాళి
- హైదరాబాద్ జ్ఞాన్ భూమిలో ప్రజాప్రతి నిధులు, ప్రముఖుల నివాళి



జ్ఞాన్ భూమిలో పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

**న్యూఢిల్లీ, హైదరాబాద్ జూన్ 28 :** సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు జయంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పీవీ చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రంలో వివిధ శాఖల మంత్రిగా, ప్రధానమంత్రిగా పీవీ చేసిన సేవలు మరువరానివని పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి రెడ్డి నివాళుల ర్పించారు.

హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పీవీ నర్సింహారావు చిత్రపటానికి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య నేతలు , కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ముద్దు బిడ్డ, హుస్నాబాద్ నియోజకవర్గ ముద్దు బిడ్డ పీవీ నరసింహారావు ఈ దేశానికి ,ప్రపంచానికి ఎంతో పేరు తెచ్చారని కొనియాడారు. దేశ ప్రధానిగా భూ సంస్కరణలు , ఆర్థిక సంస్కరణలు తేవడం వల్ల ప్రపంచంలో ఆర్థిక శక్తిగా ఎదుగుతుంది.. వారు చూపిన మార్గదర్శకంలో తామంతా నడవాలని కోరుకుంటున్నామన్నారు. నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు తెచ్చి విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తెచ్చిన వ్యక్తి.. విద్యకు ప్రాధాన్యత తెచ్చిన వ్యక్తి. అయన దేశ ప్రధానిగా చేసిన సేవలు గుర్తు చేసుకుంటూ వారికి ఘనంగా నివాళులు అర్పిస్తున్నానని అన్నారు.

భారత రత్న, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 103 వ జయంతి హైదరాబాద్ నెక్లెస్ రోడ్ పీవీ మార్గ్ లోని జ్ఞాన్ భూమిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పీవీ నర్సింహా రావుకు నివాళులు అర్పించిన వారిలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి, హైకోర్ట్ జడ్జి ఎన్ వీ శ్రవన్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కరే వేణుగోపాల్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, బీసీ కమీషన్ చైర్మన్ కృష్ణ మోహన్ రావు, పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ వాణీదేవి, కుమారుడు పీవీ ప్రభాకర్ రావు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి , సమాచార పౌర సంబంధాల శాఖ కమిష నర్ హనుమంతరావు, హైదరాబాద్ కలెక్ట ర్ అనుదీప్, మాజీ మంత్రి జానా రెడ్డి కోదండ రామ్, వీ. హనుమంత రావు ఉన్నారు.





హుస్నాబాద్ లో పీవీ ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# బీఆర్ఎస్ మరో షాక్

## కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

## ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో హస్తం తీర్థం


### మూడు వరుసగా మూడు సార్లు గెలుపు



సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇన్ చార్జి దీపాదాస్ సమక్షంలో కాంగ్రెస్ లో చేరుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

**హైదరాబాద్, జూన్ 28, (ప్రజాస్వరం) :** బీఆర్ఎస్‌కు షాక్‌లమీద షాక్‌లు తగులుతున్నాయి. తాజాగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య.. కారు దిగి హస్తం గూటికి చేరుకున్నారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతోపాటు పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు ఉన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల నియోజకవర్గం నుంచి యాదయ్య మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో కాంగ్రెస్ తరపున గెలిచిన ఆయన.. ఆ తర్వాత బీఆర్ఎస్ గూటికి చేరారు. 2018 ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన యాదయ్య.. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 268 ఓట్ల తేడాతో బయటపడ్డారు. కాలె యాదయ్య చేరికతో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య ఆరుకు చేరింది. దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్ ఇప్పటికే బీఆర్ఎస్‌కు బై చెప్పి కాంగ్రెస్‌లో చేరిపోయారు. చేరికలపై సొంత పార్టీ నేతల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా.. పీసీసీ చీఫ్, ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి తగ్గేదేలే అంటున్నారు. ఈ జంపింగ్స్ ఇక్కడితో ఆగవని చెప్పకనే చెప్పేశారు. ఫస్ట్ సీజన్‌లో ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకున్న రేవంత్‌రెడ్డి.. తాజాగా సెకండ్ సీజన్‌ను పోచారం శ్రీనివాస్ రెడ్డితో స్టార్ట్ చేశారు. ఓవైపు పాలనలో స్పీడు పెంచిన సీఎం రేవంత్ రెడ్డి.. అటు టీపీసీసీ అధ్యక్షుడిగా ఆపరేషన్ ఆకర్ష్ ప్రక్రియలో కూడా అదే దూకుడు కనబరుస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 39 ఎమ్మెల్యే సీట్లు గెలుచుకుని ప్రతిపక్షానికి పరిమితమైన బీఆర్ఎస్ పార్టీ.. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో కనీసం ఖాతా కూడా తెరవకుండా పీకల్లోతు కష్టాల్లో పడింది.ఇటీవలే పార్టీ నేతలతో సమావేశమైన కేసీఆర్ భవిష్యత్తుపై వారికి భరోసా కల్పించే ప్రయత్నిస్తున్నా పార్టీ నుంచి మాత్రం వలసలు ఆగడం లేదు.

# కవితను కలిసిన హరీశ్



**న్యూఢిల్లీ, జూన్ 28 :** ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టు అయి తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో మాజీ మంత్రి హరీశ్ రావు శుక్రవారం ములాఖత్ అయ్యారు. ఈ ములాఖాత్ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నట్లుగా తెలుస్తోంది. బెయిల్ పిటిషన్లపై విచారణతో పాటు కుటుంబానికి చెందిన పలు అంశాలపై చర్చించినట్లుగా సమాచారం. ఇటీవలే మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, కేటీఆర్ కవితను కలిశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని జులై 5వ తేదీ వరకు పొడిగిస్తూ ఇటీవల ఢిల్లీ రౌస్ ఎవెన్యూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. లిక్కర్ స్కాం కేసులో మార్చి 15వ తేదీన ఈడీ హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో అరెస్ట్ చేసింది. అప్పటి నుంచి రిమాండ్ మీద ఆమె తీహార్ జైల్లో ఉన్నారు.

# గనులను సింగరేణికి కేటాయించాలి

## రాష్ట్ర బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలి

## వేలం పాటలో కాంగ్రెస్ పాల్గొనడం సిగ్గుచేటు

## ఖమ్మం సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు




బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా ఖమ్మంలో నిరసన చేపడుతున్న సీపీఎం


**ఖమ్మం జూన్ 28 (ప్రజాస్వరం):** కేంద్ర బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటను ఆపి సింగరేణికి నేరుగా కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక సరిత క్లినిక్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో నున్నా మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేంద్ర బీజేపీ ప్రభుత్వం వేలంపాటను వేస్తున్నదని సింగరేణి కంపెనీ కూడా ప్రైవేట్ సంస్థలతో వేలం పాటలో పోటీపడాలనే స్థితికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. వాస్తవానికి శ్రావణపల్లిలో సింగరేణి సంస్థ బొగ్గు తవ్వాలి. కానీ వేలంపాట ద్వారా ప్రైవేట్ సంస్థలకు అవకాశం కల్పించి బొగ్గు గనులను కేటాయించడం సరైంది కాదన్నారు. మన రాష్ట్రం నుంచి బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలంపాటను ప్రారంభించడం సిగ్గుచేటని అన్నారు. బొగ్గు గనులన్నీ ప్రైవేటు సంస్థలకు ఇచ్చిన తర్వాత సింగరేణికి మిగిలేదేముంటుందని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ వలన క్రమంగా సింగరేణి సంస్థను బలహీనపరిచి నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. నగదీకరణ పేరుతో దేశంలో ఆరు లక్షల కోట్ల విలువైన ఆస్తులను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టిందని. అందులో భాగంగానే కోట్ల విలువైన గనులను ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలని నిర్ణయాన్ని తీసుకుందని విమర్శించారు. గత పది సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం దాదాపుగా 200 బొగ్గు బావులను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టారని, ప్రభుత్వ రంగంలో గనులు లేకపోతే యువతకు ఉపాధి అవకాశాలు కనుమరుగవుతాయి అని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి కూడా బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకోలేకపోయారని విమర్శించారు. ప్రస్తుతం సింగరేణి 40 వేల మంది పర్మినెంట్ కార్మికులకు, మరో 26 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నదని, రికార్డు స్థాయిలో అతి తక్కువ ధరకే నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్న ఘనత సింగరేణి సంస్థకే చెందుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అనేక రూపాలలో ఆదాయాన్ని తీసుకొస్తున్న సింగరేణిని ప్రైవేటీకరణ అప్పజెప్పి ప్రభుత్వ ఉపాధి అవకాశాలను కొల్లగొడుతున్న కేంద్ర ప్రభుత్వ ధమననీతిని రాష్ట్ర ప్రజానీకం ఖండించాలని అన్నారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణ వేగంగా జరిగితే విద్యుత్తు ధర విపరీతంగా పెరుగుతుందని అన్నారు. సింగరేణికి చెందిన 22 బొగ్గు బావుల్లో బొగ్గు నిల్వలు అడుగంటి పోయాయని కొత్త బ్లాకులో తవ్వకాలు ప్రారంభించాలని కానీ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఇందుకు అనుమతించకుండా మోకాలొడ్డుతున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల తెలంగాణ ప్రజానీకానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని వేలంపాట ప్రారంభ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో పాటు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొనటం ఆశ్చర్యకరమని ఇది వేలంపాట ప్రక్రియను ఆమోదించడమే కదా అని ఆయన అన్నారు. కాబట్టి శ్రావణపల్లి బ్లాకుతో పాటు మిగతా బ్లాక్ లను కూడా తక్షణమే సింగరేణికి అప్పగించాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని కలుపుకొని కేంద్రం మీద ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకొని శాసనసభ తీర్మానం చేయాలని లేని పక్షంలో ప్రజానీకాన్ని కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రం, సింగరేణి బొగ్గుగని కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు, సీపీఎం రాష్ట్ర నాయకులు తాళ్ళ నాగరాజు, జిల్లా కమిటి సభ్యులు మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, ఎస్.కె.బషీరుద్దీన్, ఆర్.ప్రకాష్, పార్టీ 2 టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, 3 టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీను, అర్బన్ మండల కార్యదర్శి బత్తిని ఉపేందర్, జిల్లా నాయకులు ఎస్.కె.వి.ఎ.మీరా, చింతల రమేష్, వజినేపల్లి శ్రీను, బండారు యాకయ్య, పి.నాగసులోచన, శీలం వీర బాబు, భాగం అజిత, బేగం, బూబి, పగడాల నాగేశ్వరరావు, సత్యనారాయణ, గణపతి, ఉమ్మినేని రాంబాబు పాల్గొన్నారు.

# రివర్స్ టెండర్ల డ్రామానే పోలవరానికి శాపం

### శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు



**విజయవాడ, జూన్ 28 (ప్రజాస్వరం) :**

ఆరు వందల కోట్లు మిగిల్చానని చెప్పి వేల కోట్లకుపైగా నష్టాన్ని మిగిల్చారు. దీనికి ఎవర్ని బాధ్యులను చేద్దామని పోలవరం విషయంలో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రశ్నించారు. ఏపీకి జీవనాడిగా చంద్రబాబు చెబుతున్న పోలవరం ప్రాజెక్ట్ కు సంబంధించిన వైట్ పేపర్ ను చంద్రబాబునాయుడు ప్రకటించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పోలవరం పనులు ఒక యజ్ఞంలా సాగాయని చెప్పారు. అప్పట్లో ఉన్న సమస్యలను, సవాళ్లను అధిగమించి మరీ ముందుకు వెళ్లామని ఒక్క రోజులోనే స్పిల్ ఛానల్‌లో 32,215 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేశామన్నారు. నాటి ప్రభుత్వం గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అటు హెడ్ వర్కుల పనులు చేస్తూనే ఎగువ, దిగువ కాఫర్ కాఫర్ డ్యాంల నిర్మాణం పనులు పూర్తి చేశామని గుర్తు చేశారు. ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని రికార్డు సమయంలో 414 రోజుల్లో పూర్తి చేశామని.. అంత వేగంగా పనులు జరిగితే గత ఐదేళ్లలో అంతా రివర్స్ అయిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పోలవరం ధ్వంసం జాతికి జరిగిన విద్రోహమని పేర్కొన్నారు. విభజన వల్ల జరిగిన నష్టం కంటే జగన్ చేసిన నష్టం ఎక్కువని వెల్లడించారు. ప్రాజెక్టులపై కనీస అవగాహన లేకుండా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అహంభావంతో పోలవరం ప్రాజెక్టు పనులను నిలిపివేసి రివర్స్ టెండర్స్‌కు వెళ్లారని విమర్శించారు. జగన్ వల్ల డయాఫ్రంవాల్ దెబ్బతిందని ఆరోపించారు. టీడీపీ హయాంలో పోలవరంపై రూ. 11,762 కోట్లు చేస్తే, వైసీపీ ప్రభుత్వం కేవలం 4,167 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని విమర్శించారు. టీడీపీ హయాంలో పోలవరం ప్రాజెక్టు మొత్తంగా 71.20 శాతం, హెడ్ వర్క్స్ 64.08 శాతం, కుడి కాలువ 91.49 శాతం, ఎడమ కాలువ 71.60 శాతం పూర్తయ్యాయి. ముంపు ప్రాంతానికి చెంది ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో నిర్వాసితులు 1,05,601 గాను 3,922 కుటుంబాలకు పునరావాసం కల్పించారు. జగన్ పాలన ఐదేళ్లలో ప్రాజెక్టు మొత్తం వర్క్స్ 73.82 శాతంగా ఉంది. టీడీపీ హయాంలో 71.20 శాతం పోగా, జగన్ హయాంలో కేవలం 2.62 శాతం మాత్రమే పురోగతి జరిగింది. ప్రాజెక్టు హెడ్ వర్క్స్ జగన్ హయాంలో 69.79 శాతంగా పేర్కొన్నారు. ఇందులో టీడీపీ హయాంలోని 64.08 శాతం తీసి వేస్తే జగన్ పాలనలో కేవలం 5.71 శాతం మాత్రమే పనులు జరిగాయి. కుడి, ఎడమ కాలువల పురోగతి, వాటి కనెక్టవిటీ కూడా అంతంత మాత్రమే. ఇక భూసేకరణ నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసం కూడా ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా ఉందిఐదేళ్లలో వైసీపీ హయాంలో పోలవరం ప్రాజెక్టు విషయంలో తప్పుడు నిర్ణయాలు - రివర్స్ టెండర్ల డ్రామాలు ఆడారని చంద్రబాబు మండిపడ్డారు. నాడు 2019లో వైసీపీ ప్రభుత్వంలో జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు సాయంత్రమే పోలవరం పనులు నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చారన్నారు. సైట్‌లో నిర్మాణ సంస్థ ఖాళీ చేయాల్సిందిగా జులై 29, 2019న నోటీసులు జారీ చేశారని, 2019 జులై 24న ఇచ్చిన పీటర్ కమిటీ రిపోర్టు ఆధారంగా రివర్స్ టెండర్ల డ్రామా ఆడారని చంద్రబాబు విమర్శించారు.పోలవరంలో అవినీతే జరగలేదని కేంద్రం తేల్చిందని, డిసెంబర్ 02, 2019న స్వయంగా పార్లమెంట్‌లో స్పష్టంగా పేర్కొందన్నారు. రివర్స్ టెండర్ల ద్వారా రూ.738 కోట్లు ఆదా అని ముందు గొప్పలు చెప్పారని, కానీ చివరకు డయాఫ్రం వాల్‌ను దెబ్బతీసి వేల కోట్ల నష్టం చేశారని చంద్రబాబ అసంతృప్తి వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టులపై రెండో శ్వేత పత్రం విడుదల చేస్తామని, మొత్తం ఏడు శ్వేతపత్రాలను విడుదల చేస్తామని అన్నారు. వెబ్‌సైట్ల ద్వారా పత్రాలన్నీ అందుబాటులో ఉంచుతామని అన్నారు. వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారానికి చెక్ పెట్టేందుకే శ్వేతపత్రాల విడుదలని స్పష్టం చేశారు. కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టకముందే రాష్ట్రంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించి రాష్ట్రానికి అవసరమైన నిధులపై కేంద్రానికి నివేదిక ఇస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వ తోడ్పాడుతో సవాళ్లు అధిగమిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

## తెలంగాణ టూర్‌కు ఏపీ డిప్యూటీ సీఎం

**హైదరాబాద్, జూన్ 28 (ప్రజాస్వరం) :**

శనివారం నాడు ఏపీ డిప్యూటీ సీఎం పవర్ కళ్యాణ్ కొండగట్టు ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించనున్నారు. అయన పర్యటనకు తెలంగాణ జనసేన నేతలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ జనసేన ప్రచారకమిటీ చైర్మెన్ సాగర్ కె నాయుడు మాట్లాడుతూ శనివారం ఉదయం 7గంటలకు మాదాపూర్ లోనీ తన నివాసం నుంచి కొండగట్టుకు పవన్ రోడ్డు మార్గాన బయలు దేరుతారు. పవన్ అభిమానులు, కార్యకర్తలు పోలీసులకు సహరించాలి. తెలంగాణలో జనసేన బలోపేతంపై ఫోకస్ పవన్ ఫోకస్ పెడతారు. తెలంగాణలో ప్రజా సమస్యలపై జనసేన తరుపున పోరాటం చేస్తాం. సిరిసిల్ల చేనేత కార్మికుల సమస్యలపై పవన్ కళ్యాణ్ మాట్లాడుతారు. జనసేన పార్టీ లేకుండా తెలుగు రాజకీయాలు ఉండవని అన్నారు. ఏపీలో జనసేన విజయం ప్రభావరం తెలంగాణపై ఉంటోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ సహా.. ఇతర పార్టీల వారు జనసేనలో చేరుతారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పోయాలని పవన్ ను కోరుతాం. జనసేనలో పనిచేయటానికి యువత ఉత్సాహంగా ఉన్నారని అన్నారు.

## ఫైనల్స్‌లో పోటా పోటీ

**న్యూయార్క్ జూన్ 28 (ప్రజాస్వరం) :**

గయానా వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా 68 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించి మూడోసారి ప్రపంచకప్ ఫైనల్‌కు చేరుకుంది. రోహిత్ సేన రేపు జరిగే ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో తలపడనుంది. ఈ కీలక మ్యాచ్‌కి బార్బడోస్‌లోని కెన్సింగ్టన్ ఓవల్ మైదానం ఆతిథ్యం ఇస్తోంది. భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ కూడా దక్షిణాఫ్రికాతో ఫైనల్ మ్యాచ్‌కు సంబంధించి ప్రకటన చేయడంతో మ్యాచ్‌లో ఉత్కంఠ పెరిగింది.దక్షిణాఫ్రికాతో ఫైనల్ మ్యాచ్ గురించి బార్బడోస్ చేరుకోవడానికి ముందు గయానాలో ప్రకటన చేసిన రోహిత్ శర్మ.. ప్రపంచకప్ గెలుస్తామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశాడు. సెమీ-ఫైనల్ మ్యాచ్ తర్వాత 2013 నుంచి నిరీక్షణను ముగించాలనుకుంటున్నారా అని అడిగినప్పుడు, రోహిత్, 'మేం మా అత్యుత్తమ ప్రదర్శన చేయడానికి ప్రయత్నిస్తాం. జట్టు మంచి రిథమ్‌లో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పటి వరకు చూపిన ప్రదర్శనను ఫైనల్స్‌లోనూ నిలబెట్టుకోవాలనే ఆశ ఉంది. ఫైనల్‌కు ముందు దక్షిణాఫ్రికా శిబిరంలో కలకలం సృష్టించిన రోహిత్ శర్మ ఈ ప్రకటన చేయడంతో మొత్తం జట్టుతో కలిసి గయానా నుంచి బార్బడోస్ చేరుకున్నాడు. హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్ ఇలా ఆటగాళ్లంతా ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వచ్చి టీమ్ బస్సు ఎక్కి బార్బడోస్‌కు చేరుకున్నారు. భారత ఆటగాళ్లు విమానాశ్రయం నుంచి టీమ్ బస్సు ఎక్కి హోటల్‌కు చేరుకున్నారు.

**బార్బడోస్‌లో భారత్-ఆఫ్రికా రికార్డు..**

టీ20 ప్రపంచ కప్ 2024 ఫైనల్ పోరులో భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా జట్లు బార్బడోస్‌లో తొలిసారి టీ20 క్రికెట్‌లో తలపడనున్నాయి. ఇంతకుముందు ఇక్కడ టీమ్ ఇండియా కేవలం 3 మ్యాచ్‌లు మాత్రమే ఆడగా అందులో 1 మ్యాచ్‌లో మాత్రమే విజయం సాధించింది. 2010 టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా, వెస్టిండీస్‌పై భారత్ తడబడింది. ఈ రెండు మ్యాచ్‌లలో ఓడిపోయింది.దక్షిణాఫ్రికా గురించి చెప్పాలంటే.. ఇక్కడ జరిగిన 3 టీ20 మ్యాచ్‌ల్లో సౌతాఫ్రికా 2 గెలిచింది. 2010లో బార్బడోస్‌లో జరిగిన టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా ఈ మూడు మ్యాచ్‌లు ఆడింది. అంటే 2024లో దక్షిణాఫ్రికా జట్టు బార్బడోస్‌లో మ్యాచ్ ఆడడం ఇదే తొలిసారి.

## చంద్రబాబును కలిసిన తెలంగాణ గవర్నర్

**విజయవాడ, జూన్ 28,(ప్రజాస్వరం)**

ఏపీ సీఎం చంద్రబాబుతో తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్ శుక్రవారం భేటీ అయ్యారు. ఉండవల్లిలోని ఆయన నివాసానికి వచ్చిన గవర్నర్‌కు చంద్రబాబు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇరువురూ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు, పెండింగ్ అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. వీరి భేటీకి ముందు మంత్రి నారా లోకేశ్ గవర్నర్‌కు స్వాగతం పలికి.. శాలువాతో సత్కరించారు. అంతకుముందు గన్నవరం విమానాశ్రయం చేరుకున్న గవర్నర్‌కు.. విమానాశ్రయంలో అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన చంద్రబాబు నివాసానికి బయలుదేరి వెళ్లారు.కాగా, సుమారు 2 గంటల పాటు భేటీ అనంతరం గవర్నర్ రాధాకృష్ణన్ విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి వెళ్లారు. ఆయనకు అధికారులు ఘన స్వాగతం పలకగా.. పూర్ణకుంభంతో వేద పండితులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం పండితులు గవర్నర్‌కు వేదాశీర్వచనం అందించారు. అనంతరం ఈవో కేఎస్ రామారావు అమ్మవారి ప్రసాదం, శేష వస్త్రాన్ని ఆయనకు అందించారు. కాగా, ఏపీ సీఎం చంద్రబాబును మర్యాద పూర్వకంగానే కలిశానని.. విభజన సమస్యలపై ఎలాంటి చర్చా జరగలేదని గవర్నర్ స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబుకు అభివృద్ధిపై పూర్తి అవగాహన ఉందని.. ప్రత్యేకంగా ఎలాంటి అంశాలు తమ మధ్య చర్చకు రాలేదని చెప్పారు. అమ్మవారిని దర్శించుకుందామనే విజయవాడ వచ్చానని.. దర్శనం అద్భుతంగా జరిగిందని వెల్లడించారు.

## బీఆర్ఎస్‌లో కార్యకర్తలనే నాయకులు చేస్తాం : కెసిఆర్

**హైదరాబాద్ ప్రతినిధి, జూన్ 28 (ప్రజాస్వరం):**



బీఆర్ఎస్‌లో కార్యకర్తలే సైనికులు. . ఒక్కొక్కరు ఒక్కో బుల్లెట్. కాంగ్రెస్ మోసాన్ని ప్రజలు గ్రహిస్తరు అని బీఆర్ఎస్ అధినేత,మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. అప్పటిదాక ఓపిక పడుదాం. తెలంగాణ తెచ్చిన ఖ్యాతి కంటే ముఖ్యమంత్రి పదవి పెద్దదేం కాదు. కాంగ్రెస్ మోసాన్ని ఎండగట్టేది. ప్రజాచైతన్యమే, బీఆర్ఎస్‌కు ఆదరణ ఎన్నటికీ తగ్గదు. ప్రజాదరణే బీఆర్ఎస్‌కు అసలైన బలం. రోజురోజుకు దిగజారుతున్న కాంగ్రెస్. పాలన అని అన్నారు. బాల్కొండ, హుజూరాబాద్, ఆర్మూర్ నియోజకవర్గాల క్యాడర్‌తో సమావేశం అయ్యారు. లంగాణ సాధన అనే మహోన్నత లక్ష్యాన్ని సాధించిన, అంతటి ఉదాత్తమైన లక్ష్యం కోసం ఎన్నో పదవులను త్యాగం చేసిన చరిత్ర మనది. తెలంగాణ సాధించిన ఘనత కన్నా నాకు సీఎం పదవి అనేది పెద్ద విషయం కాదు. బీఆర్ఎస్ పార్టీకి బుల్లెట్ల వంటి కార్యకర్తలు ఉన్నారని, వారినే నాయకులుగా తీర్చిదిద్దుకుందామని పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

## సారు... మీరు.. వెళ్లొద్దు

**నల్గొండ, జూన్ 28 (ప్రజాస్వరం) :**

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వ సాధారణం. కనీసం రెండు, మూడేళ్లకు ఒకసారైనా బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. అయితే, తాము పని చేసిన చోట అతికొద్దిమంది మాత్రమే అక్కడే ప్రజలు, స్థానికుల మనసులను గెల్చుకుంటారు. బదిలీపై వెళ్లినప్పుడు అక్కడున్న వారంతా బదిలీపై వెళుతున్న అధికారులను చూసి బాధపడుతుంటారు. కొందరు వెళ్లొద్దంటూ వేడుకొంటూ ఉంటారు. తాజాగా ఇటువంటి అనుభవమే కొందరు ఉపాధ్యాయులకు తెలంగాణలో ఎదురైంది. ఇన్నాళ్లు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించిన ఆ ఉపాధ్యాయులు బదిలీపై వెళుతుంటే.. పదుల సంఖ్యలో విద్యార్థులు వారి చుట్టూ చేరి వెళ్ళొద్దంటూ వేడుకున్నారు. తెలంగాణలోని రెండు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ఈ ఘటనలకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ మారాయి.తెలంగాణలోని సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం పోలుమల్ల జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా సైదులు గడిచిన 14 ఏళ్లుగా పని చేస్తున్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పడంలో టీచర్ గా కాకుండా స్నేహితుడిగా వ్యవహరిస్తూ వచ్చిన ఉపాధ్యాయుడు విద్యార్థులకు ఆప్తుడిగా మారిపోయారు. ఆ టీచర్ ఎప్పుడు రాకపోయినా ఆ విద్యార్థులు మనసు కలత చెందుతూ ఉంటుంది. అటువంటి ఉపాధ్యాయులకు కొద్ది రోజుల కిందట బదిలీ అయింది. ఆ మాస్టారు ఇకపై రారని తెలుసుకున్న విద్యార్థులు కన్నీరు మున్నీరుగా వినిపించారు. బదిలీ అయిన ప్రాంతానికి వెళ్లేందుకు ఉపాధ్యాయుడు సిద్ధమవుతుండగా తమను వదిలి వెళ్ళవద్దు అంటూ ఉపాధ్యాయుడిని పట్టుకుని విద్యార్థులంతా ఏడ్చారు. అంతేకాకుండా పదుల సంఖ్యలో విద్యార్థులు ఉపాధ్యాయుడు కాళ్ళ మీద పడి మరి బోరున విలపించారు. మీరు ఇక్కడే ఉండాలి మాస్టారు అంటూ విలపించారు. ఉపాధ్యాయుడు సైదులు వెళ్లడాన్ని విద్యార్థులు జీర్ణించుకోలేకపోయారు. అయినా, సరే మాస్టారు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడంతో.. విద్యార్థులు ఉపాధ్యాయుడు సైదులుకు ఘనంగా వీడ్కోలు పలికారు. సరిగ్గా ఇటువంటి ఘటనే జనగామ జిల్లాలోనూ చోటుచేసుకుంది. జనగామ జిల్లా శామీర్పేట ప్రాథమిక పాఠశాలలో సుధీర్ అనే ఉపాధ్యాయుడు గత కొన్నాళ్ల నుంచి పని చేస్తున్నారు. ఆయనకు తాజాగా మరోచోటకు బదిలీ అయింది. సుధీర్ మాస్టారు బదిలీపై వెళుతున్న విషయం తెలుసుకున్న విద్యార్థులు గేటుకు అడ్డుగా నిలబడి వెళ్ళవద్దు అంటూ మాస్టారును వేడుకున్నారు. మీరు ఇక్కడే ఉండాలి మాస్టారు అంటూ మాస్టారుకు విజ్ఞప్తి చేశారు. కన్నీటి పర్యంతమై అడ్డుకోవడానికి ప్రయత్నించిన విద్యార్థులను చూసి సుదీర్ మాస్టర్ కళ్ళల్లో కూడా నీళ్లు తిరిగాయి. మళ్లీ వస్తానంటూ విద్యార్థులకు ధైర్యం చెప్పి ఆయన బయలుదేరి వెళ్లారు. మాస్టారు వెళ్లిన తర్వాత కూడా విద్యార్థులు కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు చూసిన స్థానికులు భావోద్వేగానికి గురయ్యారు.

## ఆళ్లగడ్డ ఎమ్మెల్యేను కలిసిన శిరివెళ్ల మండల నాయకులు

**శిరివెళ్ల, జూన్ 28 (ప్రజాస్వరం) :**

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియరెడ్డి, భూమా విఖ్యాత్ రెడ్డి, భార్గవ్ రామ్ లను శిరివెళ్ల మండల నాయకులు బుధవారం కలిశారు. బొకే అందజేసి శుభాకంక్షలు తెలియజేశారు. కలిసిన వారిలో శిరివెళ్ల మండల నాయకులు శ్రీకాంత్ రెడ్డి వీర రెడ్డి పల్లె టిడిపి నాయకులు కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, ఇతర నాయకులు తదితరులు ఉన్నారు. శిరివెళ్ల మండల, గ్రామ అభివృద్ధి పై చర్చించారు. అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే శిరివెళ్ల మండల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తోట శ్రీనివాసులు, అప్పి రెడ్డి, కృష్ణారెడ్డి టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జూలై 1 నుంచి ఫించన్ల పంపిణీకి రంగం సిద్ధం

**విజయవాడ, జూన్ 28 (ప్రజాస్వరం) :**

ఏపీలో పింఛన్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. పెరిగిన పింఛన్లను జులై 1 నుంచి ఇంటి వద్దే అందించేలా ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ పింఛన్ పంపిణీ చేయాలని ఆదేశాలిచ్చింది. అవసరమైతే ఇతర శాఖల ఉద్యోగుల సేవలు కూడా వినియోగించుకోవాలని అధికారులకు సూచించింది. ఒక్కో ఉద్యోగి 50 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసేలా చూడాలన్నారు. ఈ మేరకు సీఎస్ నీరభకుమార్ జిల్లాల కలెక్టర్లకు కీలక ఆదేశాలిచ్చారు. జులై 1వ తేదీనే (సోమవారం) లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని నిర్దేశించారు. ఒకవేళ ఎవరైనా మిగిలితే మంగళవారం పంపిణీ చేయాలని సూచించారు. డబ్బులను ఈ నెల 29నే బ్యాంకుల నుంచి డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు తొలి 5 సంతకాల్లో పింఛన్ల పెంపు ఒకటి. ఇటీవల కేబినెట్ భేటీలో ఈ నిర్ణయానికి ఆమోదం తెలిపారు. దీని ప్రకారం ఒకటో కేటగిరీలోని వృద్ధులు, వితంతువులు ఇతర 11 ఉప కేటగిరీలకు చెందిన వారి పింఛన్ సొమ్ము రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచారు. ఏప్రిల్ నుంచే దీన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చిన క్రమంలో.. ఏప్రిల్, మే, జూన్ నెలకు సంబంధించి ఎరియర్లతో కలుపుకొని మొత్తం రూ.7 వేల పింఛన్ జులైలో అందజేయనున్నారు. రెండో కేటగిరీలో పాక్షిక దివ్యాంగులకు రూ.3 వేల నుంచి రూ.6 వేలు, మూడో కేటగిరీలోని పూర్తి స్థాయి దివ్యాంగులకు రూ.5 వేల నుంచి రూ.15 వేలు, నాలుగో కేటగిరీలోని కిడ్నీ, తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచిన పింఛన్ సొమ్ము అందించనున్నారు.పెరిగిన పింఛన్ల మేరకు 65,18,496 మందికి రూ.4,399.89 కోట్లు పంపిణీ చేయనున్నారు. వీరిలో 64.75 లక్షల మందికి ఇంటి వద్ద రూ.4,369.82 కోట్లు ఇంటి వద్ద అందిస్తారు. మిగిలిన 43 వేల మంది అంటే బయట చదువుకునే దివ్యాంగ్ విద్యార్థులకు రూ.30.05 కోట్లను డీబీటీ ద్వారా వారి అకౌంట్లలోకి జమ చేస్తారు. జులై 1 ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభం కానుంది. పింఛన్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్లస్టర్ల వారీగా మ్యాపింగ్ చేశారు.

## 30న డీఎస్సీ నోటిఫికేషన్



విజయవాడ, జూన్ 28 (ప్రజాస్వరం) :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులంతా ఎప్పుడెప్పుడా అని మెగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈసారి మొత్తం 16,347 పోస్టులను భర్తీ చేయనున్నట్లు సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఏపీ సర్కార్ డీఎస్సీ ప్రకటనపై కీలక ప్రకటన వెలువరించింది. మెగా డీఎస్సీకి ముందే మరోసారి టెట్ నిర్వహిస్తామని చెప్పిన సర్కార్.. రెండు రకాల నోటిఫికేషన్లు విడుదల చేయాలని యోచిస్తోంది. అందులో మొదటిది టెట్‌తో కూడిన డీఎస్సీ నోటిఫికేషన్ కాగా, రెండోది ఇంతకు ముందే టెట్ పాసైన వారి కోసం నేరుగా మెగా డిఎస్సీకి మరో నోటిఫికేషన్ ఉండవచ్చని భావిస్తున్నారు.ఈ నెల 30న రెండు డీఎస్సీ నోటిఫికేషన్లను ఏపీ ప్రభుత్వం విడుదల చేసే అవకాశం ఉంది. ఇందుక సంబంధించిన పరీక్షల షెడ్యూల్‌ను కూడా అదే రోజు వెల్లడించేందుకే ఏర్పాట్లు చేస్తున్నారు. నియామకాల ప్రక్రియను డిసెంబరు 10లోగా పూర్తి చేసి, జాయిన్ ఆర్డర్స్ కూడా అభ్యర్ధులకు పంపిణీ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 80 శాతం పోస్టులు స్థానికులకి అవకాశం ఇచ్చేలా నోటిఫికేషన్‌ను రూపొందిస్తున్నారు. మిగిలిన 20 శాతం పోస్టులను నాన్ లోకల్ కింద భర్తీ చేసే అవకాశం ఉంది.సీఎం చంద్రబాబు సారధ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ మెగా డీఎస్సీకి ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అర్హులైన అభ్యర్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోడానికి వీలుగా ఈ మేరకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకూ మళ్లీ టెట్ పరీక్ష నిర్వహిస్తామని చెప్పిన సర్కార్ ఉన్నట్లుండి.. టెట్ కమ్ డీఎస్సీ అని యూటర్న్ తీసుకోవడంతో అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. మెగా డీఎస్సీకి ముందే టెట్ పరీక్ష నిర్వహిస్తారని అంతా భావించారు. కానీ ఇప్పటికే టెట్ అర్హత పొందిన వారికి విడిగా.. కొత్తగా అర్హత సాధించవల్సిన వారికి మరొకటిగా రెండు డీఎస్సీ నోటిఫికేషన్లు వెలువరిస్తామంటోన్న విద్యాశాఖ నిర్ణయం చర్చణీయాంశంగా మారింది.ఈనెల 30న 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడానికి ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. అనంతరం దరఖాస్తుల స్వీకరణ, వాటి పరిశీలన, పరీక్ష నిర్వహణ, దీంతో పాటే టెట్ నిర్వహణకు వీలుగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రతి జిల్లాలో 80 శాతం పోస్టులను స్థానికులకు ఇచ్చేలా, మరో 20 శాతం నాన్ లోకల్ అభ్యర్థులకు కేటాయించేలా నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు సమాచారం. 26 జిల్లాలకు కాకుండా.. 13 ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## ఆపరేషన్ పెద్దిరెడ్డి...



తిరుపతి, జూన్ 28 (ప్రజాస్వరం) :

జగన్ రాజకీయంగా దెబ్బతీశారు చంద్రబాబు. కూటమి కట్టి దారుణ పరాజయాన్ని చవిచూసేలా చేశారు. ఇంతటితో చంద్రబాబు దాహం తీరలేదు. ముందుగా జగన్ ఆయువుపట్టులపై దృష్టి సారించారు. ముల్లును ముల్లుతోనే తీయాలి .. కర్ర విరగకూడదు, పాము చావకూడదు అన్నట్టు.. జగన్ ని టచ్ చేయకుండానే.. ఆయన బలాలపై దృష్టి పెట్టారు చంద్రబాబు. వైసీపీలో నెంబర్ 2 గా భావిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సినిమా చూపిస్తున్నారు.వైసీపీ ఆవిర్భావం తర్వాత జగన్ వెంట నడిచారు పెద్దిరెడ్డి. గత పది సంవత్సరాలుగా వెన్నుదన్నుగా నిలుస్తూ వచ్చారు. గత ఐదు సంవత్సరాలుగా అయితే.. పెద్దిరెడ్డి అంటే రాయలసీమ.. రాయలసీమ అంటే పెద్దిరెడ్డి అనేలా పరిస్థితి ఉండేది. చివరకు మాజీ సీఎం హోదాలో చంద్రబాబు కుప్పంలో పర్యటించాలన్నా పెద్దిరెడ్డి దయాదాక్షణ్యాలపై ఆధారపడే అంతటి పరిస్థితి వచ్చింది. చంద్రబాబు విపక్షనేతగా పుంగనూరులో అడుగుపెడతానంటేనే చుక్కలు చూపించారు పెద్దిరెడ్డి. అంగళ్లలో అరాచకమే సృష్టించారు. అంతటితో ఆగకుండా వందలాది మంది టిడిపి నేతలను అరెస్టు చేయించారు. రోజుల తరబడి జైల్లో మగ్గేలా చూశారు. చివరకు అవినీతి కేసులకు తోడు అంగళ్ళ కేసును చంద్రబాబు మెడకు చుట్టారు. ఇవన్నీ చంద్రబాబు మైండ్ లో ఉన్నాయి. అందుకే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆపరేషన్ పెద్దిరెడ్డిని ప్రారంభించారు.చంద్రబాబు పేరుకే కుప్పం పర్యటన. సీఎం అయిన తర్వాత సొంత నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. రెండు రోజులపాటు అక్కడే గడిపారు. కానీ సింహభాగం పుంగనూరు నియోజకవర్గానికి కేటాయించారు. పుంగనూరు టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి అలియాస్ చల్లా బాబు తో పాటు టిడిపి నేతలు కుప్పం వచ్చారు. వారికి పలు సూచనలు చేశారు చంద్రబాబు. అయితే చంద్రబాబు ఇలా కుప్పం నుంచి బయటకు అడుగు పెట్టారో లేదో.. పుంగనూరులో ప్రకంపనలు మొదలయ్యాయి. పుంగనూరు మున్సిపల్ చైర్మన్ అలీమ్ భాషా తో పాటు 12 మంది కౌన్సిలర్లు సైకిల్ ఎక్కారు. తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. మరికొందరు చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ పరిణామాలతో పెద్దిరెడ్డిలో ఒక రకమైన ఆందోళన ప్రారంభమైంది. ఇప్పటికే పెద్దిరెడ్డి కుమారుడు మిథున్ రెడ్డి బిజెపితో మంతనాలు ప్రారంభించారు. అయినా సరే పెద్దిరెడ్డి కుటుంబం విషయంలో చంద్రబాబు వెనక్కి తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. ఒకప్పుడు పుంగనూరు గడ్డ నాది అంటూ సవాల్ చేసిన పెద్దిరెడ్డిని.. శాశ్వతంగా ఆ నియోజకవర్గానికి దూరం చేసేందుకు చంద్రబాబు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికైతే పెద్దిరెడ్డి తో తనకు ఎదురైన అవమానాలకు బదులిచ్చేందుకు చంద్రబాబు గట్టిగానే ప్రయత్నాలు ప్రారంభించారు.

# 2029 మిత్రులెవరు..శత్రువులెవరు...

విజయవాడ, జూన్ 28 (ప్రజాస్వరం) :

024 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మేలి మలుపును తిప్పాయి. సూపర్ సీనియర్ అయిన చంద్రబాబు ముఖ్యమంత్రి అయి ఉండవచ్చు కానీ రాజకీయాల్ని మలుపు తిప్పింది. ఇప్పుడు ప్రభుత్వంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది యువనేతలే. కొత్తగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు.. రాజకీయంగా ఎదురుదెబ్బలు తిన్నా ముందడుగు వేసిన వారు అనేక మంది యువనేతలు ఈ సారి అటు లోక్ సభలో.. ఇటు అసెంబ్లీలో అడుగు పెట్టారు. ముందు ముందు 1980 బ్యాచ్ పొలిటీషియన్లు అంతా సైడ్ కానున్నారు. యువత ముందుకు రానున్నారు. అది ఎమ్మెల్యే , ఎంపీల స్థాయిలోనే కాదు.. రాష్ట్రాన్ని నడిపేందుకు కూడా యువనేతలే పోటీ పడనున్నారు. అలాంటి వారిలో ముగ్గురు ఇప్పుడు మన ముందు ఉన్నారు. టీడీపీ యువనేత నారా లోకేష్, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి. రాజకీయాల్లో మిత్రుత్వం, శత్రుత్వం శాశ్వతం కాదు. అందరికీ అత్యున్నత స్థానానికి చేరాలని ఉంటుంది. అందుకే ఇప్పుడు ఉన్న మిత్రుత్వాల్ని, శత్రుత్వాన్ని పక్కన పెడితే.. భవిష్యత్ రాజకీయం ఎలా ఉంటుందని ఊహిస్తే.. ఊహాకంతనంగా టఫ్‌గా ఉండబోతోందని అంచనా వేయవచ్చు. చంద్రబాబునాయుడు వయసు 74 ఏళ్లు, వచ్చే ఎన్నికల నాటికి 80 చేరుతుంది. ఎంత ఫిట్‌గా ఉన్నా.. వయసు మాత్రం మీద పడినట్లే. ఆయన రాజకీయంగా యాక్టివ్ గా ఉన్నా సరే తెలుగుదేశం పార్టీని నడిపించే ప్రత్యామ్నాయ నాయకుడ్ని తెరపైకి తేవాల్సిందే. ఇప్పటికే నారా లోకేష్ పార్టీపై పట్టు సాధించారు. ఎన్నో ట్రోలింగ్స్ ను ఎదుర్కొని యువగళం పాదయాత్ర ద్వారా పార్టీ విజయంలో తన వంతు పాత్ర నిర్వహించారు. ఇప్పటికీ నారా లోకేష్ వయసు కేవలం 41 సంవత్సరాలు మాత్రమే. ఆయన రాజకీయంగా తనను తాను ప్రూవ్ చేసుకునేందుకు రెడీగా ఉన్నారు. పరిపాలనా పరంగా.. పార్టీని క్రమబద్దంగా నడిపించే విషయంలోనూ .. కష్టపడే అంశంలోనూ ఆయన నాయకత్వ లక్షణాలు నిరూపించుకున్నారు. ఓడిపోయిన మంగళగిరిలో.. తన సొంత సామాజికవర్గం లేనప్పటికీ 90వేలకుపైగా మెజార్టీతో గెలవడం అంటే... చిన్న విషయం కాదు. ఐదేళ్ల పాటు క్రమబద్దంగా పని చేశారు. అలాంటి ప్రణాళికలు ఆయన వద్ద చాలా ఉన్నాయి. అయితే ఇప్పటికిప్పుడు తాను వారసుడ్ని అయిపోవాలని లోకేష్ కూడా అనుకోవడం లేదు. గెలుపులో క్రెడిట్ కోసం కూడా ఆశపడలేదు. వచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకుని తన ఇమేజ్ ను అంతకంతకూ పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. రాబోయే రోజుల్లో టాప్ స్పాట్ అంటే సీఎం పీఠానికి గట్టిగా పోటీ పడే నాయకుల్లో లోకేష్ ముందు వరుసలో ఉంటారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. రాజకీయాల్లోకి అందరూ వచ్చేది అత్యున్నత స్థానం చేరుకోవడానికే. పవన్ కల్యాణ్ మొదటి అడుగుల్లో తడబడి ఉండవచ్చు కానీ.. రాజకీయం ఎలా చేయాలో అర్థం




చేసుకున్న తర్వాత ఆయన మొదటి అడుగు విజయవంతంగా వేశారు. ఇప్పుడు ఆయన డిప్యూటీ సీఎం అయ్యారు. కానీ రాబోయే రోజుల్లో తాను..తన పార్టీని ఆ స్థాయిలోనే ఉంచారని అనుకోరు. ఖచ్చితంగా ఎదగాలని అనుకుంటారు. ఆయన పార్టీ ఎదిగితే తమ పార్టీని తగ్గించుకోవాలని టీడీపీ అనుకోదు. అది వేరే రాజకీయం. ఇప్పటికిప్పుడు పవన్ ముందున్న లక్ష్యం.. తనను తాను మంచి పాలకుడిగా ప్రజల ముందు నిరూపించుకోవడం. తన చేతికి ముఖ్యమంత్రి పీఠం వచ్చినా సమర్థంగా పని చేస్తానని.. తనపై ఉన్న అంచనాలకు తగ్గట్లుగా పనితీరు కనబరుస్తానని అందరికీ చూపించగలగడం లక్ష్యం. అదే పనిలో ఉన్నారు. అలాగే పార్టీని బలోపేతం చేసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకూ పవన్ కు పార్టీ ఉంది. లీడర్లు కానీ క్యాడర్ కానీ లేరు. అభిమానుల బలాన్ని.. పొత్తుల ద్వారా పూర్తి స్థాయిలో ప్రయోజనకరంగా మార్చుకోవడంలో సక్సెస్ అయ్యారు. ఇక ముందు పార్టీని .. క్యాడర్ ను..లీడర్లను డెలవప్ చేసుకోవాల్సి ఉంది. వచ్చే పదేళ్ల పాటు టీడీపీతో అనుబంధం కొనసాగాలని ఆయన ఎన్నికలకు ముందే చెప్పారు. అంటే ఆయన వచ్చే ఎన్నికల నాటికి కూడా టీడీపీతోనే కూటమితోనే ఉండాలనుకుంటున్నారు. రాజకీయంగా ఏం జరుగుతుందో చెప్పలేము కానీ..ముఖ్యమంత్రి పీఠాన్ని అందుకోవాలన్న కోరిక ఆయనలోనూ బలంగా ఉంటుంది. వచ్చే ఐదేళ్లు లేదా పదేళ్ల తర్వాత చూస్తే.. ఆ సీటు కోసం పోటీ పడేవాళ్లలో పవన్ కల్యాణ్ అగ్రభాగంలో కనిపిస్తూనే ఉంటారు. అది సొంతంగా అయినా... లేకపోతే పొత్తుల ద్వారా అయినా సరే. యాభై ఐదేళ్ల పవన్ కల్యాణ్ బలమైన ప్రజెన్స్ లేని రాజకీయాలను వచ్చే ఇరవై ఏళ్ల పాటు ఊహించలేం. జగన్మోహన్ రెడ్డి తానే 2029లో సీఎం అని అనుకుంటున్నారు. ఆయనకు సీట్ల పరంగా ఎన్ని తక్కువ సీట్లు వచ్చినా ఓటింగ్ మాత్రం నలభై శాతం వచ్చింది. విపక్ష పార్టీలన్నీ కలిసి పోటీ చేయడం వల్ల కన్సాలిడేషన్ జరిగింది. అధికారంలో ఉన్న పార్టీకి పథకాలు.. ఇతర వర్గాల మద్దతు ఉంది. ఈ కారణంగా ఆయన బలమైన నేతగానే ఉన్నారు. అయితే ఇప్పటికే ఐదేళ్లు సీఎంగా చేశారు. ఆయన పనితీరుకు మైనస్ మార్కులు పడ్డాయి.

వచ్చే ఎన్నికల్లో మరోసారి బలంగా ముందుకు వస్తానని అంటున్నారు. కానీ జగన్మోహన్ రెడ్డికి లోకేష్, పవన్ కల్యాణ్‌ల కన్నా ఎక్కువ సవాళ్లు ఉన్నాయి. ముందుగా పార్టీని కాపాడుకోవాలి. కేసుల నుంచి బయటపడాలి.. అంతకు మించి కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చే ముప్పును తప్పించుకోగలగాలి. ఇటీవలి ఎన్నికల్లో రాయలసీమలో ఓటింగ్ సరళి చూస్తే.. దళిత ముస్లిం ఓట్లు భారీగా కాంగ్రెస్ కు పడ్డాయి. ఈ కారణంగా కడపసిటీ వంటి చోట్ల వైసీపీ అభ్యర్థులు పరాజయం పాలయ్యారు. తనకు ఉన్న అక్రమాస్తుల కేసులను తప్పించుకోవడం అంత సులువు కాదు. పదేళ్లకుపైగా ట్రయల్‌కు రావడం లేదని కోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యే పరిస్థితి ఉంది. వాటి సంగతి త్వరగా తేల్చే సే అవకాశాలు ఉన్నాయి. గత ఐదేళ్ల పాలనలో మద్యం , ఇసుక, గనులు వంటి వాటి విషయాల్లో కొత్త విచారణలు జరగబోతున్నాయి. మరో వైపు పార్టీ నేతల్ని కాపాడుకోవాల్సి ఉంది. టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తే ఉత్తారంధ్ర న్నుంచి గుంటూరు వరకూ ఆ పార్టీల అభ్యర్థులకు వచ్చిన మెజార్టీలు చూస్తే.. వైసీపీ కోలుకోవం కష్టమన్న అభిప్రాయం వినిపిస్తోంది. అదే టీడీపీ, జనసేన వేర్వేరుగాపోటీ చేస్తే ఆ రెండు పార్టీల మధ్యనే పోరాటం జరుగుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. అందుకే జగన్ ముందు వచ్చే ఐదేళ్లు ఎన్నో సవాళ్లు ఉంటాయి. వాటన్నింటినీ ఎదుర్కొంటూ నిలబగలిగితే... అత్యున్నత పీఠాన్ని దక్కించుకునే రేసులో ఆయన కూడా ఉంటారు. తనకు వయసు అయిపోలేదని సత్తువ ఉందని ఆయన క్యాడర్ కు చెబుతున్నారు. జగన్ వయసు 51 ఏళ్లే. ప్రస్తుతం చంద్రబాబు సీఎంగా ఉన్నారు. పవన్ డిప్యూటీ సీఎంగా ఉన్నారు. లోకేష్ కీలక శాఖల మంత్రిగా ఉన్నారు. కానీ ఆయన పవన్ కంటే ఎక్కువ పవర్స్ కలిగి ఉంటారని చెప్పాల్సిన పని లేదు. పవన్ కల్యాణ్ తన శాఖలకే పరిమితమవుతారు..కానీ లోకేష్ దాదాపు అన్ని శాఖల బాధ్యతలను అనధికారికంగా చూస్తారు. చంద్రబాబు పూర్తిగా పెట్టుబడులు..అమరావతి, పోలవరం వంటి వాటి మీద దృష్టి పెట్టవచ్చు. అయితే రాబోయే కాలంలో రాజకీయంలో తన పాత్రేమిటి అని పవన్ విశ్లేషించుకుంటే సీఎం పీఠానికి తనను తాను పోటీదారునిగా మార్చుకునేందుకు వీలైనంత వేగంగా పావులు కదిపే అవకాశం ఉంది. అతి వచ్చే ఎన్నికల నాటికి జరుగుతుందా.. ఆ తర్వాత జరుగుతుందా అన్నది చెప్పలేము. చంద్రబాబు రిటైరయ్యే పరిస్థితి వస్తే.. వచ్చే ఐదేళ్లకో పదేళ్లకో ఖచ్చితంగా సీఎం రేస్ ఉంటుంది. లోకేష్ సీఎం అయితే పవన్ లైట్ తీసుకోరు. తానే సీఎం కావాలనుకుంటారు. వీరికి పోటీగా జగన్మోహన్ రెడ్డి ఉండనే ఉంటారు. అందుకే భవిష్యత్‌లో జరగబోయే రాజకీయాల్లో ఎవరు మిత్రులు.. ఎవరు ప్రత్యర్థులు అన్నది అంచనా వేయడం ఇప్పుడు కష్టం. కానీ ఏపీ రాజకీయాల్లో మాత్రం బలమైన యువనేతల ముద్ర స్పష్టంగా కనిపించబోతోందని అన్నుకోవచ్చు.

## పుంగనూరులో వైసీపీకి షాక్



తిరుపతి, జూన్ 28 (ప్రజాస్వరం) :

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి షాక్ తగిలింది. పుంగనూరు నియోజకవర్గం నుంచి టిడిపిలో చేరికలు పెరిగాయి. పుంగనూరు మున్సిపల్ చైర్మన్ అలీమ్ భాషా తో పాటు 12 మంది కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. స్థానిక టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో వీరంతా తెలుగుదేశం పార్టీలో చేరారు. మరి కొంతమంది కౌన్సిలర్లు టిడిపిలో చేరేందుకు సిద్ధపడినట్లు సమాచారం. అదే జరిగితే పుంగనూరు మున్సిపల్ పీఠం తెలుగుదేశం పార్టీ ఖాతాలో చేరినట్టే.పుంగనూరు నుంచి సుదీర్ఘకాలం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నియోజకవర్గం ఆవిర్భావం నుంచి పెద్దిరెడ్డి కుటుంబం హవా నడుస్తోంది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దిరెడ్డి హవా చలాయించడం ప్రారంభించారు. ఒక్క పుంగనూరు కాదు రాయలసీమ నాలుగు జిల్లాల్లో పెద్దిరెడ్డి కను సన్నల్లో రాజకీయాలు నడిచేవి. చిత్తూరు జిల్లాను సైతం శాసించారు. ఈ నేపథ్యంలోనే కుప్పంలో చంద్రబాబును ఓడిస్తానని శపథం చేశారు. ఒక మాజీ సీఎం గా చంద్రబాబు కుప్పంలో అడుగుపెట్టలేని విధంగా వైసీపీ శ్రేణులు వ్యవహరించడం వెనుక పెద్దిరెడ్డి ఉన్నారన్నది బహిరంగ రహస్యం. అయితే ఏపీలో వైసిపి అధికారానికి దూరం కావడంతో పెద్దిరెడ్డికి సీన్ రివర్స్ అవుతోంది. ఆయన సామ్రాజ్యానికి బీటలు వారుతున్నాయి.వాస్తవానికి పోలింగ్ ముగిసిన తర్వాత పెద్దిరెడ్డి విదేశాలకు వెళ్లిపోయారని ప్రచారం జరిగింది. ఆయన కాంట్రాక్ట్ కంపెనీకి చెందిన యంత్రాలు, వాహనాలను అప్పట్లో దక్షిణాఫ్రికాకు తరలించినట్లు టాక్ నడిచింది. ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దిరెడ్డి కనీసం మీడియాకు సైతం దొరకలేదు. జగన్ తర్వాత చంద్రబాబు సర్కార్కు పెద్దిరెడ్డి టార్గెట్ అవుతారని విశ్లేషణలు ఉన్నాయి. సరిగ్గా ఇటువంటి తరుణంలోనే పుంగనూరు మున్సిపల్ కార్యవర్గమంతా తెలుగుదేశం పార్టీలో చేరడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇలా టిడిపిలో చేరిన కౌన్సిలర్లంతా వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయడం విశేషం. పేరుకే మున్సిపల్ చైర్మన్ అని.. పవర్ అంతా పెద్దిరెడ్డి వద్ద ఉండిపోయిందని అలిన్ భాష ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో మరి కొంతమంది వైసీపీ కౌన్సిలర్లు టిడిపిలో చేరతారని.. పుంగనూరు మున్సిపల్ కార్యాలయం పై తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేస్తామని ఈ సందర్భంగా ఆయన చెప్పుకొచ్చారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు పుంగనూరు నియోజకవర్గంలో పర్యటించారు. అంతకుముందు కూడా పుంగనూరులో పర్యటిస్తుండగా వైసీపీ శ్రేణులు అరాచకాలు సృష్టించాయి. ఆ సమయంలోనే చంద్రబాబు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. పుంగనూరు పుడింగు అంటూ పెద్దిరెడ్డిని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. తప్పకుండా పెద్దిరెడ్డి సామ్రాజ్యాన్ని కూలగొడతామని హెచ్చరించారు. ఇప్పుడు అన్నంత పని చేశారు. చంద్రబాబు కుప్పం పర్యటన ముగిసిందో లేదో.. పుంగనూరు మున్సిపల్ కార్యవర్గమంతా తెలుగుదేశం పార్టీలో చేరడం విశేషం.

## చిన్నమ్మకు కలిసిరాని కాలం

విజయవాడ, జూన్ 28 (ప్రజాస్వరం) :

కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చింది. ఎన్నికలకు ముందుగానే కూటమి ఏర్పడటంతో అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో పదవుల పంపిణీ జరిగిపోయింది. కేంద్ర, రాష్ట్ర కేబినెట్ లో అన్ని పార్టీలకూ అవకాశం కల్పించారు కేంద్ర ప్రభుత్వంలో జనసేనకు అవకాశమివ్వకపోయినా కూటమిలోని టీడీపీకి మాత్రం రెండు పదవులు లభించాయి. తెలంగాణలో ఎనిమిది స్థానాలను గెలవడంతో ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. ఏపీలో మూడు పార్లమెంటు స్థానాలు దక్కడంతో ఒకే ఒక్కరికి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కింది. ఇక శాసనసభ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఆరుగురు గెలిచినా ఒక్కరికే రాష్ట్ర కేబినెట్ లో చోటు దక్కింది. ఈ లెక్కలన్నీ ఏం చెబుతున్నాయంటే... బలాబలాలను బట్టి, సామాజికవర్గాలను ప్రధానంగా తీసుకుని కేబినెట్ లో స్థానం కల్పించారు. అయితే ఎన్నికల ముందు నుంచి కూటమి ఏర్పాటు కాకమునుపే ఈసారి దగ్గుబాటి పురంద్రీశ్వరి విజయం సాధిస్తే ఖచ్చితంగా కేంద్ర మంత్రి పదవి లభిస్తుందని ప్రచారం పెద్దయెత్తున జరిగింది. ఎందుకంటే ఆమె రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలుగా కూడా ఉన్నారు. తెలంగాణలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి మంత్రి పదవి దక్కడంతో ఏపీలోనూ అదే ఫార్ములాను బీజేపీ కేంద్ర నాయకత్వం అనుసరిస్తుందని అందరూ అనుకున్నారు. కానీ కేంద్ర కేబినెట్ లో పురంద్రీశ్వరికి స్థానం దక్కలేదు. అనూహ్యంగా నరసాపురం నుంచి తొలిసారి విజయం సాధించిన భూపతిరాజు శ్రీనివాసవర్మకు కేబినెట్ పదవి లభించింది. ఇది ఎవరూ ఊహించని విషయం. ఆయన కూడా ఊహించలేదు. తొలిసారి గెలిచిన తనకు కేంద్ర మంత్రి పదవి ఎందుకు వస్తుందని ఆయన భావించి ఉండవచ్చు కానీ ఏపీ సామాజిక పరిస్థితుల దృష్ట్యా పురంద్రీశ్వరికి కేంద్ర కేబినెట్ లో స్థానం దక్కలేదని చెబుతున్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి కేంద్ర మంత్రులు పొందిన వారిలో పెమ్మసాని చంద్రశేఖర్ కమ్మ సామాజికవర్గం కావడంతో అదే సామాజికవర్గానికి మరో కేంద్ర మంత్రి పదవి ఎందుకు ఇవ్వడం అని నాయకత్వం భావించారని కూడా అంటున్నారు. మరో వైపు పురంద్రీశ్వరికి వ్యతిరేకంగా కొందరు కేంద్రనాయకత్వంపై వత్తిడి తెచ్చారని, బీజేపీ నేతల్లోనే కొందరు ఆమెకు కేంద్ర మంత్రి పదవి ఇవ్వవద్దని చెప్పడంతో నాయకత్వం వెనక్కు తగ్గిందంటున్నారు. కొందరు సీనియర్ నేతలు ఆమెకు కేంద్ర మంత్రి పదవి ఇచ్చి పార్టీని సుదీర్ఘకాలం నుంచి నమ్ముకున్న వారిని అన్యాయం చేయవద్దని గట్టిగా కోరడంతో పార్టీ హైకమాండ్ కూడా ఆలోచించి చిన్నమ్మకు చేయి ఇచ్చినట్లు రాష్ట్ర బీజేపీలో గుసగుసలు వినపడుతున్నాయి.. పురంద్రీశ్వరికి స్పీకర్ పదవి దక్కుతుందని పెద్దయెత్తున ప్రచారం జరిగింది. మహిళ స్పీకర్ కు అవకాశం కల్పించడంలో భాగంగా పురంద్రీశ్వరిని ఎంపిక చేస్తారనుకున్నారంతా. కానీ చివరకు ఓంబిర్లా స్పీకర్ అయ్యారు. దీంతో ఇప్పట్లో చిన్నమ్మకు ఏ పదవి కేంద్ర ప్రభుత్వంలో లేనట్లేనని ఆమె సన్నిహితులు ఆవేదన చెందుతున్నారు. తర్వాత మంత్రి వర్గ విస్తరణ జరిగితే అవకాశముంటుందన్న ఆశతో ఉన్నామని వారంటున్నారు. అయితే అక్కడ ఉన్న మోదీ, అమిత్ షా లెక్కలు వేరుగా ఉంటాయి. అందుకే పురంద్రీశ్వరికి పదవి అనేది ఈ దఫా దొరకడం దుర్లభమనేని అన్న కామెంట్స్ కూడా వినపడుతున్నాయి. అతి గా ప్రచారం జరిగి.. చివరకు పురంద్రీశ్వరికి ఏ పదవి దక్కకపోవడంతో ఆమె అనుచరులు నిరాశకు గురయ్యారు.

# కర్మ..రిటర్న్స్...

### బయిటకు రాని వైసీపీ నేతలు

నెల్లూరు, జూన్ 28 (ప్రజాస్వరం) :



వైసీపీ లో ఒక్కనేత బయటకు రావడం లేదు. ఐదేళ్లు పదవులు అనుభవించిన వారు ఇప్పుడు కనిపించడం లేదు. ఫలితాలు వచ్చి కొద్ది రోజులే కావడంతో ఇంకా బయటకు రాకపోవచ్చన్న ఒక వాదన వినిపిస్తున్నప్పటికీ పార్టీ కేంద్ర కార్యాలయాన్ని కూలగొట్టినా ఒకరిద్దరు నేతలు తప్ప ఎవరూ స్పందించకపోవడంతో ఇప్పుడు ఆ పార్టీ పరిస్థితి అద్దం పడుతుంది. అధికారంలోకి రాకపోతే ఎవరికైనా ఇంతే పరిస్థితి అని అర్ధమవతుంది. నాడు తెలుగుదేశం పార్టీ పరిస్థితి కూడా ఇంతే ఉంది. ఇప్పుడు వైసీపీకి అదే పరిస్థితి తలెత్తింది. అధికారంలో లేకపోవడంతో నేతలు కూడా మనకెందుకొచ్చిన పీకులాట అని ఎవరూ పెద్దగా గొంతు విప్పడానికి కూడా సాహసించే ప్రయత్నం చేయడం లేదు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీకి చెందిన ఒక్కనేత కూడాబయటకు రాలేదు. అప్పుడు కూడా ఒకరిద్దరు నేతలు మినహా ఎవరూ బయటకు రాలేదు. దాదాపు మూడున్నరేళ్లు అసలు బయటకు రావడానికే నేతలు భయపడ్డారు. బయటకు వచ్చిన నేతలపై నాటి వైసీపీ ప్రభుత్వం కేసులు పెడుతుండటంతో మిగిలిన వారు దూరమయ్యారు. అంతెందుకు 2019 ఎన్నికలలో గెలిచిన 23 మంది ఎమ్మెల్యేలలో నలుగురు వైసీపీ మద్దతుదారులుగా మారిపోయిన మిగిలిన పద్దెనిమిది మందిలో ఒకరిద్దరు మినహా ఎవరూ బయటకు రాలేదు. కానీ అప్పుడు చంద్రబాబు నాయుడు మాత్రం ఊరుకోలేదు. బయటకు వచ్చి తాను ఉన్నానంటూ కార్యకర్తలకు భరోసా ఇచ్చినా ఎవరూ అంత సాహసం చేయలేకపోయారు. పార్టీని గాడిలో పెట్టడానికి చంద్రబాబుకు దాదాపు మూడేళ్లుకు పైగానే పట్టింది. ఒంగోలులో జరిగిన మహానాడు తర్వాతనే నేతలు బయటకు వచ్చి తమ నియోజకవర్గంలో కార్యకర్తలకు అండగా నిలిచారు. చంద్రబాబు ఇచ్చిన ధైర్యం, వరసగా అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సమావేశాలతో పార్టీ ఒక దారిన పడింది. కార్యకర్తలు వస్తున్నా నేతలు మాత్రం ఓటమి నుంచి బయటకు రావడానికి దాదాపు మూడున్నరేళ్లు పట్టిందంటే అతిశయోక్తి కాదు. చాలా మంది ఇతర ప్రాంతాలైన హైదరాబాద్, బెంగళూరు, మద్రాస్ వెళ్లి తమ వ్యాపారాలు చూసుకున్నారు తప్పించి పార్టీ క్యాడర్ కు నేతలు అండగా నిలిచిన వారు అతి కొద్ది మాత్రమేనని చెప్పాలి. చంద్రబాబు నేతలను ఒక దారికి తేవడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. చివరకు గట్టిగా వార్నింగ్ లు ఇస్తే తప్ప బయటకు రాలేదు. ఇప్పుడు వైసీపీ కూడా అదే పరిస్థితి. జగన్ తప్ప ఎవరూ బయటకు రాలేదు. పేర్నినాని, గుడివాడ అమర్‌నాథ్ వంటి నేతలు మాత్రం బయటకు వస్తున్నారు. నేతలు పూర్తిగా నైరాశ్యంలో ఉన్నట్లే కనిపిస్తుంది. ప్రభుత్వం ఇంకా పూర్తిస్థాయిలో తనకార్యక్రమాలు ప్రారంభించలేదు కానీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎలాంటి ఆందోళనలు చేపట్టేందుకు ఇది సమయం కాదన్నది కొందరి నేతల వాదన అయినప్పటికీ కనీసం పార్టీ కేంద్ర కార్యాలయాన్ని కూల్చడంతోనైనా బయటకు రాకుండా ఉండటం ఎంతవరకూ సబబని క్యాడర్ ప్రశ్నిస్తుంది. గత ఎన్నికల్లో టిక్కెట్లు పొంది గెలుపొందితే అధికారాన్ని ఎంజాయ్ చేసేవారని, అదే గెలవకపోయినంత మాత్రాన క్యాడర్ ను మర్చిపోతే ఎలా అంటూ అనేక మంది సోషల్ మీడియాలో నిలదీస్తున్నారు. జగన్ ఆరు నెలల తర్వాత అంటే డిసెంబరు నుంచి బయటకు వస్తారని అంటున్నారు. అప్పుడేమైనా నేతలు బయటకు వచ్చే అవకాశం ఉందా? లేదా? అన్నది తేలనుంది.

# ఆ ఇద్దరికి ఎమ్మెల్సీ ఛాన్స్

విజయవాడ, జూన్ 28 (ప్రజాస్వరం) :

: ఏపీలో మరో ఎన్నిక జరగనుంది. రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఉప ఎన్నిక జరగనుంది. ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి రామచంద్రయ్య, ఇక్బాల్ టిడిపిలో చేరారు. దీంతో వారిపై అనర్హత వేటు పడింది. ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. వచ్చే నెలలో ఎన్నిక నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు పై దృష్టి పెట్టారు చంద్రబాబు. డిప్యూటీ సీఎం పవన్ తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇద్దరు ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు పైన ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఏపీలో కూటమి 166 స్థానాల్లో విజయం సాధించడంతో.. ఇక ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాలన్నీ కూటమి సొంతం చేసుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఏపీలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీలకు సంబంధించి ఉప ఎన్నికలకు ఈసీ ఏర్పాటు చేస్తోంది. మరోవైపు అభ్యర్థుల ఎంపిక సైతం ఒక కులిక్కి వచ్చినట్లు సమాచారం. ఎన్నికల సమయంలో చాలామంది నేతలకు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్సీల భర్తీ ప్రక్రియ పై కసరత్తు కొనసాగుతోంది. సూత్రప్రాయంగా అభ్యర్థుల విషయంలో ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. పవన్ తో చర్చించి ఆయన ఆమోదం సైతం చంద్రబాబు తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. పవన్ కోసం సీటు త్యాగం చేసిన టిడిపి ఇన్చార్జ్ వర్మకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని చంద్రబాబు అప్పట్లో హామీ ఇచ్చారు. అందుకే ఈసారి తొలి ఛాన్స్ ఇవ్వాలని చంద్రబాబు భావిస్తున్నారు. దీనికి పవన్ సైతం ఆమోదముద్ర వేసినట్లు సమాచారం. పవన్ కు పిఠాపురంలో భారీ మెజారిటీ దక్కడం వెనుక వర్మ కృషి ఉంది. అందుకే వర్మ విషయంలో పవన్ సైతం సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో వర్మ అభ్యర్థిత్వం దాదాపు ఖరారు అయినట్టే. అయితే రెండు ఎమ్మెల్సీ పదవి పై తీవ్ర కసరత్తు జరిగింది. ముందుగా వంగవీటి రాధాకృష్ణ పేరు వినిపించింది. అయితే ఆయనకు తర్వాత చాన్స్ ఇద్దామని.. ఈసారి రాయలసీమ ముస్లిం నేతకు అవకాశం ఇస్తే బాగుంటుందని చంద్రబాబుతో పాటు పవన్ అభిప్రాయపడినట్లు సమాచారం. వైసీపీ నుంచి టీడీపీలోకి చేరే క్రమంలో పదవి కోల్పోయిన ఇక్బాల్ కే మరోసారి అవకాశం ఇవ్వాలనేది చంద్రబాబు ఆలోచనగా సమాచారం. ఇక్బాల్ అభ్యర్థిత్వంపై బిజెపి నేతల నుంచి సైతం అభిప్రాయాన్ని తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇక్బాల్ అనంతపురం జిల్లా హిందూపురం నియోజకవర్గానికి చెందిన నేత. ఎన్నికల్లో వైసీపీ టికెట్ ను ఆశించారు. కానీ హై కమాండ్ నమ్మించి మోసం చేసింది. దీంతో ఆయన టిడిపిలోకి ఫిరాయించారు. ఆయనపై అనర్హత వేటు వేసింది వైసిపి. పదవి కోల్పోయిన ఇక్బాల్ కు మరో ఛాన్స్ ఇస్తే.. మైనారిటీలకు ఒక రకమైన సంకేతం వెళ్తుందని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకే ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు.

# ఇండియాకు ప్రభాకరరావు..?

హైదరాబాద్, జూన్ 28 (ప్రజాస్వరం) :

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ప్రభాకర్ రావు ఇండియాకు వస్తున్నట్టు కొన్ని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ నెల 26వ తేదీతో ప్రభాకర్ రావు వీసా గడువు ముగియనున్నట్టు ఆయన తరఫు న్యాయవాదులు కోర్టులో ఇది వరకే తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావును విచారించడానికి పోలీసులు చాలా రోజులుగా ఎదురుచూస్తున్నారు. ఒక వేళ ప్రభాకర్ రావు ఇండియాలో అడుగుపెడితే.. మరుక్షణమే పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉన్నది. ఆయనను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌లోకి తీసుకోవడానికి సిట్ అధికారులు సిద్ధంగా ఉన్నారు. అయితే, అనారోగ్యం కారణంగా వీసా గడువును ప్రభాకర్ రావు పెంచుకునే అవకాశాలూ లేకపోలేవు. ఇందుకోసం ఆయన ప్రయత్నిస్తున్నట్టూ తెలుస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫోన్ ట్యాపింగ్ కేసు కలకలం రేపింది. ఎస్ఐబీ పోలీసులు అసాంఘిక శక్తులపై నిఘా పెట్టడం కంటే కూడా వేరే వారిపై నిఘా పెట్టినట్టు ఆరోపణలు వచ్చాయి. అప్పటి ప్రభుత్వ పెద్దలు రాజకీయ ప్రత్యర్థులపై నిఘా కోసం, ఎన్నికల్లోనూ ప్రత్యర్థులకు అడ్డంకులు సృష్టించడానికి వీరిని ఉపయోగించినట్టు వార్తలు ఉన్నాయి. అంతేకాదు, వ్యాపారవేత్తలు, ప్రైవేటు వ్యక్తుల జీవితాల్లోకి కూడా ఫోన్ ట్యాపింగ్ చేసి పలువురు పోలీసు అధికారులు తొంగిచూసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఫోన్ ట్యాపింగ్ కేసు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు ఉన్నారు. అయితే, ఆయన అనారోగ్య కారణాల రీత్యా అమెరికాకు వెళ్లినట్టు తెలిసింది. మరికొంత కాలం అమెరికాలోనే చికిత్స తీసుకోవాల్సి ఉంటుందని, ఆ తర్వాత తెలంగాణకు తిరిగి వచ్చి దర్యాప్తునకు సహకరిస్తానని ఆయన సన్నిహితులకు చెప్పినట్టు వార్తలు వచ్చాయి. కానీ, ఆయన తిరిగి రాలేదు. ఈ నేపథ్యంలోనే ప్రభాకర్ రావును విదేశీ దర్యాప్తు సంస్థల సహాయంతో పట్టుకుని స్వదేశానికి తీసుకురావాలనీ పోలీసులు భావించారు. ఇందుకోసం రెడ్ కార్నర్ నోటీసులు కూడా జారీ చేశారు. ప్రభాకర్ రావుతోపాటు శ్రవణ్ కుమార్‌కు కూడా నోటీసులు జారీ చేశారు. కానీ, ప్రభాకర్ రావును విచారించే విషయంలో పురోగతి సాధించలేకపోయారు. కోర్టులో ఆయన తరఫు న్యాయవాదులు వెల్లడించిన వివరాల ప్రకారం ఈ రోజు ఆయన ఇండియాకు తిరిగి రావాలి. ఒక వేళ వీసా గడువు పెంచుకుంటే.. పోలీసులు ఏం నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పటికి సస్పెన్స్. ఇది వరకే ఈ కేసులో ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్ రావులను పోలీసులు విచారించారు. ఈ విచారణలో ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక విషయాలను పోలీసులు రాబట్టారు. అయితే, ఈ వ్యవహారంలో కీలక సూత్రధారిగా భావిస్తున్న ప్రభాకర్ రావు విచారణపై ఉత్కంఠ నెలకొంది

# గనులపై కిం కర్తవ్యం...

హైదరాబాద్, జూన్ 28 (ప్రజాస్వరం) :

బొగ్గు గనుల వేలంపై కేంద్రం పట్టుబడుతోంది తెలంగాణలో గనుల వేలంపై కేంద్రం ఘాటుగా స్పందించింది. గత తొమ్మిదేళ్లుగా తెలంగాణ సర్కార్ ఒక్క మినరల్ బ్లాక్ ను కూడా వేలం వేయలేదని కేంద్ర గనుల శాఖ పేర్కొంది. అందుకే జూన్ 30 నాటికి కనీసం ఆరింటికయినా వేలం పూర్తి చేయాలని స్పష్టం చచేసింది. ఓ పక్క కేంద్రం తీరును రాష్ట్ర కాంగ్రెస్ దుయ్యబడుతుండగా నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంది కేసీఆర్ తీరు. అంతేకాదు బొగ్గు గనుల వేలం విషయంలో బీఆర్ఎస్ డబుల్ డ్రామాను ఇప్పుడు జనం గమనిస్తున్నారు. పదేళ్ల క్రితం అధికారంలోకి వచ్చీ రాగానే బీఆర్ఎస్ 80 మిలియన్ టన్నుల నిక్షేపాలు ఉన్న అది పెద్ద తాడిచెర్ల బొగ్గు గనిని ఏఎంఆర్ అనే ఓ ఆంధ్రాకంపెనీకి 30 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చేశారు కేసీఆర్. సింగరేణికి అది కోలుకోలేని దెబ్బ తీసినట్లయింది. 2015లో అప్పటి మోదీ ప్రభుత్వం తెచ్చిన మినరల్స్ అండ్ మైన్స్ చట్ట సవరణకు పార్లమెంట్ లో బీఆర్ఎస్ మద్దతు కూడా ఇచ్చింది. గతేడాది కూడా కోయగూడెం, సత్తుపల్లి ఓసీపీలకు వేలం పెడితే సింగరేణిని నాటి బీఆర్ఎస్ సర్కార్ వేలంలో పాల్గొనకుండా చేయడంతో రెండు ప్రైవేటు కంపెనీలు వాటిని దక్కించుకున్నాయి. పైగా ఆ రెండు సంస్థలు కూడా గులాబీ బాస్ కు కావలసిన వారికే దక్కాయనే ఆరోపణలు ఉన్నాయి. నోటిఫై చేసిన 11 గనుల్లో కనీసం ఆరింటికైనా ఈ నెల 30వ తేదీలోగా వేలం ప్రక్రియను పూర్తి చేయాలని ఈ నెల 16న కేంద్ర గనుల శాఖ నుంచి రాష్ట్రానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంత తక్కువ డెడ్‌లైన్‌తో కేంద్రం ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నదనే కోణం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆరాతీసింది. దీంతో కేసీఆర్ ప్రభుత్వ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కేంద్రం నుంచి వచ్చిన తాజా ఉత్తర్వుల అనంతరం వేలం ప్రక్రియను ఆపడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తీసుకోవడంలేదంటూ బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో అప్పటి వాస్తవం వెలుగులోకి రావడం గమనార్హం. గనుల వేలానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది, స్పష్టమైన నిర్ణయం తీసుకున్నదీ రాష్ట్ర ప్రభుత్వమే అనేది ఇప్పుడు కీలకంగా మారింది. అప్పట్లో కేసీఆర్ సర్కార్ కేంద్రంలోని మోదీ సర్కార్ కు అనుకూలంగా ఉన్నందునే ఇప్పుడు వేలం ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశిస్తూ డెడ్ లైన్ విధించాల్సి వచ్చిందని కాంగ్రెస్ చెబుతోంది. రాష్ట్రంలో విలువైన ఖనిజ సంపదను కాపాడుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్న సమయంలో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బయటపడడంతో దానికి ప్రత్యామ్నాయం ఏంటనేది ఇప్పుడు అధికారులకు సవాలుగా మారింది. బొగ్గు గనులతో పాటు తెలంగాణలోని ఖనిజ సంపదను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విధ్వంసం చేసిందనే ఆరోపణలకు ఈ అంశాలు బలం చేకూరినట్లయింది. ఖనిజ సంపదను ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టేందుకే అప్పట్లో కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారన్నది బహిర్గతమైంది. వాస్తవాలు ఇలా ఉండగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం.. కొత్తగా ఇప్పుడే బొగ్గు గనులను వేలం వేస్తున్నట్లు, అందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తున్నట్లు చేస్తున్న ట్వీట్లపై కార్మికులతో పాటుకార్మిక సంఘాల నేతలు మండిపడుతున్నారు. బొగ్గు గనులపై బీఆర్ఎస్ది డబుల్ గేమ్ అని ఫైర్ అవుతున్నారు.

# బృందావన్ కాలనీలో హత్య కలకలం

విజయవాడ, జూన్ 28 (ప్రజాస్వరం) :

నడిరోడ్డుపై నరికి నరికి ఓ వ్యాపారిని దారుణంగా హత్య చేశాడు ఓ యువకుడు. కన్న కుమార్తె ఎదురుగానే కర్కశంగా హతమార్చాడు. బృందావన్ కాలనీలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. భవానీపురంలోని చెరువు సెంటర్‌కు చెందిన కె.శ్రీరామచంద్రప్రసాద్ (56) బృందావన్ కాలనీలో కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. నిత్యం భవానీపురం నుంచి రాకపోకలు సాగిస్తున్నాడు. ఆయన కుమార్తె దార్శిని ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువు తోంది. విద్యాధరపురానికి చెందిన గడ్డం శివమణికంఠ విజ్ఞాన్ విహార్ స్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. మణికంఠకు ఇన్‌స్టాలో దార్శినితో పరిచయం ఏర్పడింది. నాలుగేళ్లుగా ప్రేమించుకుంటు న్నారు. ఈ విషయం తెలిసిన శ్రీరామచంద్రప్రసాద్ కుమార్తెను హెచ్చరించాడు. బాగా చదువుకుని జీవితంలో స్థిరపడాలన్నాడు. తన కుమార్తె జోలికి రావద్దని మణికంఠను హెచ్చరించాడు. దీంతో కొద్దిరోజులుగా దార్శిని అతడిని పక్కనపెట్టింది. పెళ్లి చేసుకోవాలని మణికంఠ చేసిన ప్రతిపాదనను తిరస్కరించింది. దీనిపై శ్రీరామచంద్రప్రసాద్ కొంతమందిని తీసుకుని మణికంఠ ఇంట్లో పంచాయితీ పెట్టాడు. ఆ తర్వాత మణికంఠ ఇంట్లో రోజూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మణికంఠ తల్లి గురువారం ఇల్లు విడిచి వెళ్లిపోయింది. దీంతో మణికంఠ పగ పెంచుకున్నాడు. గురువారం శ్రీరామచంద్రప్రసాద్ కుమార్తెను తీసుకుని బృందావన్ కాలనీలోని కిరాణా షాపునకు వచ్చాడు. రాత్రి 9 గంటల సమయంలో షాపు మూసేసి ఇద్దరూ ఇంటికి బయల్దేరారు. పగతో రగిలిపోతున్న మణికంఠ కత్తి తీసుకుని బృందావన్ కాలనీకి వచ్చాడు. షాపునకు 100 మీటర్ల దూరంలో ఉన్న ఓ చెట్టు కింద నిలబడ్డాడు. తండ్రీకూతుళ్లు స్కూటర్‌పై వస్తుండగా, ఎదురుగా వెళ్లి బైకుతో ఢీ కొట్టాడు. కిందపడిపోయిన శ్రీరామచంద్రప్రసాద్‌పై కత్తితో వేటు వేశాడు. రోడ్డుపై పడిన తండ్రిని దార్శిని పక్కకు తీసుకెళ్లి కూర్చోబెట్టగానే మళ్లీ నరికాడు. దార్శిని ఎంత ఆపినా విచక్షణ లేకుండా నరికాడు. ఆ తర్వాత ఆమెను బెదిరించాడు. తనతో తిరిగిన వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని హెచ్చ రించాడు. చుట్టుపక్కల వారు రాగానే పరారయ్యాడు. శ్రీరామచంద్రప్రసాద్‌ను వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసు పత్రి మార్చురీకి తరలించారు. కేసును కృష్ణలంక ఇన్‌స్పెక్టర్ ఆకుల మురళీకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

# గంజాయి సేవించి జీవితం నాశనం చేసుకోవద్దు

రాజన్న సిరిసిల్ల, జూన్ 28 (ప్రజాస్వరం) :

గతంలో గంజాయి సేవిస్తూ పట్టుబడిన వారికి తల్లిదండ్రుల సంక్షేమంలో కౌన్సెలింగ్. యువత డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై వారి భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దు అని ఒక మంచి ఉద్దేశంతో సిరిసిల్ల పట్టణం రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్స్ పరిధిలో గతంలో పలు సందర్భంల్లో గంజాయి సేవిస్తూ పట్టుబడి వారికి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువత అని, అలాంటి యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిస కావడం ద్వారా చాలావరకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు అనుకోకుండా నేరాలు చేసే అవకాశం ఉంటుందని, మతుపదార్థాలకు అలవాటు పడి ఏదైనా నేరం చేసినట్లయితే ఎలాంటి ఉద్యోగం రాదని, ఉపాధి కోసం విదేశాలకు వెళ్లలేరని అన్నారు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల బారిన పడిన యువకులు సత్ప్రవర్తనతో మంచి మార్గంలో నడుచుకోవడానికి ఈ కౌన్సిలింగ్ మంచి మార్గమని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రవర్తనలో మార్పు తెచ్చుకొవలన్నారు.

# బెజవాడలో దారుణం...

### ప్రేమ కాదన్నాడని... ప్రియురాలి తండ్రి హత్య

విజయవాడ, జూన్ 28 (ప్రజాస్వరం) :


విజయవాడలోని బృందావన్ కాలనీలో జరిగిన హత్య జిల్లానో షేక్ చేస్తోంది. ప్రేమకు అడ్డుగా ఉన్నాడన యువతి తండ్రిని అత్యంత పాశవికంగా చేసిన హత్య రాజధాని ప్రాంతంలోనే హాట్‌టాపిక్‌గా మారింది. బృందావన్ కాలనీ చెరువు సెంటర్‌కు చెందిన కె.శ్రీరామచంద్రప్రసాద్ కిరాణాదుకాణం నడుపుతున్నాడు. ఆయనకు ఓ కుమార్తె ఉంది. ఆమె పేరు దార్శని. ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతోంది. విద్యాధరపురానికి చెందిన గడ్డం శివమణికంఠ ఓ ప్రైవేట్ స్కూల్‌లో పీఈటీగా పని చేస్తున్నాడు. వీళ్లిద్దరికి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది హత్యకు దారి తీసింది. నాలుగేళ్ల క్రితం మణికంఠకు, దార్శని ఇన్‌స్టాలో పరిచయమైంది. ఆ పరిచయం ప్రేమగా మారింది. మణికంఠతో కుమార్తె తిరుగుతుందని తెలుసుకున్న కె.శ్రీరామచంద్రప్రసాద్ బాధపడ్డాడు. కుమార్తెను పిలిచి బుద్ధిగా చదువుకోవాలని ఇప్పుడున్న ఆకర్ష తర్వాత ఉండదని హితబోధ చేశాడు. కుమార్తెకు హితబోధన చేసిన కె.శ్రీరామచంద్రప్రసాద్ మణికంఠను పిలిచి అవే మాటలు చెప్పాడు. తన బిడ్డతో తిరగొద్దని సర్ది చెప్పాడు. అది జరిగిన తర్వాత దార్శని మణికంఠతో మాట్లాడటం మానేసింది. అయినా మణికంఠ ఆమె వెంట పడటం మానలేదు. పెళ్లి చేసుకోవాలంటూ ఒత్తిడి చేస్తూ వచ్చాడు. మణికంఠ ప్రవర్తనతో విసిగిపోయిన కె.శ్రీరామచంద్రప్రసాద్ ఫ్యామిలీ వాళ్ల ఇంట్లో పంచాయితీ పెట్టింది. కొంత మంది పెద్ద మనుషులను తీసుకెళ్లి తన బిడ్డ జోలికి రావద్దని చెప్పాలని మణికంఠ తల్లికి చెప్పారు. అసలు విషయం తెలుసుకున్న ఆ ఫ్యామిలీ షాక్‌కి గురైంది. అప్పటి నుంచి ఆ ఫ్యామిలీలో దీనిపైనే రోజూ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. దార్శనిని దూరం చేయడంతో శ్రీరామచంద్రప్రసాద్‌పై మణికంఠ కసి పెంచుకున్నాడు. దీనికి తోడు ఇంట్లో విషయం చెప్పి తిట్టించడంతో మరింత కోపం రెట్టింపు అయింది. ఈ గొడవతోనే తన తల్లి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇక పగతో రగిలిపోయిన మణికంఠ గురువారం కాపు కాసి కె.శ్రీరామచంద్రప్రసాద్‌పై వేటు వేశాడు. కిరాణ దుకాణం కట్టేసి తండ్రీ కుమార్తె వస్తున్న టైంలో కాపు కాసి అటాక్ చేశాడు. తన బైక్‌తో వారి బైక్‌ను ఢీ కొట్టాడు. కింద పడిపోయిన శ్రీరామచంద్రప్రసాద్‌పై ఎటాక్ చేశాడు. చేతిలో ఉన్న కత్తిలో విచక్షరహింతగా నరికాడు. దార్శని ఎంత చెబుతున్నా వినిపించుకోలేదు. చివరకు ఆమెను కూడా చంపుతానని బెదిరించాడు. గొడవ సంగతి తెలుసుకొని స్థానికులు రావడంతో మణికంఠ పరారయ్యాడు. రక్తపు మడుగులో ఉన్న కె.శ్రీరామచంద్రప్రసాద్‌ను ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు చెప్పారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వివాహితులకు 'నోజాబ్' అంటూ ఫాక్స్‌కాన్‌పై ప్రచారం




వివాహితులకు 'నోజాబ్' అంటూ జరుగుతున్న ప్రచారంపై ఐఫోన్ తయారీ సంస్థ ఫాక్స్‌కాన్ ఖండించింది. తాము నియమించుకున్న ఉద్యోగుల్లో 25 తం మంది వివాహుతలైన మహిళలే ఉన్నారని స్పష్టం చేసింది. తమిళనాడులోని చెన్నై కేంద్రంగా ఫాక్స్‌కాన్ సంస్థ ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ ఐఫోన్‌లను తయారు చేస్తుంది. అయితే ఇటీవల ఐఫోన్ తయారీ మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్‌లో మరికొంత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించింది. కానీ దీనిపై ప్రచారం మరోలా జరిగినట్లు తెలుస్తోంది. ఫాక్స్‌కాన్ యాజమాన్యం వివాహితులైన మహిళల్ని నియమించుకోవడం లేదనే పుకార్లు షికార్లు చేశాయి. ఈ ప్రచారంతో అప్రమత్తమైన కేంద్రం ఫాక్స్‌కాన్‌లో జరిగిన నియామకాలపై వెంటనే తమకు సమగ్ర సమాచారాన్ని అందించాలని తమిళనాడు కార్మిక శాఖకు ఆదేశాలు జారీచేసింది. ఉద్యోగుల నియామకంపై ఫాక్స్‌కాన్ వివరణ ఇచ్చినట్లు పలు జాతీయ మీడియా కథనాలు వెలుగులోకి వచ్చాయి. ఆ కథనాలు ఆధారంగా తమ ఐఫోన్ తయారీ ప్లాంట్‌లో కొత్తగా ఉద్యోగుల నియామకం జరిగిందని, వారిలో 25 శాతం మంది వివాహిత మహిళలేనని ఫాక్స్‌కాన్ ప్రతినిధులు చెప్పారు. ఉద్యోగం రాలేదని అసత్య ప్రచారం చేశారని, ఇలాంటి నిరాధారమైన ప్రచారంతో వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతీయ తయారీ రంగాన్ని దెబ్బతీస్తున్నాయని వారు తెలిపారు. ఇదిలా ఉంటే, ఫాక్స్ కాన్ ప్లాంట్‌లో పని చేయడానికి వివాహిత మహిళలను అనుమతించకపోవడంపై పలు మీడియా సంస్థలు (అందులో పీటీఐ) ఆరా తీయగా ఫాక్స్‌కాన్ ఫ్యాక్టరీలో ప్రస్తుతం 70 శాతం మంది మహిళలు, 30 శాతం మంది పురుషులు ఉన్నారు. తమిళనాడు ప్లాంట్ దేశంలో మహిళలు అత్యధికంగా ఉపాధి పొందుతున్న మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్‌గా పేరు సంపాదించింది. ఇందులో ప్రస్తుతం ఉపాధి పొందుతున్న సిబ్బంది సంఖ్య 45,000 దాటినట్లు ఫాక్స్‌కాన్ ప్రతినిధులు వెల్లడించారు.

## భారత్‌లోనే విలువైన బ్రాండ్




భారత్‌లో అత్యంత విలువైన బ్రాండ్‌ల్లో టాటా గ్రూప్ టాప్‌లో నిలిచింది. ఈ మేరకు బ్రాండ్ ఫైనాన్స్ తాజాగా విడుదల చేసిన విలువైన బ్రాండ్ ర్యాంకింగ్స్ టైటిల్‌ను టాటా గ్రూప్ దక్కించుకుంది. డిజిటలైజేషన్, ఈ-కామర్స్, ఈవీ, ఎలక్ట్రానిక్స్..వంటి రంగాలపై దృష్టి సారించిన ఈ సంస్థ బ్రాండ్ విలువ గతంలో కంటే 9 శాతం పెరిగి 28.6 బిలియన్ డాలర్ల(రూ.2.3 లక్షల కోట్లు)కు చేరుకుంది. గతేడాది ఈ టైటిల్‌కు దక్కించుకున్న టాటా గ్రూప్ ఈసారీ తన స్థానాన్ని నిలుపుకుంది. బ్రాండ్ ఫైనాన్స్ నివేదిక ప్రకారం..దేశంలోనే అత్యంత విలువైన బ్రాండ్‌గా టాటా గ్రూప్ టాప్‌లో నిలిచింది. 14.2 బిలియన్ డాలర్ల(రూ.1.18 లక్షల కోట్లు) బ్రాండ్ విలువతో ఇన్ఫోసిస్ రెండో స్థానంలో ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్ మూడో స్థానం (రూ.86 వేలకోట్లు) సాధించింది. గతేడాదిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనం అవ్వడంతో ఈ స్థానం దక్కింది. ఎల్‌ఐసీ గ్రూప్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ గ్రూప్, ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్, లార్సెన్ ఏ టూబ్రో, మహీంద్రా బ్రాండ్‌లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. బ్రాండ్ ఫైనాన్స్ డైరెక్టర్ సావియో డిసౌజా మాట్లాడుతూ..'టాటా గ్రూప్ దాని అనుబంధ సంస్థల్లో అత్యాధునిక సాంకేతికత వినియోగిస్తోంది. వ్యూహాత్మకంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) స్పాన్సర్‌షిప్‌లు, ఎయిరిండియా వంటి కంపెనీ వాటాను సొంతం చేసుకుంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న రిటైల్ డొమైన్‌లో ప్రత్యేకత చాటుకుంటోంది. దాంతో కంపెనీ వినియోగదారులకు మరింత చేరువైంది. భారత్‌లోనే అత్యంత విలువైన బ్రాండ్‌గా స్థానం సంపాదించింది' అని చెప్పారు. రంగాల వారీగా చూస్తే టెలికాం రంగం తన బ్రాండ్ విలువలో గతంలో కంటే 61 శాతం వృద్ధి సాధించింది. బ్యాంకింగ్ 26 శాతం, మైనింగ్, ఇనుము, ఉక్కు రంగాలు 16 శాతం చొప్పున వృద్ధి నమోదు చేశాయి. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బ్రాండ్‌లలో వెస్ట్‌సైడ్ బ్రాండ్(టాటా గ్రూప్- 122 శాతం వృద్ధి) అగ్రస్థానంలో ఉంది.

## 'ప్రాథమిక పన్ను మినహాయింపును రూ.3.5 లక్షలకు పెంచాలి'



కేంద్రం త్వరలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో పన్ను విధానానికి సంబంధించి స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.1 లక్షకు పెంచాలని ఫైనాన్షియల్ కన్సల్టెన్సీ సంస్థ ఈవై డిజి ఇండియా తెలిపింది. ప్రాథమిక పన్ను మినహాయింపు పరిమితిని రూ.3.5 లక్షలకు పెంచాలని కోరింది. ఈవై తెలిపిన వివరాల ప్రకారం..ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడానికి విధాన పరమైన ఫ్రేమ్‌వర్క్‌లను రూపొందించాలి. పన్ను విధానాలను క్రమబద్ధీకరించాలి. దేశీయంగా పెట్టుబడులు ఆకర్షించే వాతావరణాన్ని పెంపొందించేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలి. కార్పొరేట్ పన్ను రేట్లను స్థిరంగా కొనసాగించాలి. టీడీఎస్ నిబంధనను మార్చాలి. వివాద పరిష్కారాలను సరళీకరించాలి. పన్ను మినహాయింపులు లేని కొత్త విధానాన్ని ప్రవేశపెట్టాలి. రాయితీ పన్ను విధానంలో ఉన్న స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50,000 నుంచి రూ.1 లక్షకు పెంచాలి. ప్రాథమిక మినహాయింపు పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.3.5 లక్షలకు చేర్చాలి. ఐటీఆర్ ప్రాసెస్ చేయడంలో పన్ను చెల్లింపుదారులు నిరంతరం సవాళ్లను ఎదుర్కొంటున్నారు. దాన్ని మెరుగుపరిచేలా సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ) సేవలు వినియోగించుకోవాలి. 'టీడీఎస్‌ను హేతుబద్ధీకరించాలి. ప్రస్తుతం టీడీఎస్ కింద 33 విభాగాలు ఉ?న్నాయి. దాంతో పన్నుదారుల్లో చాలా గందరగోళం నెలకొంటుంది. వీటిలో 0.1 నుంచి 30 శాతం వరకు పన్ను రేట్లు ఉంటాయి. ఇందులోని విధానాలను సరళీకరించాలి' అని ఈవై కన్సల్టెన్సీ కోరింది.

# 12 ఏళ్ల కనిష్టానికి బ్యాంకుల మొండిబాకీలు




న్యూఢిల్లీ: మనదేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని, బ్యాంకింగ్ సిస్టమ్ నిలకడగా ఉందని ఆర్‌బీఐ ఫైనాన్షియల్ స్టెబిలిటీ రిపోర్ట్ (ఎఫ్‌ఎస్‌ఆర్) పేర్కొంది. షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల గ్రాస్ నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ (జీఎన్‌పీఏ) రేషియో (మొత్తం అప్పుల్లో జీఎన్‌పీఏల వాటా) ఈ ఏడాది మార్చి నాటికి 12 ఏళ్ల కనిష్టమైన 2.8 శాతానికి తగ్గిందని వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 2.5 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది. నెట్ నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ (ఎన్‌ఎన్‌పీఏ) రేషియో 0.6 శాతానికి దిగొచ్చిందని పేర్కొంది. కిందటి ఆర్థిక సంవత్సరంలోని చివరి ఆరు నెలల్లో ప్రభుత్వ బ్యాంకుల గ్రాస్ ఎన్‌పీఏల రేషియో 0.76 శాతం తగ్గిందని తెలిపింది. బ్యాంకుల బ్యాలెన్స్‌షీట్ మెరుగుపడుతోందని, ఫైనాన్షియల్ సంస్థలు ఇస్తున్న అప్పులు పెరుగుతున్నాయని ఆర్‌బీఐ ఎఫ్‌ఎస్‌ఆర్ పేర్కొంది. బ్యాంకుల క్యాపిటల్ టు రిస్క్ వెయిటెడ్ రేషియో (సీఆర్‌ఏఆర్- క్యాపిటల్ అడెక్వసీ రేషియో) 16.8 శాతంగా ఉందని, కామన్ ఈక్విటీ టైర్ 1 (సీఈటీ1) రేషియో 13.9 శాతంగా ఉందని ఎఫ్‌ఎస్‌ఆర్ వివరించింది. ఎన్‌పీఏలుగా మారే అసెట్స్‌తో బ్యాంకుల దగ్గరున్న క్యాపిటల్‌ను పోల్చడానికి సీఆర్‌ఏఆర్ సాయపడుతుంది. బ్యాంకుల ఆస్తులను వీటి క్యాపిటల్‌తో పోల్చడానికి సీఈటీ1 రేషియో సాయపడుతుంది. ఆర్‌బీఐ పెట్టుకున్న సీఆర్‌ఏఆర్ టార్గెట్స్‌ను వచ్చే ఏడాది మార్చి నాటికి చేరుకుంటామని ఎఫ్‌ఎస్‌ఆర్ వెల్లడించింది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) ఆర్థిక పరిస్థితులు మెరుగవుతున్నాయని, వీటి సీఆర్‌ఏఆర్ ఈ ఏడాది మార్చి నాటికి 26.6 శాతంగా, జీఎన్‌పీఏ రేషియో 4.0 శాతంగా ఉన్నాయని వివరించింది. గ్లోబల్‌గా సమస్యలు ఉండడంతో రిస్క్‌లు లేకపోలేదని ఆర్‌బీఐ ఎఫ్‌ఎస్‌ఆర్ రిపోర్ట్ పేర్కొంది. అయినప్పటికీ గ్లోబల్ ఫైనాన్షియల్ సిస్టమ్ నిలకడగా ఉందని తెలిపింది. ఫైనాన్షియల్ సిస్టమ్‌ను కొత్త టెక్నాలజీలు ఇబ్బంది పెట్టకుండా చూసుకోవాలని ఆర్?బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. ప్రస్తుతం బ్యాంకింగ్ సిస్టమ్‌లో స్టెబిలిటీ ఉందని, కానీ ఇక్కడి నుంచి ఈ వ్యవస్థ మెరుగుపడాలంటే అంత ఈజీ కాదని అన్నారు. కొత్త టెక్నాలజీలతో కస్టమర్ల ఎక్స్‌పీరియెన్స్ మెరుగుపడుతుందని, అలానే ఫైనాన్షియల్ సిస్టమ్‌లో ఇవి వేగంగా విస్తరించడం వలన సమస్యలు కూడా నెలకొంటాయని అన్నారు. బ్యాంకులు, సంస్థలు, ఇతర స్టేక్‌హోల్డర్లు టెక్నాలజీని సరిగ్గా వాడుకోవడానికి సరిపడినంత ఇన్వెస్ట్ చేయాలని, సెక్యూరిటీని బలపరుచుకోవాలని సూచించారు.

# రూ.883లకే విమాన ప్రయాణం..!



విమానం ఎక్కాలన్నది చాలా మంది కల.. దానిని ఇటీవల సామాన్యులు కూడా నెరవేర్చుకుంటున్నారు. అయితే ఇంకా ఆ కల నెరవేర్చుకోలేని మిడిల్ క్లాస్ ప్రజల కోసం విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ తాజాగా ఫ్లాష్ సేల్‌ను ప్రకటించింది. దీని ప్రకారం తమ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా ఎక్స్‌ప్రెస్ లైట్ కింద బుక్ చేసుకుంటే చార్జీలు కేవలం రూ.883 నుంచే ప్రారంభమవుతాయని తెలిపింది. అలాగే ఇతర మాధ్యమాల ద్వారా ఎక్స్‌ప్రెస్ వాల్యూ కింద టికెట్ బుక్ చేసుకుంటే రూ.1,096 నుంచి చార్జి వసూలు అవుతాయని వెల్లడించింది. సెప్టెంబర్ 30 వరకు ప్రయాణాల కోసం జూన్ 28 వరకు చేసుకునే బుకింగ్స్‌కు ఈ చార్జీలు వర్తిస్తాయని ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ తెలిపింది. ఇక ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ అధికారిక వెబ్‌సైట్ ఫ్ట్రజూం://ఫ్ఱఅతీఱఅఎఱఖవఞ-జూతీవం.ఱశీఎ నుంచి టికెట్ బుక్ చేసుకునే వినియోగదారులు ఇటీవల లాంచ్ చేసిన జీరో చెక్ ఇన్ బ్యాచేజ్ ఎక్స్‌ప్రెస్ లైట్‌కు ప్రత్యేక డిస్కౌంట్లతో ఎక్స్‌క్లూజివ్ యాక్సెస్ పొందవచ్చు. ఎక్స్‌ప్రెస్ లైట్ చార్జీలు అదనంగా 3 కిలోల క్యాబిన్ బ్యాగేజీని ఎలాంటి రుసుము లేకుండా ముందస్తుగా బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. అలాగే దేశీయ విమానాలలో 15 కిలోలకు రూ.1000, అంతర్జాతీయ విమానాలలో 20 కిలోలకు రూ.1,300 చొప్పున చెక్ ఇన్ బ్యాగేజీ కోసం డిస్కౌంట్ ఇస్తున్నట్లు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ తెలిపింది.

## జనరిక్ ఔషధ ఎగుమతుల్లో విస్తృత అవకాశాలు



జనరిక్ ఔషధ ఎగుమతుల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మాక్సిల్) డైరెక్టర్ జనరల్ ఉదయ భాస్కర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో సీనియర్ డైరెక్టర్ లక్ష్మీ ప్రసన్నతో కలిసి ఉదరు భాస్కర్ మీడియాతో మాట్లాడుతూ.. 2023 నుంచి 2029 వరకు ఈ రంగంలో 10 బిలియన్ డాలర్లు (రూ.83వేల కోట్లు) రెవెన్యూకు అవకాశాలున్నాయన్నారు. ఇందుకు 15 కీలక ఔషధాలు మద్దతును అందించనున్నాయని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మేలో భారత ఔషధ ఎగుమతులు 8.85 శాతం పెరిగి రూ.4.73 బిలియన్ డాలర్లకు చేరాయన్నారు. గతేడాది ఇదే రెండు నెలల్లో 4.35 బిలియన్ల ఎగుమతులు జరిగాయన్నారు. దేశంలో 748 యూనిట్లకు యుఎస్‌ఎఫ్‌డిఎ అనుమతులు ఉన్నాయని తెలిపారు. 2004-05లో 3.9 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత ఔషధ ఎగుమతులు.. 2023-24 నాటికి 27.85 బిలియన (రూ.2.32 లక్షల కోట్లు)కు చేరాయన్నారు. ఈ కాలంలో ప్రతీ ఏడాది సగటున 11 శాతం వృద్ధి నమోదయ్యిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 31 బిలియన్ డాలర్ల (రూ.2.58 లక్షల కోట్లు)కు చేరొచ్చని ఉదరు అంచనా వేశారు. కాగా.. లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలపై భారత ఫార్మా కంపెనీలు కీలక దృష్టిని సారించాయన్నారు. ఫార్మెక్సిల్ ఆధ్వర్యంలో 10వ ఎడిషన్ ఇంటర్నేషనల్ ఫార్మా ఎగ్జిబిషన్ ఐపెక్స్ జరుగనుందని ఉదయ భాస్కర్ తెలిపారు. ఆగస్ట్ 28 నుంచి 30 వరకు గ్రేటర్ నోయిడాలోని ఐఇఎంఎల్‌లో దీన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. భారత్ నుంచి 440 ఎక్స్ పోర్టర్స్ పాల్గని వారి ఉత్పత్తులను ప్రదర్శించనున్నారని తెలిపారు. 120 దేశాల నుంచి 500 మంది ఓవర్సీస్ బిజినెస్ డెలిగేట్స్ ఇందులో పాల్గనే అవకాశం ఉందన్నారు.

## వినియోగదారులకు షాక్ ఇచ్చిన జియో..




ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ జియో తమ రీచార్జి టారీఫ్‌లను పెంచనున్నట్లు ప్రకటించింది. ఒక్కో ప్లాన్ పై కనిష్ఠంగా 12.5 శాతం నుంచి గరిష్ఠంగా 25 శాతం వరకు పెంచనున్నట్లు జియో గురువారం (జూన్ 27) ప్రకటించింది. దీంతోపాటు కొత్త రీఛార్జి ప్లాన్లను తెచ్చింది. కొత్త టారీఫ్ అమలు నుంచి రోజుకు 2 జీబీ కంటే ఎక్కువ డేటా ఇచ్చే ప్లాన్లలో మాత్రమే అపరిమిత 5జీ డేటా సౌకర్యం ఉంటుంది. ఈ కొత్త ధరలు జూలై 3 నుంచి అమల్లోకి వస్తాయి. జియో సేఫ్ క్వాంటం సెక్యూర్: ఇది కాలింగ్, మెసేజ్, ఫైల్స్ ట్రాన్స్‌ఫర్ తో పాటు కమ్యూనికేషన్ సదుపాయాలు అందించే యాప్. నెలకు రూ.199 చెల్లించి ఈ సర్వీసులను పొందవచ్చు. జియో ట్రాన్స్‌లేట్- ఏఐ: ఈ యాప్ వాయిస్ కాల్, వాయిస్ మెసేజ్, టెక్ట్స్, ఇమేజ్‌లోని సమాచారాన్ని కృత్రిమ మేథ (ఏఐ)తో అనువాదం చేస్తుంది. నెలకు రూ.99 చెల్లిస్తే ఈ యాప్ సేవలు పొందవచ్చు. జియో యూజర్లకు ఈ రెండు సర్వీసులను ఏడాది పాటు ఉచితంగా జియో అందిస్తుంది. దేశంలో 2జీ నెట్‌వర్క్‌కు పరిమితమైన వారు ఇంకా 250 మిలియన్ల మంది ఉన్నారు. వారు డిజిటల్ సేవలను వినియోగించుకోవడం లేదని జియో తెలిపింది. వీరిని కొత్త తరం వైపుగా తీసుకచ్చేందుకు 4జీ సదుపాయంతో జియో భారత్, జియో ఫోన్లను తీసుకొచ్చినట్లు తెలిపింది. 'ట్రూ5జీ ఇప్పుడు అత్యంత వేగవంతమైన నెట్‌వర్క్. దేశంలో సొంతంగా 5జీ నెట్‌వర్క్ అందిస్తున్న టెలికాం సంస్థ మాదే. ప్రస్తుతం భారత్‌లో ఉన్న 5జీ మొబైల్స్‌లో 85 శాతం జియోతో పని చేస్తున్నవే' అని సంస్థ స్పష్టం చేసింది.

# చరిత్రలో తొలిసారి ఫైనల్‌కు దక్షిణాఫ్రికా




సెమీస్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై ఘన విజయం ట్రినిడాడ్: టి20 ప్రపంచకప్2024 ఫైనల్లోకి దక్షిణాఫ్రికా జట్టు దూసుకెళ్లింది. టారోబాలోని బ్రియాన్ లారా స్టేడియంలో గురువారం ఏకపక్షంగా సాగిన తొలి సెమీస్‌లో దక్షిణాఫ్రికా జట్టు 9వికెట్ల తేడాతో ఆఫ్ఘనిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. దీంతో దక్షిణాఫ్రికా జట్టు 30ఏళ్లలో తొలిసారి ఓ ప్రపంచకప్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘన్ జట్టు11.5ఓవర్లలో 56పరుగులకే ఆలౌటైంది. స్వల్ప లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికాకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ డికాక్ (5) తక్కువ స్కోరుకే వెనుదిరిగాడు. మరో ఓపెనర్ హెండ్రిక్స్(29), కెప్టెన్ మార్‌క్రమ్(23) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. అఫ్గాన్ బౌలర్లలో ఫరూకీ ఒక వికెట్ దక్కించుకున్నాడు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్తాన్ 11.5ఓవర్లలో కేవలం 56పరుగులకు ఆలౌటైంది. టోర్నీ ఆరంభం నుంచి ఇప్పటివరకు అసాధారణ ప్రతిభ కనబరిచిన ఆఫ్ఘన్ బ్యాటర్లు రాణించినా.. కీలక మ్యాచ్‌లో చేతులెత్తేశారు. అజ్మతుల్లా ఒమర్జారు(10) మినహా మిగతా వారెవరూ రెండంకెల స్కోరు చేయలేకపోయారు. దక్షిణాఫ్రికా బౌలర్లు వరుస వికెట్లు పడగొడుతూ అఫ్గాన్‌ను కుప్పకూల్చారు. ఓపెనర్లు గుర్బాజ్(0), జర్దాన్ (2), తొలి డౌన్‌లో వచ్చిన గుల్బాదిన్ నైబ్(9) పూర్తిగా విఫలమయ్యారు. ఇన్నింగ్స్‌ను చక్కదిద్దేందుకు ఒమర్జారు ప్రయత్నించాడు. కానీ, నోకియా బౌలింగ్‌లో స్టబ్స్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కెప్టెన్ రషీద్ ఖాన్ (8) కూడా ఆకట్టుకోలేక పోయాడు. నబీ(0), జనత్(8), నూర్ ఆహ్మద్(0), నవీనుల్ హాక్(2), ఫరూకీ(2) ప్రభావం చూపించలేకపోయారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో జాన్సెన్, షాంసీలకు చెరో 3 వికెట్లు తీయగా.. రబడా, నోర్జే రెండేసి వికెట్లు పడగొట్టారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జాన్సెన్‌కు లభించింది.

# ఇది నిజంగా యాదృచ్ఛికమే?



ఎన్నో రోజుల నుంచి ప్రపంచ క్రికెట్ ప్రేక్షకులందరినీ కూడా అలరిస్తూ వచ్చిన టి20 ప్రపంచ కప్ టోర్ని ప్రస్తుతం చివరి దశకు చేరుకుంది అన్న విషయం తెలిసిందే.ఎందుకంటే ఇక మరికొన్ని రోజుల్లో ఈ వరల్డ్ కప్ టోర్నీకి ముగింపు కార్డు పడబోతుంది. అందరూ ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న వరల్డ్ కప్ టైటిల్ విజేత ఎవరు అన్న విషయం తేలిపోబోతుంది. కాగా నేడు సెమి ఫైనల్ మ్యాచ్ ఎంత ఉత్కంఠ భరితంగా సాగుతోంది అన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే నేడు ఇంగ్లాండ్ టీమ్ ఇండియా జట్ల మధ్య రెండో సెమీఫైనల్ మ్యాచ్ జరుగుతుంది అని చెప్పాలి. అంతకుముందు ఉదయం జరిగిన మొదటి సెమి ఫైనల్ మ్యాచ్లో ఆఫ్ఘనిస్తాన్ సౌత్ ఆఫ్రికా జట్టు తలపడగా ఇక సౌత్ ఆఫ్రికా, ఆఫ్గనిస్తాన్ పై విజయం సాధించి ఫైనల్ లో అడుగుపెట్టింది. ఇక ఇప్పుడు రెండో సెమి ఫైనల్ మ్యాచ్లో విజేతగా నిలిచి ఫైనలిస్ట్ కాబోయే జట్టు ఏది అనే విషయం తెలుసుకునేందుకు అభిమానులు అందరూ కూడా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ప్రస్తుతం మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగుతూ ఉండగా .. ఇంగ్లాండ్ ఇండియా కెప్టెన్ల గురించి ఆసక్తికర విషయం ఒకటి సోషల్ మీడియాలో వైరల్ గా మారిపోయింది. ఏకంగా ఈ టి20 వరల్డ్ కప్ హిస్టరీలో ఇది ఒక యాదృచ్ఛిక ఘటన అని చెప్పాలి. ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మఇంగ్లాండ్ కెప్టెన్ జాస్ బట్లర్ ఇప్పటివరకు ఆడిన ఇన్నింగ్స్ లు చేసిన రన్స్ మాత్రమే కాదు స్ట్రైక్ రేట్ కూడా ఒకేలా ఉండడం గమనార్హం. ఇప్పటివరకు రోహిత్ బట్లర్ ఈ వరల్డ్ కప్ లో ఆరు ఇన్నింగ్స్ లు ఆడాడు. ఇక ఇద్దరు కూడా వ్యక్తిగత ప్రదర్శనలో బ్యాటింగ్ లో 191 పరుగులు చేశారు. ఇక స్ట్రైక్ రేట్ ఇద్దరిదీ కూడా 159.16 ఉంది ఇలా అన్నీ కూడా ఒకేలా ఉన్నాయి అని చెప్పాలి ఇక ఇది నిజంగా యాదృచ్ఛిక అంటూ అభిమానులు అందరూ కూడా సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు.

# రోహిత్ శర్మ భావోద్వేగం



టి20 ప్రపంచ కప్‌లో టీమిండియా ఫైనల్‌కు చేరింది. రెండేళ్ల క్రితం సెమీస్‌లోనే భారత్‌ను ఇంగ్లాండ్ చిత్తు చేసి విజేతగా నిలిచింది. ఇప్పుడు డిఫెండింగ్ ఛాంపియన్‌పై ఘన విజయాన్ని రోహిత్ సేన సాధించింది. ఇక తుది పోరులో దక్షిణాఫ్రికాతో తలపడనుంది. రెండో సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్ జట్టును చిత్తు చేసిన తర్వాత కెప్టెన్ రోహిత్ శర్మ భావోద్వేగానికి గురయ్యారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అప్పుడే డగౌట్‌కు వస్తున్న స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రోహిత్‌ను సముదాయించారు. 'కమాన్ మ్యాన్ చీర్స్' అని హిట్‌మ్యాన్‌తో అన్నట్లుగా వీడియోలో తెలుస్తోంది. పదేళ్ల తర్వాత ఐసీసీ టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌కు టీమిండియా చేరుకోవడం గమనార్హం. 2007లో ధోనీ నాయకత్వంలో టైటిల్ విజేతగా నిలిచిన భారత్‌కు ఇప్పుడు మరో అవకాశం వచ్చింది. దీనిని అందిపుచ్చుకోవాలని క్రికెట్ ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. గతేడాది వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్ ఓటమిని చవిచూశాక ఆ రాత్రి నిద్ర పట్టలేదని గతంలో రోహిత్ తన ఆవేదనను పంచుకున్న సంగతి విదితమే. ఇప్పుడు కూడా సెమీస్‌కు ముందు అలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నాడని అభిమానులు అంటున్నారు. 2022వ సంవత్సరంలో భారత్ పై 10 వికెట్ల తేడాతో గెలిచిన ఇంగ్లాండ్‌ను అడ్డుకోవడం చాలా కష్టం. మరీ ముఖ్యంగా సూపర్-8 నుంచి ఇంగ్లాండ్ దూకుడుగా ఆడుతూ సవాలుగా మారింది. ఆ జట్టులో బట్లర్, బెయిర్‌స్టో తిరుగులేని బ్యాటింగ్ చేస్తున్నాడు. అలాంటి వారిపై ఆధిపత్యం ప్రదర్శించడం అభినందనీయమని మాజీలు భారత జట్టుపై ప్రశంసలు కురిపించారు. భారత బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా రాణించి ఇంగ్లాండ్ టీమ్‌ను చిత్తుగా ఓడించి ఇంటికి పంపారు.

# భారత్ ఫైనల్‌కి చేరడంపై పాకిస్తాన్ అక్కసు..



టీ 20 ప్రపంచకప్ -2024లో టీమిండియా సత్తా చాటుతోంది. ఇప్పటి వరకు టోర్నీలో ఒక్క మ్యాచ్ ఓడిపోకుండా అజేయంగా ఫైనల్‌కి చేరింది. ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచుల్లో ఆ జట్టును చిత్తుచేసింది.భారత స్పిన్నర్లకు ఇంగ్లీస్ బ్యాటర్లు దాసోహమయ్యారు. కఠినంగా ఉన్న గయనా పిచ్‌పై భారత్ 171/7 స్కోర్ చేసింది. 172 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ 103 రన్స్‌కే ఆల్ అవుట్ అయింది. దీంతో రేపు జరగబోయే ఫైనల్ మ్యాచులో దక్షిణాఫ్రికాతో టీమిండియా తలపడబోతోంది. ఇదిలా ఉంటే, భారత జట్టు ప్రదర్శనపై పాకిస్తాన్ తన అక్కసును వెళ్లగక్కుతూనే ఉంది. ఈ టోర్నీలో అత్యంత అవమానకరమైన రీతిలో పాక్ లీగ్ దశలోనే నిష్క్రమించింది. చివరకు పసికూన అమెరికా చేతిలో ఓడిపోయింది. భారత్‌తో జరిగి మ్యాచులో కూడా మన బౌలర్ల ధాటికి నిలబడలేక తక్కువ స్కోర్‌ని ఛేజ్ చేయలేకపోయారు. అయితే, ఆ దేశ మాజీ క్రికెటర్లు మాత్రం భారత ఆటగాళ్ల ప్రదర్శనను మెచ్చుకోవడం వదిలిపెట్టి కోడిగుడ్డుపై ఈకలు పీకే పనిలో ఉన్నారు. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో టీమ్ ఇండియా బాల్ టాంపరింగ్‌కి పాల్పడుతుందనే పాక్ మాజీ ఆటగాడు ఇంజమామ్ ఉల్ హక్ అనుమానాన్ని వ్యక్తం చేశారు. తాజాగా సెమీస్‌లో ఇంగ్లాండ్ పై గెలవడంతో మరోసారి నోరుపారేసుకున్నాడు. ప్రపంచ కప్ షెడ్యూల్‌ను విమర్శించాడు, టోర్నమెంట్ ప్రారంభానికి ముందు భారతదేశం సెమీ-ఫైనల్ వేదికను ముందే నిర్ణయించింది. ఇది అన్యాయమని ఇంజమామ్ పేర్కొన్నాడు. పాకిస్తాన్ ఎప్పుడూ కూడా అలాంటి ప్రయోజనాలను పొందలేదని చెప్పాడు భారత్ సెమీఫైనల్‌కు రిజర్వ్ డే లేకపోవడం కూడా భారత్‌కు అనుకూలంగా ఉండాలని ముందే నిర్ణయించుకున్నట్లు ఇంజమామ్ ఆరోపించారు. పాకిస్తాన్ ఛానెల్‌తో మాట్లాడుతూ.. రెండు సెమీఫైనల్స్ మ్యాచుల్లో భారత్-ఇంగ్లాండ్ గేమ్‌కి మాత్రమే రిజర్వ్ డే లేదు, ఒక వేళ ఆటను రద్దు చేస్తే భారత్ ఫైనల్‌కి వెళ్తుంది. భారత్‌కి ఒక్కో మ్యాచ్‌కి వేర్వేరు నిబంధనలు ఉ న్నాయని అన్నారు. ప్రస్తుతం ఇంగ్లండ్ కూడా ఏమీ చేయలేనంత శక్తిలో భారత్ ఉందని, క్రికెట్‌ని ఒక శక్తి మాత్రమే నడుపుతోందని అన్నారు. బీసీసీఐకి ఉన్న ధనశక్తి కారణమని అన్నారు.

# మరో అడుగు దూరంలో టీమిండియా?



వరల్డ్ క్రికెట్లో అగ్రశ్రేణి టీమ్స్ లో ఒకటిగా కొనసాగుతున్న టీమిండియా.. గత కొన్ని నెలల నుంచి ఐసీసీ టోర్నిలలో సత్తా చాటుతున్నప్పటికీ.. టైటిల్ పోరులో మాత్రం వెనకబడిపోతూనే ఉంది ఎందుకంటే ఇక అద్భుతంగా రాణిస్తూ టైటిల్ కు ఎంతో చేరువగా వెళుతున్న టీమిండియా.. చివరి అడుగులో మాత్రం తడబడుతూ అభిమానులు అందరికీ కూడా నిరాశ మిగులుస్తుంది. దీంతో అప్పుడెప్పుడో 2011లో ధోని కెప్టెన్సీ లో గెలిచిన వరల్డ్ కప్ తప్ప ఇప్పటివరకు టీం ఇండియా ఒక్క ప్రపంచ కప్ టోర్నీ కూడా గెలవలేదు. అయితే ప్రస్తుతం వెస్టిండీస్ యుఎస్ వేదికగా జరుగుతున్న టి20 ప్రపంచ కప్ టోర్నీలో మాత్రం తప్పకుండా విజయం సాధించి సత్తా చాటాలని అనుకుంటుంది భారత జట్టు. ఈ క్రమంలోనే ఎట్టి పరిస్థితుల్లో టైటిల్ ను ముద్దాడాలి అనే పట్టుదలతో బరిలోకి దిగిన టీమిండియా అదే రీతిలో రాణిస్తుంది. ఏకంగా అంచనాలకు మించి ప్రదర్శన చేస్తూ అదరగొడుతుంది. ప్రత్యర్థులు అందరిని కూడా ఓడిస్తూ జైత్రయాత్ర కొనసాగిస్తుంది. గత ఏడాది జరిగినా వన్డే ప్రపంచ కప్ లో లాగానే ఈ ఏడాది జరుగుతున్న టి20 ప్రపంచ కప్ లో కూడా ఒక్క ఓటమి లేకుండా టీమిండియా ఫైనల్ వరకు దూసుకు వెళ్ళింది అని చెప్పాలి. ఇటీవల సెమీఫైనల్ లో ఇంగ్లాండ్ లాంటి పటిష్టమైన జట్టుతో జరిగిన మ్యాచ్లో కూడా ఘనవిజయాన్ని అందుకుని ఫైనల్లో అడుగు పెట్టింది. అయితే గత ఏడాది టోర్ని లలో రెండుసార్లు ఫైనల్స్ లో టీమిండియాని ఓడించిన ఆస్ట్రేలియాపై సూపర్ 8 లో ప్రతి కారం తీర్చుకొని.. ఆ జట్టును ఇంటికి పంపించడంలో సక్సెస్ అయింది. ఇటీవల సెమీఫైనల్ లో ఇక గతంలో ఓ సెమి ఫైనల్లో టీమ్ ఇండియాని ఓడించిన ఇంగ్లాండ్ జట్టుపై ప్రతీకారం తీర్చుకుంది. దాదాపు 10 ఏళ్ల తర్వాత టీమిండియా ఫైనల్ లో అడుగు పెట్టింది. ఇలా వరల్డ్ కప్ టైటిల్ గెలవడానికి ఒక్క అడుగు దూరంలో ఉంది. ఫైనల్ లో గెలిచి చరిత్ర సృష్టించాలని భావిస్తోంది టీమిండియా.

# అదరగొట్టేస్తున్న కెప్టెన్, వైస్ కెప్టెన్?



సాధారణంగా జట్టుకు కెప్టెన్ గా ఉన్న వ్యక్తి ఎప్పుడు జట్టు విజయం కోసం పాటుపడుతూ ఉండాలి. ఇక అతనికి డిప్యూటీగా ఉన్న మరో ఆటగాడు ఇక కెప్టెన్ సలహాలు తీసుకోవడంలో ఎప్పుడు తోడ్పాటును అందిస్తూ ఉండాలి. అయితే ఇక జట్టు ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఇద్దరు టీమ్ ను విజయతీరాలకు నడిపించాలి. అయితే ఇక ఇప్పుడు ఇలా కెప్టెన్ వైస్ కెప్టెన్ అనే పదాలకు సరైన అర్థం చెబుతున్నారు రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యాలు. ప్రస్తుతం వెస్టిండీస్, యూఎస్ వేదికలుగా జరుగుతున్న టి20 వరల్డ్ కప్ టోర్నీ చివరి అంకానికి చేరుకుంది. ఈ క్రమంలోనే ఫైనల్ మ్యాచ్ తో ఇక ఈ వరల్డ్ కప్ ఎడిషన్ లో టైటిల్ విజేత ఎవరు అన్న విషయం తేలబోతుంది. కాగా ఇక ఈ వరల్డ్ కప్ టోర్నీలో అటు భారత జట్టు ఎంత అద్భుతమైన ప్రస్తానాన్ని కొనసాగిస్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అద్భుతంగా రాణిస్తూ అదరగొడుతుంది టీమ్ ఇండియా. ఒక్క ఓటమి కూడా లేకుండా ఫైనల్ వరకు దూసుకు వెళ్ళింది. ఇటీవల సెమీఫైనల్ లో అటు ఇంగ్లాండ్ ను ఓడించి ఫైనల్ లో అడుగుపెట్టింది అని చెప్పాలి. అయితే జట్టులోని పలువురు కీలక ఆటగాళ్లు విఫలమవుతున్న టీమ్ ఇండియా మాత్రం వరుస విజయాలు సాధిస్తుంది. అయితే భారత జట్టు ఇలా వరుస విజయాలు సాధించడంలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాలు కీలక పాత్ర వహిస్తున్నారు. టోర్నీ ఆరంభం నుంచి ఆసాంతం ఇద్దరు కూడా జట్టును ముందుండి నడిపించారు. రోహిత్ శర్మ ఇప్పటివరకు ఏడు మ్యాచ్లు ఆడి 248 పరుగులు చేశాడు. టీమిండియా తరఫున అత్యధిక పరుగుల వీరుడుగా కొనసాగుతున్నాడు. మరోవైపు మిడిల్ ఆర్డర్లో బరిలోకి దిగే హార్దిక్ పాండ్యా 139 పరుగులతో పాటు 8 వికెట్లు తీసి జట్టు విజయాలలో కీలక పాత్ర వహిస్తున్నాడు. ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతున్నాడు.

# జార్జియా సంచలనం

యూరో కప్‌లో పోర్చుగల్‌కు చెక్ బెర్లిన్(జర్మనీ): యూరోపియన్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్(యూరో)లో పెను సంచలనం నమోదైంది. ఈ మెగా టోర్నీలో పోర్చుగల్ జట్టుకు జార్జియా షాక్ ఇచ్చింది. గురువారం ఉత్కంఠ రేపిన గ్రూప్ దశ మ్యాచ్‌లో 74వ ర్యాంకర్ జార్జియా 2-0 గోల్స్ తేడాతో 6వ ర్యాంక్ పోర్చుగల్‌ను చిత్తుచేసింది. రొనాల్డో ఈ మ్యాచ్‌లో ఒక్క గోల్ కూడా కొట్టకపోవడం గమనార్హం. పోర్చుగల్‌పై అనూహ్య విజయానికి రొనాల్డో సలహానే కారణమని జార్జియా ఆటగాడు కివిచ క్వరత్సెలియ తెలిపాడు. 'మ్యాచ్ ఆరంభానికి ముందు మేము రొనాల్డోతో మాట్లాడాం. మేము విజయవంతం కావాలని ఆయన మాకు ఆల్ ది బెస్ట్ చెప్పాడు. దాంతో మేము అద్భుతం చేయగలమని నమ్మాం' అని కివిచ వెల్లడించాడు. ఆట ప్రారంభమైన రెండో నిమిషంలోనే కివిచ గోల్ కొట్టడంతో జార్జియా 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత 27వ నిమిషంలో రొనాల్డోకు రిఫరీ ఎల్లో కార్డు చూపించాడు. రెండో అర్ధభాగం 57వ ని.లో పెనాల్టీని జార్జియా స్ట్రయికర్ జార్జెస్ గోల్ కొట్టాడు. దీంతో ఆ జట్టు 2-0తో మ్యాచ్‌ను గెలిపించాడు. ఈ గెలుపుతో జార్జియా జట్టు గ్రూప్-ఎఫ్ నుంచి మూడోస్థానంలో ప్రి క్వార్టర్స్‌కు చేరింది. జులై 1న జరిగే ప్రి క్వార్టర్స్‌లో జార్జియా జట్టు స్పెయిన్‌తో తలపడనుంది.

# ఓటీటీలోకి కాజల్ 'సత్యభామ'..!

బ్యూటిఫుల్ అండ్ టాలెంటెడ్ నటిమని కాజల్ అగర్వాల్ తాజాగా సత్యభామ అనే లేడీ ఓరియంటెడ్ మూవీ లో ప్రధాన పాత్రలో నటించిన విషయం మన అందరికీ తెలిసిందే . ఈ సినిమాలో కాజల్ పవర్ ఫుల్ లేడీ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించింది. ఈ సినిమాకు సుమన్ చిక్కాల దర్శకత్వం వహించ గా ... శ్రీ చరణ్ పాకాల ఈ మూవీ కి సంగీతం అందించగా , శశి కిరణ్తిక్క, బాబి తిక్క ఈ మూవీ లను నిర్మించారు.ఇకపోతే కొన్ని రోజుల క్రితమే మంచి అంచనాల నడుమ థియేటర్ లలో విడుదల అయిన ఈ సినిమా ప్రేక్షకుల నుండి పర్వాలేదు అనే స్థాయి రెస్పాన్స్ ను తెచ్చుకుంది. దానితో ఈ మూవీ డీసెంట్ విజయాన్ని బాక్స్ ఆఫీస్ దగ్గర సొంతం చేసుకుంది. ఇలా థియేటర్ లలో ప్రేక్షకులను పర్వాలేదు అనే స్థాయిలో అలరించిన ఈ సినిమా తాజాగా ఓ టీ టీ ప్లాట్ ఫామ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా యొక్క డిజిటల్ హక్కులను ప్రముఖ ఓ టీ టీ సంస్థలలో ఒకటి అయినటువంటి అమెజాన్ ప్రైమ్ వీడియో సంస్థ దక్కించుకుంది. అందులో భాగంగా ఈ సినిమాను ఈ రోజు నుండి ఈ సంస్థ వారు తమ ఓ టీ టీ ప్లాట్ ఫామ్ లో స్ట్రీమింగ్ చేస్తున్నారు. మరి ఈ మూవీ కి ఓ టీ టీ ప్లాట్ ఫామ్ లో ప్రేక్షకుల నుండి ఏ స్థాయి రెస్పాన్స్ లభిస్తుందో చూడాలి. ఎవరైనా ఈ సినిమాను థియేటర్ లలో చూద్దాం అని మిస్ అయిన వారు ఉంటే ప్రస్తుతం ఈ మూవీఅమెజాన్ ప్రైమ్ వీడియో ఓ టి టి ప్లాట్ ఫామ్ లో స్ట్రీమింగ్ అవుతుంది చూసి ఎంజాయ్ చేయండి.







## ప్రభాస్ హీరోనా విలనా?

కొన్ని రోజుల నుంచి ఇండియన్ సోషల్ మీడియాను 'కల్కి 2898 ఏడీ' ఫీవర్ చుట్టేసింది. ఇక నిన్న అర్ధరాత్రి నుంచి అయితే వేరే ఏ టాపిక్ కనిపించడం లేదు సోషల్ మీడియాలో.'బాహుబలి' తర్వాత ఈ స్థాయిలో హైప్ తెచ్చుకుని, ఇంతగా చర్చనీయాంశం అయిన సినిమా మరొకటి లేదు అంటే అతిశయోక్తి కాదు. ఎటు చూసినా కల్కి సినిమా చర్చలే కనిపిస్తున్నాయి సోషల్ మీడియా అంతటా. 'బాహుబలి' తర్వాత బాక్సాఫీస్ రిజల్ట్ పరంగా 'సలార్' మాత్రమే ప్రభాస్ ఫ్యాన్స్‌కు ఆనందాన్నివ్వగా.. ఇప్పుడు 'కల్కి' సైతం వారికి సంతృప్తినిచ్చేలాగే కనిపిస్తోంది. భారీ ఓపెనింగ్స్‌తో మొదలైన ఈ చిత్రం.. వీకెండ్ అంతా వసూళ్ల మోత మోగించేలాగే ఉంది. కొంచెం మిక్స్ టాక్ ఉన్నప్పటికీ.. తర్వాత కూడా సినిమా బలంగానే నిలబడుతుంది అనిపిస్తోంది.సినిమా ఎలా ఉందనే విషయంలో కొంత డిజప్పాయింట్ కనిపిస్తున్నప్పటికీ ఓవరాల్‌గా ఇది మస్ట్ వాచ్ మూవీ అనే చాలామంది అంటున్నారు. సినిమాలో పాత్రల విషయానికి వస్తే.. ప్రభాస్ అసలు హీరోనా విలనా అనే అభిప్రాయాన్ని అభిమానులు వ్యక్తం చేస్తుండడం గమనార్హం. తన పాత్ర నెగెటివ్ షేడ్స్‌తో సాగుతుందని.. సరదాగా ఉంటుందని ప్రభాస్ ముందే చెప్పేశాడు. సినిమా చూస్తే కొంచెం నెగెటివ్ షేడ్స్ ఉండడం కాదు, మొత్తం నెగెటివ్‌గానే కనిపించింది. 'కల్కి' కథను సగంలో ఆపగా.. ఈ సగంలో అమితాబ్ బచ్చన్ పాత్రే హీరోలా కనిపించింది. ఆయన మంచి వైపు నిలబడి కల్కి రక్షణ కోసం పోరాడితే.. ప్రభాస్ సినిమా అంతా చెడు వైపు నిలబడి అమితాబ్ ప్రయత్నానికి అడ్డు తగులుతూ ఉంటాడు. హీరో ముందు చెడ్డవాడిగా ఉండి ఏదో ఒక దశలో పరివర్తన చెంది అంతిమంగా మంచి కోసం పోరాడే సినిమాలు చాలా చూశాం. ఐతే 'కల్కి' కథ మధ్యలో ఉండగా ఇప్పటి వరకు అయితే ప్రభాస్‌లో అలాంటి పరివర్తన ఏదీ కనిపించదు. సినిమా చివర్లో అతడిని వేరే అవతారం పూని కొన్ని నిమిషాలు దుష్ట సంహారం చేస్తాడు. కానీ ఒరిజినల్‌గా ఆ పాత్రలో ఇంకా మార్పు రానట్లే. సెకండ్ పార్ట్‌లో పాత్ర పరివర్తన చెంది హీరోగా రూపాంతరం చెందడం చూస్తాం అనుకోవచ్చు.

# రాజమౌళిని భలే వాడారే..

'కల్కి' సినిమాలో బోలెడన్ని అతిథి పాత్రలు ఉన్నాయని.. సినిమా అంతా సర్ప్రైజ్‌లతో నడుస్తుందని ముందే హింట్స్ వచ్చాయి. క్యామియోస్ గురించి మీడియాలో జరిగిన ప్రచారమంతా నిజమే అని ఈ సినిమా చూశాక అర్థమైంది.పదిమందికి తక్కువ కాకుండా ఇందులో ప్రముఖ నటీనటులు అతిథి పాత్రలు చేయడం విశేషం. ఐతే దర్శకుడు నాగ్ అశ్విన్.. ఆ అతిథి నటులను అనుకున్నంత బాగా ఉపయోగించుకోలేకపోయాడనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.చాలామంది పాత్రలు మొక్కుబడిగా అనిపించాయి. ఐతే దర్శకుడు రాజమౌళి కనిపించింది చాలా తక్కువ టైమే అయినా.. ఆయనకు సూటయ్యే గమ్మత్తైన పాత్రను ఇచ్చి.. తన సీక్వెన్స్ స్క్రీన్ మీద బాగా పేలేలా చూసుకున్నాడు నాగ్ అశ్విన్. ప్రభాస్-రాజమౌళి మధ్య నిజ జీవిత బంధాన్ని చాటేలా ఈ క్యామియో ఎపిసోడ్ ఉండడం విశేషం. ఇందులో ప్రభాస్ చేసిన భైరవ పాత్రకు మాజీ యజమాని, టెక్నికల్ గురువుగా కనిపించాడు రాజమౌళి. భైరవ తన వెహికల్ (బుజ్జి)లో ఒక టాస్క్ మీద వెళ్తుండగా.. రాజమౌళి పక్కనే మరో వెహికల్లో వచ్చి తన వెంట రమ్మంటాడు. దీనికి భైరవ స్పందిస్తూ.. ఈయనతో వెళ్తే ఇంకో ఐదేళ్లు తినేస్తాడు అని భయపడతాడు. రాజమౌళితో చేసిన 'బాహుబలి' కోసం ప్రభాస్ ఐదేళ్లు వెచ్చించిన సంగతి తెలిసిందే. ఆ సంగతి గుర్తు చేసేలా ప్రభాస్ డైలాగ్ చెప్పడంతో థియేటర్లలో విజిల్స్ పడుతున్నాయి. ఇక తన నుంచి ఎస్కేప్ అవుతున్న ప్రభాస్‌ను చూసి.. ఈసారి దొరికితే పదేళ్లు వదలనంటూ రాజమౌళి చెప్పే ఫినిషింగ్ డైలాగ్ మరింత హైలైట్ అయింది. సినిమాలో చిన్న క్యామియోలో రామ్ గోపాల్ వర్మ కూడా కనిపించాడు కానీ.. అందులో ఏ ప్రత్యేకతా కనిపించలేదు. కేవలం వర్మ కనిపించాడని ప్రేక్షకులు అరుస్తారు తప్ప.. ఆయన పాత్రలో, డైలాగుల్లో ఏ విశేషం లేకపోయింది.




# రిలీజ్‌కి కౌంట్‌డౌన్ షురూ..



రామ్ పోతినేని, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబోలో వచ్చిన బ్లాక్ బస్టర్ 'ఇస్మార్ట్ శంకర్' మూవీకి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' తో తిరిగి వస్తున్నారు సంజయ్ దత్ విలన్‌గా చేరడం వలన స్టార్ పవర్ లేయర్‌ని యాడ్ చేస్తూ ఈ ప్రాజెక్ట్ ఇండియన్ సినిమాస్‌లో మోస్ట్ ఎవైటెడ్ మూవీస్‌లో ఒకటిగా నిలిచింది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఆగష్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విడుదల చేయనున్నట్లు అనౌన్స్ చేశారు. ఇది సినిమా విడుదలకు పెర్ఫెక్ట్ టైం. ఈ నేపథ్యంలో 50 రోజుల కౌంట్‌డౌన్‌ను మార్కింగ్ చేస్తూ మేకర్స్ రామ్ పోతినేని స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. టైటిల్ సాంగ్ చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇది ప్రేక్షకులకు విజువల్ ట్రీట్ ఇచ్చేలా చూసేందుకు టీమ్ కేర్ తీసుకుంటోంది. పక్కా చార్ట్‌బస్టర్ అయ్యే ఈ పాటలో రామ్ పోతినేని సిగేచర్ ఎనర్జిటిక్ స్టైల్‌లో ఎలక్ట్రిఫైయింగ్ డ్యాన్స్ మూవ్‌లు, విజువల్స్ అద్భుతంగా ఉండబోతున్నాయి. మణిశర్మ కంపోజ్ చేసిన ఈ ఎనర్జిటిక్ మాస్ సాంగ్‌కు జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. రామ్‌కు జోడిగా కావ్య థాపర్ నటిస్తోంది. పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్ట్ 15న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

# సూర్య కంగువతో దసరా పోటీ

సౌత్ ఇండియాలో అత్యంత భారీ బడ్జెట్ తో రూపొందుతున్న సినిమాల్లో సూర్య కంగువ ఒకటి. సిరుత్తై శివ దర్శకత్వంలో సుమారు రెండు వందల కోట్లకు పైగా బడ్జెట్ పెట్టినట్టు ఇప్పటికే టాక్ ఉంది.విడుదల తేదీ విషయంలో మల్లగుల్లాలు పడుతున్న సూర్య బృందం ఎట్టకేలకు దానికి చెక్ పెట్టేసింది. అక్టోబర్ 10 ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ చేయబోతున్నట్టు అఫీషియల్ గా ప్రకటించింది. గతంలో జూనియర్ ఎన్టీఆర్ దేవర పార్ట్ 1 కోసం ఫిక్స్ చేసుకున్న స్లాట్ ఇది. పవన్ కళ్యాణ్ ఓజి వాయిదా పడటంతో వ్యూహం మార్చి సెప్టెంబర్ 27కి షిఫ్ట్ అయిన సంగతి తెలిసిందే. ఇక్కడితో కథ అయిపోలేదు. అక్టోబర్ 10న సూపర్ స్టార్ రజనీకాంత్ వెట్టయాన్ వచ్చేలా ఉంది. డేట్ చెప్పలేదు కానీ అక్టోబర్ నెలలో ఉంటుందని మేకర్స్ గతంలోనే అనౌన్స్ చేశారు. దుల్కర్ సల్మాన్ లక్కీ భాస్కర్ దాని మీదే గురి పెట్టింది. మిస్టర్ బచ్చన్ ని ఆగస్ట్ బదులు దసరాకు వదులుదామని రవితేజ కోరుకున్నట్టు ఇప్పటికే టాక్ ఉంది. నిర్మాత మాత్రం పుష్ప 2 వదులుకున్న ఆగస్ట్ 15 వైపు చూస్తున్నారు. కానీ ఇప్పటికే మూడు సినిమాలు అక్కడ అఫీషియల్ గా కర్చీఫ్ వేసేశాయి. ఇవన్నీ ముందుగానే ఊహించిన కంగువ టీమ్ చాలా తెలివిగా పోటీ కోణంలో ఆలోచించి వ్యూహం పన్నింది. నిర్మాణ భాగస్వామ్యంలో యువి ఉండటంతో తెలుగు వెర్షన్ సైతం భారీ రిలీజ్ దక్కించుకోనుంది. దిశా పటాని హీరోయిన్ గా బాబీ డియోల్ విలన్ గా నటించిన కంగువ టైం ట్రావెల్ కాన్సెప్ట్ ఆధారంగా సూర్య డ్యూయల్ రోల్ లో రూపొందింది. కథకు సంబంధించిన ఎక్కువ లీక్స్ లేవు కానీ విజువల్ గా చాలా గొప్పగా ఉంటుందని ఇన్ సైడ్ టాక్. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూరుస్తున్న కంగువ మీద అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. ఇతర భాషల్లో తగ్గిపోయిన తన మార్కెట్ కోసం సూర్య కసిమీదున్నాడు. రెండేళ్లుగా దీని కోసమే కష్టపడుతూ ఇతర కమిట్ మెంట్లు పెండింగ్ లో పెట్టేశాడు.



Edited, Printed, Published and Owned by Puram Maheshwar, Printed at Hari Hara Art Printers, H.No.6-1,85, Toopran, Medak (Dist) Telanagana 502336. Published at H.No. 4-50/18, Kallakal (Vill), Kallakal (Po), Manoharabad (M), Medak (Dist), Telangana 502336. Editor Puram Maheshwar. RNI No. TELTEL/2006/17154

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
శనివారం 29 జూన్ 2024
రంగారెడ్డి
వికారాబాద్-మేడ్చల్
www.prajaswaramdaily.com


# అభివృద్ధి పనులపై ప్రతివారం నిర్వహించే సమీక్షలో పురోగతి ఉండాలి





**ప్రతి ఇంటికి మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటించేందుకు పెండింగ్ పనులకు ప్రతిపాదనలు రూపొందించాలి**

**ఇప్పటికే మంజూరైన నిధులతో పనులను ప్రారంభించాలి**

**'కడ' అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సమీక్ష సమావేశం**

**వికారాబాద్, జూన్ 28 (ప్రజాస్వరం) :**

అభివృద్ధి పనులపై ప్రతి వారం నిర్వహించే సమీక్ష లో పురోగతి ఉండాలి అని వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం (కడ) క్రింద ఇప్పటికే మంజూరైన నిధులతో పనులను వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం కొడంగల్ కడ కార్యాలయం లో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులపై నారాయణపేట్ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో కలిసి నారాయణపేట్, వికారాబాద్ జిల్లాల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు తమ శాఖలకు నిర్దేశించిన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలన్నారు. మంజూరు అయిన పనులకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి పనులకు ప్రారంభించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రోడ్ల విస్తరణ, రోడ్ల బలోపేతంకు సంబంధించి పంచాయతి రాజ్, ఆర్ అండ్ బి శాఖల ఇంజనీయర్లు ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. వివిధ కాలేజీల నిర్మాణం నిమిత్తం భూసేకరణ చేపట్టాలని, భూసేకరణ విషయంలో ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. కొడంగల్ లో ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల నిర్మాణాల నమూనాలు, వైద్యుల నియామకానికి ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. మిషన్ భగీరథ కింద ప్రతి ఇంటికి మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నీటి ట్యాంకుల నిర్మాణాలకు, పైపులైన్ల పనుల నిమిత్తం అవసరమైన నిధుల నిమిత్తం ప్రతిపాదన పంపాలని కలెక్టర్ తెలిపారు. కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమం (కడ) కింద నియోజకవర్గంలో మంజూరైన చెక్ డ్యాంల నిర్మాణ పనులపై , అటవీ శాఖ భూముల్లో జరుగుతున్న పనులపై కలెక్టర్ సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్ల లో ఎక్కడ కుడా గుంతలు ఉండరాదని, ప్యాచ్ వర్క్ పనులు చేపట్టాలని, ప్రతి వారం నిర్వహించే సమీక్ష లో పురోగతి ఉండాలని, కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించిన గురుకుల పాఠశాలలు స్థానికంగా ఉండేలా అదేవిధంగా వసతి గృహాల నిర్మాణాలకై స్థల సేకరణ చేపట్టి వివిధ సంక్షేమ శాఖలకు కేటాయించాలని సూచించారు. అనంతరం కొడంగల్ నియోజకవర్గం కమ్యూనిటీఆరోగ్యా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి లోని ప్రతి వార్డ ను పరిశీలించి అక్కడి పరిస్థితులను రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఎంత మంది డాక్టర్ లు, అంబులెన్సు లు ఎన్ని పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి కి వచ్చే పెషేంట్లకు మెరుగైన సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి,వివిధ శాఖల అధికారులు, డిసిఎచ్ఎస్ ప్రదీప్, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖకు మంచి పేరు వచ్చే విధంగా కానిస్టేబుళ్ల పనిచేయాలి

**వికారాబాద్ శిక్షణ కేంద్రం పరిశీలించిన జిల్లా ఎస్పీ కే.నారాయణ రెడ్డి**

**వికారాబాద్, జూన్ 28 (ప్రజాస్వరం) :**





శిక్షణ కాలం ముగిసిన తర్వాత తెలంగాణ పోలీస్ శాఖ కు మంచి పేరు వచ్చే విధంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ కే . నారాయణ రెడ్డి సూచించారు. జిల్లా ఎస్పీ కే నారాయణ రెడ్డి వికారాబాద్‌లోని శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న శిక్షణ పోలీస్ కానిస్టేబుల్లతో శుక్రవారం ఇంట్రాక్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వికారాబాద్ డీటీసీ లో చాలా ఆహ్లాదకరమైన వాతావరణం ఉంది, వికారాబాద్ లో శిక్షణ పొందటం చాలా అదృష్టం, శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులలో చాలా వరకు డిగ్రీ లు పీజీ లు పూర్తి చేసిన వారు ఉన్నారు అని అన్నారు. అభ్యర్థులు ప్రతి రోజు ఎదో ఒక మంచి విషయం నేర్చుకోవాలని, ఎవ్వరు కూడా చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, శిక్షణ కాలం లో చేస్తున్నటువంటి యోగ, మెడిటేషన్, వ్యాయామం లను శిక్షణ అనంతరం కూడా కొనసాగిస్తూ ఆరోగ్యాలను కాపాడుకోవాలని, జులై 1 నుండి మారుతున్న చట్టాల పైన, సైబర్ నేరాలు, ఫైనాన్సియల్ ఫ్రాడ్స్ పైన కూడా అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎస్పీ తెలిపారు. అనంతరం ఎస్పీ డీటీసీ లోని తరగతి గదులు, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, బ్యారక్ లు కిచన్ రూమ్ లు పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమం లో డీటీసీ ప్రిన్సిపాల్ పి .వి . మురళిధర్ , డీటీసీ డీఎస్పీ విజయ్ కుమార్, ఏ ఆర్ డీఎస్పీ వీరేష్ ,డీటీసీ ఇన్స్పెక్టర్ వెంకట్రాం , పీసీర్ ఇన్స్పెక్టర్ ప్రమీల , ఆర్ ఐ నాగరాజు, ఎస్ఐలు, ఆర్ ఎస్లు ఐ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

# గ్రామాల అభివృద్ధిలో అధికారులు నిర్లక్ష్యం వద్దు

**కోరం లేక పెద్దేముల్ మండల సర్వసభ సమావేశం వాయిదా**

**ఎంపీపీ అనురాధ రమేష్**

**వికారాబాద్, జూన్ 28 (ప్రజాస్వరం) :**



గ్రామ అభివృద్ధికి ప్రతి అధికారి తన వంతు సహకారం అందించాలని, ప్రజాభివృద్ధిలో అధికారులు నిర్లక్ష్యం చేయరాదని పెద్దేముల్ ఎంపీపీ అనురాధ రమేష్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అనురాధ రమేష్ మాట్లాడుతూ... ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ సమావేశానికి వివిధ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. సర్వసభ సమావేశానికి సమావేశం కొనసాగించేందుకు ఫోరం లేకపోవడంతో సభను వాయిదా వేసినట్లు ప్రకటించారు. వచ్చేనెల 2న, మంగళవారం ఉదయం 11 గంటలకు సర్వ సభ సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ధారాసింగ్, వైస్ ఎంపీపీ మధులత శ్రీనివాస్ చారి, ఎంపీడీవో జర్నప్ప, తహశీల్దార్ కిషన్, విద్యాధికారి వెంకటయ్య గౌడ్, సిడిపిఓ లక్ష్మి, ఎంపిటిసిలు శంకర్ నాయక్, ధన్ సింగ్, శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు నసిర్, వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల ప్రత్యేక అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**తాండూరు జిల్లా దవఖానా తనిఖీ చేసిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్**

**వికారాబాద్, జూన్ 28 (ప్రజాస్వరం) :**



ప్రభుత్వ దవాఖానాకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది చిత్త శుద్ధితో పని చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. వికారాబాద్ జిల్లా తాండూరులోని జిల్లా ప్రభుత్వ దవఖానాను కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. దవఖానాలోని రోగుల వార్డులను, ఫార్మసి, ఇతర సౌకర్యాలు జిల్లా దవఖానా కోఆర్డినేటర్ ప్రదీప్ రావు, సూపరింటెండెంట్ మూర్తిలతో కలిసి పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది ఎంత మంది ఉన్నారని ప్రశ్నించారు. ప్రతి రోజు రోగులు ఏఏ ప్రాంతాల నుండి,ఎంత మంది వరకు వస్తారు. ఇన్ పేషంట్స్, అవుట్ పేషంట్స్ ఎందరు నమోదవుతారు అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవుట్ పేషంట్ రోగులు రోజు 500 నుండి 600 వరకు, ఇన్ పేషంట్ రోగులు 100-120 వరకు నమోదవుతారని సూపరింటెండెంట్ మూర్తి కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. వారికి సరిపడా వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నారా అని ప్రశ్నించారు. ఫిమేల్ వార్డు లో ఒకే బెడ్ పై ఇద్దరు రోగులను ఉంచడం పట్ల కలెక్టర్ విస్మయం వ్యక్తం చేసారు. కొందరు వైద్య సిబ్బంది డ్యూటీ లో లేకపోవడం పట్ల కోఆర్డినేటర్ ప్రశ్నించారు. తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్ రావు, తాండూర్ తహసీల్దార్ తారాసింగ్, ఆర్ ఎం ఓ ఆనంద్ గోపాల్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

# ప్రజా పాలనలో దరఖాస్తుల్లో తప్పులుంటే 'సేవ కేంద్రాల్లో' సరి చేసుకోవాలి

**కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్, జూన్ 28 (ప్రజాస్వరం) :**



ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఏవైనా సవరణలు చేసు కోదలచిన వారు ప్రజా పాలన సేవ కేంద్రాల్లో సరి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక తెలిపారు. ప్రజా పాలన సేవ కేంద్రాలను మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయంలో, మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో వివిధ పథకాలకు ప్రజా పాలనలో అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, కొందరు అర్జీదారులు దరఖాస్తుల్లో తప్పులు దొర్లిన సందర్భంగా అర్హులైన వారు లబ్ధి పొందకుండా ఉన్నారని ఆయన తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఇలాంటి ఇబ్బంది కలగకుండా ప్రజా పాలన పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు వీలుగా తప్పులను సరి చేసేందుకు ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. గృహ జ్యోతి కింద విద్యుత్ బిల్లు, గ్యాస్ సిలిండర్ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పొందని పక్షంలో రేషన్ కార్డు, విద్యుత్ బిల్లు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు లు, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న రసీదు తో పాటు ప్రజాపాలన సేవా కేంద్రాల వద్దకు వెళ్లి తమ దరఖాస్తులో ఉన్న తప్పులను సరి చేసుకొని అర్హులైన అర్జీదారులు ప్రజా పాలన పథకాల ఫలితాలను పొందాలని ఆ ప్రకటనలో కలెక్టర్ తెలిపారు.

# ఈటల ఇల్లు ముట్టడి

**మేడ్చల్, జూన్ 28 (ప్రజాస్వరం) :**






కేంద్ర ప్రభుత్వ ద్వంద వైఖరి వల్ల నీట్ పరీక్ష రాసిన పేద విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ యాదవ్ అన్నారు. నీట్ పరీక్ష లీకేజీ చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యార్థి సంఘాల పిలుపుమేరకు మల్కాజ్గిరి పార్లమెంట్ ఎంపీ ఈటెల రాజేందర్ ఇంటినీ ఎన్ఎస్‌యు ఐఎస్ఎఫ్ఐ నాయకులు ముట్టడించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దాదాపు 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలను రోడ్డుపాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం స్పందించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన వారిని సిబిఐతో విచారణ చేయించి కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా గుడి నిర్మాణానికి విరాళం

**మేడ్చల్, జూన్ 28 (ప్రజాస్వరం) :**



పూడూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సాయిబాబా గుడి ఆలయానికి ఓం సాయి కన్స్ట్రక్షన్స్ అధినేత వెంకటరామిరెడ్డి రూ. 51వేలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్ రూపంలో నిర్మాణదారులకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో. హనుమంత రెడ్డి. శేషి కుమార్ , సాకేత్ రెడ్డి, చిన్న యాదవ్, తుపాకుల మల్లికార్జున్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ ఎమ్మార్వోపై అధికారులకు ఫిర్యాదు

**మేడ్చల్, జూన్ 28 (ప్రజాస్వరం) :**

మేడ్చల్ తహసీల్దార్ శైలజపై పై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు లంబాడా సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ధనరాజ్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రావల్ కోల్, సైదోని గడ్డ తండా రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 747,748 లో 3.33 గుంటల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని ఆ భూమిలో నిర్మాణాలు జరిగాయని ఆయన తెలిపారు. వీటి విలువ కోట్ల రూపాయల విలువ ఉంటుందని చెప్పారు.దీనిపై పలుమార్లు మేడ్చల్ తాసిల్దార్ కు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని అన్నారు. భూ కబ్జా దారులతో కుమ్మక్కై భూమిని కాపాడడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందుకు మేడ్చల్ తహశీల్దార్ ను సస్పెండ్ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

# ఉరి వేసుకొని ఒకరు...

**మేడ్చల్, జూన్ 28 (ప్రజాస్వరం) :**

ఇంట్లో ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మేడ్చల్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాఘవేంద్ర నగర్ కాలనీలో వీరేంద్ర చౌహన్(48) అనే వ్యక్తి శుక్ర వారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసు లు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్ తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

# 'రియల్' కబ్జా కోరల్లో బాటసింగారం క్రీడా ప్రాంగణం

**క్రీడా ప్రాంగణం హద్దు రాళ్లు తొలగించి రోడ్డు వేసుకున్న ఓ వెంచర్ నిర్వాహకులు**

**యథేశ్చగా క్రీడా ప్రాంగణం ఆక్రమణకు గురవుతున్నా చోద్యం చూస్తున్న అధికారుల తీరుపై అనుమానం..?**

**ఆక్రమణదారులకు పంచాయతీ అధికారుల అండ...?**

**అబ్దుల్లాపూర్మెట్, జూన్ 28 (ప్రజాస్వరం) :**

మండల పరిధిలోని బాటసింగారంలో గల క్రీడా ప్రాంగణం 'రియల్' కబ్జాకోరల్లోకి వెళ్లిపోయింది. దాని పక్కనే ఉన్న ఓ రియల్ ఎస్టేట్ యాజమాన్యం హద్దురాలను తొలగించి దారిని వేసుకుంటుంది. విషయం తెలిసిన అధికారులు మామూలుగా అలవాటు పడి వ్యవహరిస్తున్న తీరును పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ భూములు టార్గెట్గా రియాల్టర్లు తమ వ్యాపారాన్ని పెద్ద ఎత్తున నడిపిస్తున్నడంతో స్థానికంగా ఉన్న అధికారులు విషయం తెలిసిన కూడా పట్టించుకోకుండా ఉంటుండడంతో అధికారుల వ్యవహార శైలిపై పలు అనుమానాలకు తావిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. అబ్దుల్లాపూర్మెట్ మండలం బాటసింగారం గ్రామ సర్వేనెంబర్ 10లో గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసింది. దాని వెనకాల కొంతమంది రియాల్టర్లు వెంచర్లు వేసుకోగా సరైన దారి కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ప్రభుత్వ భూమిలోని క్రీడా ప్రాంగణంలో నుంచి దారులు వేస్తూ తమ వ్యాపారాన్ని గట్టిగా చేస్తున్నారు. వ్యవహారాలు తెలిసిన అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నాడంతో అధికారుల తీరుపై స్థానికులకు పలు అనుమానాలు తావిస్తున్నాయి. ఈ తంతు గత నెల రోజులు గా నడుస్తున్నప్పటికీ అవినీతికి పాల్పడుతున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో పాటు డబ్బులు పెద్ద ఎత్తున చేతులు మారుతున్నట్లు విశ్వాసం సమాచారం. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చట్టం బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# పరిగి నియోజకవర్గం నస్కల్ కస్తూరిభా పాఠశాలలో విద్యార్థినులకు అస్వస్థత

**వికటించిన ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు**

**26 మంది విద్యార్థినులకు ఆస్వస్థత**

**మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ ఆదేశం**



**వికారాబాద్, జూన్ 28 (ప్రజాస్వరం) :**

వికారాబాద్ జిల్లా పరిగి నియో జకవర్గం నస్కల్ కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠ శాలలో గురువారం రాత్రి పలు వురు ఆకస్మికంగా అస్వస్థతకు గురైనారు. రక్తహీనత నివా రణకు జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ ద్వారా 15 ఏళ్లలోపు విద్యార్థినులకు ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు గురువారం పంపిణీ చేయగా కొందరు విద్యార్థులు ఆస్వస్థతకు గురైనారు. 26 మంది విద్యా ర్థులను కస్తూరిభాగాంధీ గురుకుల పాఠశాల నిర్వాహకులు శుక్రవారం ఉదయం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స జరిపించారు. వైద్య సిబ్బంది విద్యార్థులు అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు చేశారు. నలుగు విద్యార్థులకు శ్వాస సంబంధ సమస్యలు రావడంతో ఆక్సిజన్ మాస్కులు పెట్టి చికిత్స అందించారు. వీరి లో ముగ్గురు పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉంది. జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ బాలికలకు చికిత్స అభినందించిన తీరు వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని .ఆదేశించారు. గురువారం సాయంత్రం విద్యార్థినులు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు వేసుకున్న తర్వాత శనగలు తినడంతో గ్యాస్ట్రో సమస్యలు వచ్చినట్లు చికిత్స చేసిన వైద్యులు తెలిపారు.

# కస్తూర్బా విద్యార్దినిలకు అస్వస్థత

**పరిగి, జూన్ 28 (ప్రజాస్వరం) :**

వికారాబాద్ జిల్లా పరిగి మండలం నస్కల్ గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలో విషాదం చోటుచేసుకుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతి అమ్మయికి వాళ్ల ఆరోగ్యం రిత్య ఐరన్ పోలిక్ యాసిడ్ క్యాప్సూల్ ఇవ్వలని పూనుకుంది. అందులో భాగంగా జిల్లా వ్యప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టల్లో ఐరన్ పోలిక్ యాసిడ్ క్యాప్సూల్ ఇచ్చారు. మధ్యాహ్నం ఇచ్చిన ఐరన్ పోలిక్ యాసిడ్ క్యాప్సూల్ వేసుకున్న విద్యార్థులలో 30 మంది విద్యార్థీనిలకు అస్వస్థతకు గురైయ్యారు. వాందరిని పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనం సహాయంతో తరలించారు.ట్రీట్మెంట్ అనంతరం కొంత మంది చికిత్స తర్వాత విద్యార్థీనిలు కోలుకుంటున్నారు.ముగ్గురు విద్యర్థినీలకు ఆక్సిజన్ తో చికిత్స అందిస్తున్న వైద్యులు.ఇది మెడిసిన్ వేసుకోవడంవల్లా లేదా ఫుడ్ ఫైజన్ వల్లా అనే పనిలో పడ్డారు వైద్యులు. మెడిసిన్ మధ్యాహ్నం వేసుకుంటే రాత్రి సమయంలో ఎందుకు అస్వస్థతకు గురవుతారు ఫుడ్ సరిగ్గా లేకే ఈవిధంగా జరిగిందంటున్నారు పిల్లలా తల్లిదండ్రులు. పిల్లలందరు ఆసుపత్రి పాలై ఇంత ఇబ్బందులు ఎదుర్కోంటుంన్నా కనీస సమాచారం ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

# కల్కి మానియా మాములుగా లేదుగా

**హైదరాబాద్, జూన్ 28 (ప్రజాస్వరం) :**

'కల్కి 2898 %ూాణ%'.. థియేటర్లలో విడుదల అని ప్రకటించినప్పటి నుండి ప్రభాస్ ఫ్యాన్స్‌లో హడావిడి మొదలుపెట్టారు. ముఖ్యంగా ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య 70%ఎఎ% థియేటర్‌లో ఏ స్టార్ హీరో సినిమా విడుదలయినా అది ఒక పండగలాగా ఉంటుంది. అలాగే 'కల్కి 2898 %ూాణ% షో పూర్తవ్వగానే థియేటర్లలోని ప్రేక్షకులంతా నిలబడి చప్పట్లు కొట్టారు. ఈ మూమెంట్‌ను కూడా ఫ్యాన్స్ వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. 'కల్కి 2898 %ూాణ%'ని చూసిన తర్వాత ప్రభాస్‌ను, దర్శకుడు నాగ్ అశ్విన్‌ను తెగ ప్రశంసించేస్తున్నారు. కచ్చితంగా ఇది టాలీవుడ్‌లో తెరకెక్కిన హాలీవుడ్ లెవెల్ మూవీ అంటూ పాజిటివ్ రివ్యూలు ఇచ్చేస్తున్నారు. ఉదయం 4 గంటల షో నుండి బయటికి రాగానే సోషల్ మీడియా అంతా ఒక్కసారిగా 'కల్కి 2898 %ూాణ%' పాజిటివ్ రివ్యూలతో నిండిపోయింది. దీంతో కలెక్షన్స్ కూడా ఒక రేంజ్‌లో ఉండబోతున్నాయని ఇండస్ట్రీ నిపుణులు అంచనా వేస్తున్నారు.కల్కి 2898 %ూాణ%'ని ఫస్ట్ డేనే చూడాలని చాలామంది ఫ్యాన్స్ ఫిక్స్ అయిపోయి ఉన్నారు. టికెట్ల కోసం పెద్ద యుద్ధమే చేశామంటూ వారి కష్టం గురించి చెప్పుకొచ్చారు. అలా అందరికంటే ముందే సినిమాను చూసినవారు.. అందరూ తప్పకుండా చూడాలంటూ రికమెండ్ చేయడం మొదలుపెట్టారు. కేవలం ఫస్ట్ డే మాత్రమే కాదు.. 'కల్కి 2898 %ూాణ%' సినిమా కోసం ఫస్ట్ వీకెండ్ మొత్తం టికెట్లు దొరకడం కష్టమని సోషల్ మీడియాలో కామెంట్స్ వినిపిస్తున్నాయి. ప్రభాస్ హార్డ్‌కోర్ ఫ్యాన్స్ అయితే మూవీని ఒకసారి కాకుండా రెండు, మూడుసార్లు చూడడానికి కూడా సిద్ధమయిపోతున్నారు.ముఖ్యంగా 'కల్కి 2898 %ూాణ%' విషయం నాగ్ అశ్విన్ డైరెక్షన్ చాలామందిని ఆశ్చర్యపరిచిందని ఆడియన్స్ అంటున్నారు. హాలీవుడ్ రేంజ్‌లో తెరకెక్కిస్తానని, ప్రభాస్‌ను కొత్తగా చూపిస్తానని నాగ్ అశ్విన్ ముందే ఫ్యాన్స్‌కు మాటిచ్చాడు. కానీ మరీ ఈ రేంజ్‌లో ఉంటుందని ఊహించలేదని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు ఫ్యాన్స్. ప్రభాస్ మాత్రమే కాదు.. దీపికా పదుకొనె, అమితాబ్ బచ్చన్ పాత్రలకు కూడా మంచి ఆదరణ లభిస్తోంది. ముఖ్యంగా కమల్ హాసన్ క్యారెక్టర్‌ను ప్రశంసించకుండా ఉండలేకపోతున్నారు ప్రేక్షకులు. మధ్యలో వచ్చే గెస్ట్ రోల్స్ అయితే ఆడియన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి.

# పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

**ఉపయోగంలో లేని వస్తువులను వారం రోజుల్లో తీసివేయాలి**

**ఎంపీడీవోలు, ఎంఈడీవోలతో కలెక్టర్ సమీక్ష**

**వికారాబాద్, జూన్ 28 (ప్రజాస్వరం) :**



పాఠశాలల్లో ఉపయోగంలో లేని వస్తువులను వారం రోజుల్లో తీసివేయలని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, మిషన్ భగీరథ ఇంటింటి సర్వేపై మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపిఓలు, ఎంఈఓలు, మున్సిపల్ కమిషనర్ లు, పంచాయతీ రాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పాఠశాలల్లో పేరుకుపోయిన పాత ఫర్నిచర్, పాడయిన వస్తువులు, పేరుకుపోయిన పుస్తకాలు, కాగితాలను వారం రోజుల్లో తొలగించి పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రహరి గోడలు లేని పాఠశాలలకు ఇనుప కంచేతో ప్రహరీ ఏర్పాటుకు అంచనాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టే పనుల్లో ఎలాంటి నాణ్యతలోపం ఉండకూడదని తెలిపారు. విద్యుత్ పనుల్లో భాగంగా తరగతులకు అనుగుణంగా ట్యూబ్ లైట్లు అమర్చాలని అధికారులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల మార్గదర్శకాలకు అనుగుణంగా సంబంధిత కంపెనీలకు సంబంధించిన ఫ్యానులను మాత్రమే అమర్చాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో చేపట్టిన పనులను నాణ్యత పనులను తనిఖీ చేసేందుకు పరిశీలన అధికారులను, ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో చేపట్టక ముందు, పనులు చేసిన తర్వాత ఫోటోలు తీసి సమర్పించాలని కలెక్టర్ సూచించారు. కోడంగల్ మండలం గుండ్లకుంట పాఠశాలలో టాయిలెట్ నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, . మిషన్ భగీరథ ఇఇ బాబు శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఇఇ ఉమేష్, మండల ప్రత్యేక అధికారులు రామ్ రెడ్డి, దీపా రెడ్డి, సత్తార్ , మల్లేశం, వినయ్ కుమార్, గోపాల్, వీర భద్రరావు, ఎస్సీ కార్పొరేషన్ ఇడి బాబు మోజీస్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్... డార్క్ వెబ్ సైట్‌కు లింకేంటీ...

**హైదరాబాద్, జూన్ 28 (ప్రజాస్వరం) : :**

జూన్ 18న యూజీసీ నిర్వహించిన నెట్ పరీక్ష పత్రం ఆదివారం(జూన్ 16న) లీక్ చేసినట్లు సీబీఐ గుర్తించింది. ఆ తర్వాత దానిని ఎన్‌క్రిప్టెడ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫాం డార్క్‌నెట్‌లో అమ్మకానికి ఉంచారని పేర్కొంది. ప్రాథమిక దర్యాప్తులో ఈ విషయాలను గుర్తించింది. నెట్‌లో అక్రమాలు జరిగాయని కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో పనిచేసే భారతీయ సైబర్ నేర విచారణ సమన్వయ కేంద్రానికి చెందిన జాతీయ సైబర్ నేర హెచ్చరికల విశ్లేషణ విభాగం కూడా యూజీసీకి నివేదిక ఇచ్చింది. ఈ నివేదిక ఆధారంగానే యూజీసీ నెట్ పరీక్షను రద్దు చేసింది. అయితే ఇప్పుడు ఈ ఎన్‌క్రిప్టెడ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. డార్క్‌నెట్ అంటే ఏమిటి అది ఎలా పనిచేస్తుంది అనే వివరాలు తెలుసుకుందాం..డార్క్ నెట్‌ను డార్క్ వెబ్ అని కూడా పిలుస్తారు. ఇది రహస్య వెబ్‌సైట్‌ల కేంద్రం. దీనిని ఎన్‌క్రిప్టెడ్ ఛానెల్‌ల ద్వారా మాత్రమే యాక్సెస్ చేస్తారు. ప్రత్యేకమైన వెబ్ బ్రౌజర్ ద్వారా మాత్రమే యాక్సెస్ చేసే ఇంటర్నెట్ సైట్‌ల సముదాయం. ఇంటర్నెట్ కార్యకలాపాలను రహస్యంగా ఉంచడానికి దీనిని ఎక్కువగా ఉపయోగిస్తారు.డార్క్ వెబ్ ఆనియన్ రూటర్ ద్వారా రహస్యంగా పనిచేస్తుంది. రహస్య కమ్యూనికేషన్‌ను ప్రారంభించడానికి ఉచిత, ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్. దొంగిలించడానికి ఉపయోగిస్తారు. డార్క్‌నెట్ దాని ఎండ్%-%టు%-%ఎండ్ ఎన్‌క్రిప్షన్ కారణంగా అందరూ చూడలేరని నిపుణులు అంటున్నారు. డార్క్‌నెట్ టోర్, ఫ్రీనెట్, ఐ2పి, టెయిల్స్ వంటి ప్రత్యేక బ్రౌజర్ల ద్వారా మాత్రమే యాక్సెస్ చేయవచ్చు. టోర్ వంటి గోప్యత%-%కేంద్రీకృత బ్రౌజర్ ప్రాక్సీ సర్వర్ల ద్వారా వెబ్‌పేజీ అభ్యర్థనలను రూట్ చేస్తుంది. దీంతో బ్రౌస్ చేసినవారి ఐపీ అడ్రస్‌లను కూడా గుర్తించలేం.డార్క్‌నెట్ నిషేధిత వస్తువుల అమ్మకం, కొనుగోలు కోసం ఉద్దేశించిన ఒక రహస్య వేదికగా మారింది. డ్రగ్స్, ఆయుధాలు, అశ్లీల కంటెంట్, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు. అనామక కవర్‌ను అందించగల సామర్థ్యం కారణంగా, ప్లాట్‌ఫారమ్ ప్రతీ రకమైన చట్టవిరుద్ధ కార్యకలాపాలలో వ్యవహరించే నేరస్థులకు సురక్షితమైన స్వర్గధామంగా మారింది. బిట్‌కాయిన్ వంటి క్రిప్టోకరెన్సీల పరిణామంతో విషయం సంక్లిష్టంగా మారుతుంది. ఇది పూర్తిగా చట్టపరమైన కారణాల కోసం గోప్యత అవసరమయ్యే వ్యక్తులచే కూడా ఉపయోగించబడుతుంది.భారతదేశంతో సహా అనేక దేశాలలో డార్క్‌నెట్ బ్రౌజర్లు చట్టవిరుద్ధం కానప్పటికీ, వాటి ఉపయోగం తరచుగా కార్యకలాపాలను దాచిపెట్టే ఉద్దేశాన్ని సూచిస్తుంది. బ్లాక్ చేయబడిన సోషల్ మీడియా లేదా డార్క్‌నెట్‌లో నిషేధించబడిన వెబ్‌సైట్‌లను యాక్సెస్ చేయడం వలన ప్రభుత్వ అధికారుల నుంచి చట్టపరమైన పరిణామాలకు దారితీయవచ్చు.నెట్ పేపర్ పరీక్షకు మూడు రోజుల ముందే డార్క్ నెట్‌లో లీక్ అయినట్లు గుర్తించిన నేపథ్యంలో ఇప్పుడు నీట్ పరీక్షలో అవకతవకలకు కూడా డార్క్ నెట్‌కు సంబంధం ఉండి ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకవైపు నీట్ అవకతవకలపై దుమారం కొనసాగుతున్న సమయంలోనే నెట్ పేపర్ లీక్‌కు సంబంధించి షాకింగ్ నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో కేంద్రం నెట్ పేపర్ లీక్‌పై దర్యాప్తు చేస్తున్నట్లుగా నీట్ అవకతవకలపై దర్యాప్తు చేయించడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## పిన్నెల్లిపై మరో కేసు నమోదు

**మాచర్ల, జూన్ 28 (ప్రజాస్వరం) :**

వైసీపీ నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై మరో కేసు నమోదైంది. ఆయనను బుధవారం అర్ధరాత్రి మాచర్ల జూనియర్ సివిల్ కోర్టు లోపలికి తీసుకెళ్తుండగా తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు శివను కడుపులో కొట్టిన వీడియో వైరల్ అయింది. ఈ క్రమంలో తనపై పిన్నెల్లి దాడికి పాల్పడ్డారని శివ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనపై 303 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

# సోషల్ మీడియా వేదికగా ఇండియా కూటమి

**హైదరాబాద్, జూన్ 28 (ప్రజాస్వరం) :**

దేశంలో 18వ లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. వరుసగా మూడోసారి బీజేపీ నేతృత్వంలోని ఏన్డీఏ ప్రభుత్వం ఏర్పడింది. మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే విపక్ష ఇండియా కూటమి అధికార ఎన్డీఏపై యుద్ధం మొదలు పెట్టింది. వాస్తవానికి ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ ఎంపీ సీట్లు తగ్గాయి, అదే సమయంలో కాంగ్రెస్ సీట్లు పెరిగాయి. ఇండియా కూటమి బలం పుంజుకుంది. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల నాటికి బీజేపీని బలహీన పర్చడమే లక్ష్యంగా ఇండియా కూటమి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది.బీజేపీకి బలంగా భావించే సోషల్ మీడియానే ఇప్పుడు ఇండియా కూటమి వేదికగా చేసుకుంది. సైలెంట్‌గా కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం మొదలు పెట్టింది. ఇటీవల ఐఆర్‌సీటీసీ కొత్త నిబంధనలు అంటూ విస్తృతంగా ప్రచారం చేసింది. వ్యక్తిగత ఖాతా ఉన్నవారు ఇతరులకు టికెట్ బుకింగ్ చేస్తే జైలుకు వెళ్తారని సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేశారు. అయితే దీనిపై రైల్వే శాఖ వివరణ ఇచ్చుకుంది. ఇందులో వాస్తవం లేదని, తప్పుడు వార్తలు నమ్మొద్దని సూచించింది. కానీ, అప్పటికే ప్రజల్లో కేంద్రంపై ఆగ్రహం వ్యక్తమైంది.ఇక సోషల్ మీడియా వేదికగానే జీఎస్టీపైనా ప్రచారం మొదలు పెట్టారు. గతంలో కూడా అనేక రకాల పన్నులు ఉండేవి. కానీ, కేంద్రం ఈ పన్నులన్నీ కలిసి జీఎస్టీ పేరుతో ఒకే గాటికి తెచ్చింది. దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం అమలు చేస్తోంది. కానీ, దీనిపై విపక్ష ఇండియా కూటమి ఇప్పుడు కేంద్రం భారీగా పన్నులు విధిస్తోందని ప్రచారం మొదలు పెట్టింది. గతంలో వేర్వేరు పన్నులు కట్టినా అవి మనకు తెలిసేవి కావు. కానీ బీజేపీ జీఎస్టీ విధానంతో పౌరులు ఎంత పన్ను చెల్లిస్తున్నార్న విషయం తెలిసేలా చేసింది. దీనినే ఇపుపడు విపక్ష కూటమి తమకు అనుకూలంగా మార్చుకుంటోంది. కేంద్రం జీఎస్టీ రూపంలో భారీగా పన్నులు వసూలు చేస్తోందని ప్రచారం చేస్తున్నాయి. తద్వారా కేంద్రంపై విషం చిమ్మే ప్రయత్నం జరుగుతోంది.ఇక కేంద్రం వసూలు చేస్తున్న టోల్ ట్యాక్స్‌పైనా విపక్షాలు ప్రచార జోరు పెంచాయి. ఎన్నికలు ముగిసిన వెంటనే జూన్ 1 అర్ధరాత్రి నుంచి టోల్ చార్జీలు 5 శాతం పెరిగాయి. దీంతో ఇప్పుడు దీనిని కూడా విపక్ష కూటమి తనకు అనుకూలంగా, కేంద్రంపై వ్యతిరేకంగా ప్రచారం చేసుకుంటున్నాయి. అటల్‌బిహారి వాజ్‌పేయి అమలు చేసిన స్వర్ చతుర్భుజి పథకంంలో భాగంగా ప్రధాని మోదీ రోడ్ల విస్తరణకు అనేక చర్యలు చేపట్టారు. మోదీ ప్రధాని అయ్యాక వేల కిలోమీటర్ల రోడ్లు విస్తరణకు నోచుకున్నాయి. గతంలో ఉన్న గతుకుల రోడ్లు కనిపించడం లేదు. దూర భారం చాలా వరకు తగ్గింది. రెండు మూడు గంటల్లోనే వందల కిలోమీటర్లు ప్రయాణించ గలుగుతన్నారు. సౌకర్యాలు మెరుగుపర్చిన నేపథ్యంలో రహదారుల నిర్వహణకు అయ్యే చార్జీలను కూడా కేంద్రం వాహనదారుల నుంచే వసూలు చేస్తుంది. అందుకే రోడ్లు అందరికీ సౌకర్యంగా ఉంటన్నాయి. పెరుగుతున్న రేట్లకు అనుగుణంగా టోల్ చార్జీలను కూడా కేంద్రం సవరిస్తోంది. దీనిని కూడా విపక్షం తమకు అనుకూలంగా ప్రచారం చేసుకుంటోంది.ఇలా అనేక కార్యక్రమాలపై కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని విపక్ష పార్టీలు సోషల్ మీడియా వేదికగా మెల్లిగా జనంలోకి చొప్పిస్తున్నాయి. ఉన్నఫలంగా ప్రభుత్వానికి ఏమీ కాకపోయినా.. రాబోయే రోజుల్లో ఇవి బీజేపీకి నష్టం కలిగిస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
శనివారం 29 జూన్ 2024
మెదక్
సంగారెడ్డి-సిద్దిపేట
www.prajaswaramdaily.com


## ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో సమస్యలను పరిష్కరించాలి

**తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్**



**మెదక్, జూన్ 28 (ప్రజాస్వరం) :**

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ పదోన్నతి, బదిలీల లో ఏర్పడిన సమస్యలను పరిష్కరించాలని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ కి తపస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రస్తుతం పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు రెండు మూడు సబ్జెక్టులలో ప్రమోషన్ రావడం జరిగిందని, వాటిలో ఒకటి మాత్రమే తీసుకున్న తర్వాత మిగతా సబ్జెక్టులు ఖాళీగా ఉండడం జరుగుతుందని అన్నారు. కావున వాటిని కూడా బదిలీల కంటే ముందే పూర్తి చేయలని అన్నారు. ఈ యొక్క స్థానాలను భర్తీ చేయడం ద్వారా సీనియర్ ఎస్జిటి లకు కొంత మేరకు న్యాయం జరుగుతుందని, ఎస్జిటి ల బదిలీల సందర్భంగా ప్రతి రోజు సుమారు 400 మంది ఉపాధ్యాయులకు మాత్రమే కౌన్సిలింగ్ నిర్వహించాలని లేకపోతే ఒక ఉపాధ్యాయుడు దాదాపు 1000 నుండి 1500 ఖాళీలను వెబ్ ఆప్షన్ ద్వారా పెట్టుకోవడం ఇబ్బందిగా మారుతుందని అన్నారు. దీని ద్వారా అనేక తప్పులు జరగడానికి అవకాశం ఉందన్నారు. బదిలీల కౌన్సిలింగ్ లో ఎలాంటి ఇబ్బంది లేనందున ప్రతి రోజు 400 మందికి మాత్రమే కౌన్సిలింగ్ నిర్వహించాలని, మ్యూచువల్ వారికి జిఓ 317 వచ్చిన వారికి 2024 వరకు కట్ ఆఫ్ తేదీని తీసుకొని వారికి కూడా బదిలీల్లో అవకాశం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా నాయకులు మాధవరెడ్డి, ఆంజనేయులు, శ్రీకాంత్, సతీష్, సురేందర్, వెంకటేష్, ప్రశాంత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



**మెదక్, జూన్ 28 (ప్రజాస్వరం) :**

ప్రైవేట్ యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్న అధికారులు నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్ పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రం రాందాస్ చౌరస్తా వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తుంటే పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో అత్యధిక ఫీజు లు ప్రైవేట్ పాఠశాలల్లో వసూలు చేస్తున్న అధికారులు చూసి చూడనట్టు వివరిస్తున్నారని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో అక్రమంగా పుస్తకాలు అమ్ముతున్న ప్రైవేట్ యాజమాన్యాలకు తొత్తుగా వ్యవహరిస్తూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. పేద విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని పీల్చడానికి ప్రైవేటు యాజమాన్యాలు ప్రయత్నిస్తుండగా దాన్ని ఆపాలని ఉద్యమం నిర్వహిస్తున్న ఏబీవీపీ కార్యకర్తలను పోలీసులను అడ్డం పెట్టుకొని అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. దీన్ని ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి విద్యారంగం గురించి ఒక్క మాట కూడా మాట్లాడాలేని దిక్కుమాలిన సీఎం ఎన్నుకోవడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం అన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి సారిగా వచ్చిన నూతన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణ కొరకు ప్రభుత్వం ఆలోచించిన పాపాన పోలేదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజరు లేని పరిస్థితిని చూడవలసి వస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో అధ్యాపకులు లేకపోవడం వల్ల ఈరోజు కూడా మెదక్ జిల్లా రామాయంపేట మండలం శాలిపేటలో విద్యార్థులు రోడ్డెక్కాల్సినటువంటి పరిస్థితి ఏర్పడిందని అన్నారు. నూతనంగా బదిలీలైన సందర్భంగా కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు వాళ్ళ రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం దందాల కోసం రీ జాయినింగ్ డిఈఓ ను అడ్డం పెట్టుకొని చేస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల ఖాళీగా ఉన్నటువంటి పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల ఇవి ఖాళీ అవడంతో పాటు ఉన్నవి కూడా భర్తీ కాలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఉన్నతాధికారులు ప్రైవేట్ పాఠశాలల ఆగడాలను అరికట్టి ప్రభుత్వ పాఠశాలల బాగు కోసం ప్రయత్నం చేయాలని, అక్రమాలకు పాల్పడుతున్న విద్యాధికారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు విజ్ఞాన్, నిఖిల్, కార్తికేయ, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గవర్నర్‌కు స్వాగతం పలికిన మంత్రి నారా లోకేష్

**అమరావతి, జూన్ 28 (ప్రజాస్వరం) :**

సీఎం చంద్రబాబు ని మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చిన తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్ కి ఉండవల్లి నివాసం వద్ద మంత్రి నారా లోకేష్ సాదర స్వాగతం పలికారు. మంగళగిరి చేనేత శాలువాతో గవర్నర్ని సత్కరించారు తన నియోజకవర్గం మంగళగిరి చేనేతకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు మంత్రి నారా లోకేష్ ప్రతి సందర్భాన్ని వినియోగించుకుంటున్నారు.

# ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లాకలెక్టర్ రాహుల్ రాజ్**

**వెల్దుర్తి, జూన్ 28 (ప్రజాస్వరం) :**





ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వెల్దుర్తి మండల తాహాసిల్దార్ కార్యాలయాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక పశు వైద్య కేంద్రంలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధరణి దరఖాస్తుల పరిష్కరణ పురోగతిని కలెక్టర్ పరిశీలించి పరిష్కరించేందుకు తగు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి వారం రోజుల్లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ఆ మేరకు మండల తహసిల్దార్లు రోజువారీగా విభజించుకొని పరిష్కారం చేయాలని ఆదేశించారు. అదనపు సమయం కేటాయించి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలని సూచించారు. వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో 100 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయన్నారు. వాటి పరిష్కార దిశగా సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలిస్తూ ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్యం అందించాలని మందుల కొరత లేకుండా చూడాలన్నారు. వైద్యాధికారులు ఎలా చూస్తున్నారు ఏ విధమైన మందులు ఇస్తున్నారు ఎలా సమయపాలన పాటిస్తున్నారు సదుపాయాలు ఎలా ఉన్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులు మందులను పరిశీలించారు. మండల కేంద్రం లోని ప్రాథమిక పశు వైద్య కేంద్రం ను పరిశీలిస్తూ పశువులు రోగాల బారిన పడకుండా కాపాడాలని పశువైద్యాధికారులు సమయపాలన పాటించాలన్నారు. ప్రాథమిక పశు వైద్య కేంద్రంలో పలు రకాల మందులను పరిశీలించారు. పశువైద్యాధికారుల హాజర నమోదును పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తాహసిల్దార్ తులసి రామ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు గనుల వేలంను వ్యతిరేకిస్తూ సీపీఎం ర్యాలీ

**సంగారెడ్డి, జూన్ 28 (ప్రజాస్వరం) :**



బొగ్గు గనుల వేలం పాటను ఆపి సింగరేణికి నేరుగా కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సంగారెడ్డి ఐ బి నుండి న్యూ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అతిమేల మానిక్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేంద్ర బిజెపి ప్రభుత్వం వేలంపాటను వేస్తున్నదని సింగరేణి కంపెనీ కూడా ప్రైవేట్ సంస్థలతో వేలంపాటలో పోటీపడాలని స్థితికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారువాస్తవానికి శ్రావణపల్లిలో సింగరేణి సంస్థ బొగ్గు తవ్వాలి కానీ వేలంపాట ద్వారా ప్రైవేట్ సంస్థలకు అవకాశం కల్పించి బొగ్గు గనులను సరైంది కాదన్నారు మన రాష్ట్రం నుంచి బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలంపాటనుప్రారంభించడం సిగ్గుచేటు అని అన్నారు బొగ్గు గనులన్నీ ప్రైవేటు సంస్థలకు ఇచ్చిన తర్వాత సింగరేణి మిగిలేదేముంటుందని క్రమంగా సింగరేణి సంస్థను బలహీనపరిచి నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు నగదీకరణ పేరుతో దేశంలో ఆరు లక్షల కోట్ల విలువైన అస్తూలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టిందని అందులో భాగంగానే కోట్ల విలువైన గనులను ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలని నిర్ణయాన్ని తీసుకుందని విమర్శించారు గత పది సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం దాదాపుగా 200 బొగ్గు భవులను ప్రవేశ సంస్థలకు కట్టబెట్టారని ప్రభుత్వ రంగంలో గనులు లేకపోతే యువతకు ఉపాధి అవకాశాలు కనుమరుగవుతాయి అని ఆవేదన వ్యక్తం చేశారు రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి కూడా బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకోలేకపోయారని విమర్శించారు,ప్రస్తుతం సింగరేణి 40 వేల మంది పర్మినెంట్ కార్మికులకు మరో 26,000 మంది కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నదని రికార్డు స్థాయిలో అతి తక్కువ ధరకే నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్న ఘనత సింగరేణి సంస్థకే చెందుతుందని అన్నారు కేంద్రరాష్ట్రప్రభుత్వాలకు అనేక రూపాలలో ఆదాయాన్ని తీసుకొస్తున్న సింగరేణిని ప్రైవేటీకరణ అప్పజెప్పి ప్రభుత్వ ఉపాధి అవకాశాలను కొల్లగొడుతున్న కేంద్ర ప్రభుత్వ ధమననీతిని రాష్ట్ర ప్రజానీకం ఖండించాలని అన్నారు బొగ్గు గనుల ప్రైవేటీకరణ వేగంగా జరిగితే విద్యుత్తు ధర విపరీతంగా పెరుగుతుందని అన్నారు సింగరేణికి చెందిన 22 బొగ్గు బావుల్లో బొగ్గు నిల్వలు అడగండి పోయాయని కొత్త బ్లాకులోతవ్వకాలు ప్రారంభించాలని కానీ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఇందుకు అనుమతించకుండా మోకాలుఅడ్డుతున్నదని విమర్శించారు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల తెలంగాణ ప్రజానీకానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని కాబట్టి శ్రావణపల్లి బ్లాకు తో పాటు మిగతా బ్లాక్ లను కూడా తక్షణమే సింగరేణిఅప్పగించాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వముఅఖిలపక్షాన్ని కలుపుకొని కేంద్రం మీద ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు అందుకు అనుగుణంగా రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకొని శాసనసభ తీర్మానం చేయాలని లేని పక్షంలో ప్రజానీకాన్ని కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీరం మల్లేశం, జి.సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, నర్సింహులు, ప్రవీణ్, నాయకులు అశోక్, కృష్ణ, నాగభూషణం, శ్రీనివాస్, శివ, అనిల్, రాజు, శ్రీనివాస్ గౌడ్ తది తరులు పాల్గొన్నారు.

## 44వ జాతీయ రహదారి రక్త సిక్తం..

**రెండు లారీలు ఢీ..**

**ఐదుగురు మృతి. పలువురికి తీవ్ర గాయాలు**

**మేడ్చల్, జూన్ 28 (ప్రజాస్వరం) :**

మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం శివారులో గల 44వ జాతీయ రహదారి బై పాస్ పై హైదరాబాద్ వైపు వస్తున్న రెండు లారీలు శుక్రవారం ఢీ కొట్టుకున్న రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. మరి కొందరు గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మేకల వ్యాపారం చేసే వ్యాపారులు లారీలో హైదరాబాదుకు మేకలు తరలిస్తుండగా ఎదురుగా వెళ్తున్న పశువుల దానా లారీని వేగంగా వెనుక నుండి ఢీకొట్టడంతో ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్ రాష్ట్రం గుహారేవకు చెందిన ఎండీ ఇబ్రహీం(21), చిక్వా రాజు(57), చిక్వ మనీష్ కుమార్ (30), ఎండీ షబ్బీర్ ఖాన్ (48), ఎండీ జిషన్ (21) మృతి చెందారు. నాగ్ పూర్ నుంచి హైదరాబాద్ కు మేకలు తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.రమేష్, మహేష్, శుక్లాల్, బుట్టా సింగ్, లాల్ మనీ లకు గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని ఎస్పీ బాలస్వామి, డీఎస్పీ వెంకట్ రెడ్డిలు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించి క్షత గాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్పించారు. చేగుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఏబీవీపీ నేతల అందోళన..అరెస్టు

**హైదరాబాద్, జూన్ 28 (ప్రజాస్వరం) :**

సంవత్సరాల తరబడి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, సమస్యలపైన నిత్యం విద్యార్థి పరిషత్ నుండి అధికారులకు వినతి పత్రాలు అందజేసినప్పటికీ పట్టించుకోవడంలేదని ఏబీవీపీ నేతలు ఆరోపించారు. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు లేక సరిపడ అధ్యాపకులు లేక నానా అవస్థలు పడుతుంటే మరొకవైపు ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలలు లక్షలకు లక్షలు ఫీజులు దండుకుంటున్న వైనం. ఇవేవీ పట్టించుకోనటువంటి ప్రభుత్వం కేవలం చర్యలు తీసుకుంటామంటూ హామీలు ఇస్తూ చేతులు దులుపుకుంటుంది. అక్రమాలకు పాల్పడిన ప్రైవేటు, కార్పోరేట్ విద్యాసంస్థలపైన చర్యలు తీసుకుంటామంటూ,ఫీజు నియంత్రణ చట్టం అమలు చేస్తామంటూ హామీలు ఇస్తున్నారు తప్ప అమలు చేయడం లేదు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడిని అరికట్టడంలో మరియు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలోసర్కార్ విఫలమైందని వారు ఆరోపించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయాన్ని ముట్టడి చేసారు. విద్యార్థులు పోలీసులకు తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి ఏబీవీపీ నాయకులను అరెస్ట్ చేసి బేగంబజార్ పోలీస్ స్టేషన్ కి తరలించారు.

## టీచర్ల కొరత తీర్చాలంటూ రోడ్ ఎక్కిన విద్యార్థులు, తల్లిదండ్రులు



**రామయంపేట, జూన్ 28 (ప్రజాస్వరం) :**

చిన్న శంకరంపేట మండలం శాలిపేట గ్రామంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీచర్ల కొరత తీర్చాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు రామాయంపేట గవ్వలపల్లి రహదారిపై రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపై వంట వార్పు నిర్వహించి నిరసన తెలిపారు, ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు లేక గత సంవత్సరం చాలామంది విద్యార్థులు ఫెయిలయ్యారని, కేవలం ఇద్దరు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారని తద్వారా ఈ సంవత్సరం కూడా ఉపాధ్యాయులు లేకపోతే విద్యార్థుల బంగారు భవిష్యత్తు పాడవుతుందని ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు డిమాండ్ చేస్తూ దాదాపు రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు.

## బృందావన్ కాలనీలో హత్య కలకలం

**విజయవాడ, జూన్ 28 (ప్రజాస్వరం) :**

విజయవాడ లోని సింధు భవన్ వద్ద కిరాణా షాపు వ్యాపారి హత్య కలకలం రేపింది. వ్యాపారి కుమార్తె ఓ యువకుడిని ప్రేమిస్తున్నట్టు సమాచారం. సదరు యువకుడిని మందలించడంతో హత్య చేసినట్టు అనుమానం. షాపు మూసి ఇంటికి వెళ్తున్న సమయంలో కత్తితో దాడి జరిగింది. దాంతో వ్యాపారి అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణలంక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, దర్యాప్తు ప్రారంభించారు.

## సీజనల్ వ్యాధులపై మంత్రి నారాయణ సమీక్ష

**అమరావతి, జూన్ 28 (ప్రజాస్వరం) :**

రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్ ల కమిషనర్లతో రాష్ట్ర సచివాలయంలో పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధులైన డయోరియా, డెంగ్యూ మలేరియా మరియు ఇతర వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను, త్రాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు మరియు మున్సిపల్ కార్పొరేషన్లను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సమావేశములో మంత్రి సమీక్షించారు. రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్, సిడిఎంఎ శ్రీధర్, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ ఆనందరావు మరియు 17 మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు ఈ సమీక్ష సమావేశం లో పాల్గొన్నారు..